
ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు
8-6-'55

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



రా ధా మా ధ వ ము

—చిత్రకారుడు: టి. సుందరబాబు, కర్నూలు.


సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

సంపుటము 48
సంచిక 40
8-6-55

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

మన్మథ జ్యేష్ఠ బహుళ తృతీయ బుధవారం



'రన్నింగ్ రేస్'

ఫోటో: ఆర్. గోపాలస్వామి, రాజమండ్రి.

చీకట్లో సముద్రం

సముద్రం సముద్రం వినీలసముద్రం విశాల సముద్రం కోటి కెరటాల నాలుకల దీటా - కోకటిపాట పాడినపాటే పాడే నిరంతరసముద్రం - జోరీగలాగ హోరెత్తే సముద్రం కాలకంఠుడిలాగ నోరు తెరచిన సముద్రం - కాలంకన్నా ముసలిది సముద్రం అన్నిటికన్నా అసలైనది నిసలైనది ఆది మూర్తి సముద్రం. సాగరం జీవితం జీవితం సాగరం. సత్యం చచ్చిందని నిత్యం రోదించే నితంతువు విహాయసపథంతో విలాసవంతంగా దాంపత్యంచేసే నిత్య పుణ్యస్త్రీ భూమిని మింగివేసే భూతం. తిమింగిలాలని కడుపులో పెట్టుకొని కెరటాల నురుగుని కక్కి వేస్తుంటుం. యుద్ధనౌకల ఔషధం వాణిజ్యనౌకల భోజనంచేసేభోగి. సాగరం గంభీరం. గంభీరం సాగరం.

సముద్రంతో మొదలైంది సృష్టికథ! సముద్రంతో అంతమవుతుంది సృష్టివ్యథ. సముద్రంలో జనించింది జీవం. సముద్రంలో పోతుంది ప్రాణం. నిప్పుని నీళ్లు తినేస్తాయి గాని, నీళ్లలో నిప్పు ఉంది. నీళ్లలో ఉప్పు ఉంది. ఉప్పు నాగరికతకి మొదటిమెట్టు. నీళ్ళలో ఉప్పుఉన్నట్టే నీళ్ళలో నాగరికత తుప్పు పడుతుంది. అయినా సాగరంలో సాగరంతో సాగరంవల్ల పుట్టింది సృష్టికథ. అందుకే సాగరంగురించే ఈనాకథ.

సైకతస్థలాన చలిగాలిలో ఒరుసుకొని కూర్చొని ప్రియవచనాలు ఉత్తుత్తి తీపి పలుకులు కూడబలుక్కునే ప్రేమికులగురించి కాదు. వేసవికాలంలో వేరుశెనగకాయలు తింటూ కులాసా కుర్చీ టప్పాలుకొట్టే సోడా షోక్కిల్లాలగురించి కాదు. ఊళ్లో పడుక్కొనడానికి పంచలేక నడచి నడచి అలసిపోయి ఇసుకతిన్నె మీద ఉత్తరీయం పరుచుకొని ఆదమరచి నిద్రపోయే నిరుద్యోగిగురించి కాదు. శ్వాసలిచ్చినవాడు మోసగించితే కడుపులోని పాపని, మెడవి[illegible]పాపాన్నీ అవమానభారాన్నీ మోయలేక అర్ధరాత్రి ఆనాధల్ని ఆదరించే సాగరుణ్ణి వెతుక్కుంటూ వచ్చి నీళ్ళలోకి నడిచివెళ్లే వంచితురాలిగురించికాదు. అర్థం శుభం తెలియని అర్భకురాలిగురించి, అయిదేళ్ళ పాపగురించి, అతి చిన్నపిల్లగురించి.

నదీనాం సాగరోగతిః. ఈ చంటిపిల్ల వంట్లో నదులున్నాయి. సముద్రంతో లీనమవుదామన్న తహతహలున్నాయి. అయితే కొండల్లో పుట్టి మైదానంలోకి ప్రవేశించకముందే ఎండిపోయే నదులు. అతిచిన్న సెలయేరు. ఒక ముద్దువాగు. అకారణంగాపుట్టి అకాలంలో అదృశ్యమయ్యే జీవధార.

కథ ఎలా అంతమవుతుందో ముందే చెప్పేస్తున్నాకదూ. సస్పెన్సూ, డ్రామా, కొసమెరుపూ ఏమీ లేకుండా రాస్తే కథానిక కాదంటారు. అయితే జీవితంలో ఏం సస్పెన్సు ఉంది. జీవితం ఎలా ముగుస్తుందో అందరికీ తెలిసినదే. జాతస్యమరణం ధ్రువమ్. అనుకోకుండా అంతమవుతుందని అనుకుంటున్నారుకదూ. అందులో సస్పెన్సులేదని అడుగుతున్నారు. అవునా. అయితే అనుకోనివాడు ఒకడున్నాడు. వాడు అడుగడుగునా వార్నింగ్ ఇస్తూనే ఉన్నాడు. వాడు పిడయితె ఆశ్చర్యం ఏముంది. వాడు సాగరుడు. వాడిలో ఐక్యంఅవడం ప్రాణానికి పరమావధి. ప్రాణం జీవనది. జీవం సాగరుడినే వెతుక్కుంటుంది. జీవం అభిసారిక. నా నాయిక అమాయిక.

ఆ ఊరికి సముద్రం అయిదుమైళ్ల దూరంలో ఉంది. అవును ఊరికి సముద్రమే అయిదుమైళ్ల దూరంలో ఉంది. ఏమంటే సముద్రం ముందుకు రాగలదు. తలుచుకుంటే వెనక్కి పోగలదు. కాని ఊరు - ఉన్న ఊళ్లోనే ఉండిపోవాలి. అందుకే సముద్రమే కనికరించి ఎప్పుడూ ఆ ఊరికి అయిదుమైళ్ల దూరంలోనే ఉంటున్నది. అందుకు సాగరానికి ఊరు సర్వదా కృతజ్ఞ రాలు.

ఆ ఊళ్లో పాకలున్నాయి. గుడిసెలున్నాయి. గుళ్లున్నాయి బళ్లున్నాయి ఇళ్లున్నాయి. అయితే ఏవీ మూడు నిలువుల ఎత్తుకన్నా హెచ్చులేవు. ఎత్తు - మానవుడి చిత్తాన్ని తెలియజేస్తుంది. ఔన్నత్యం వాడి పరమావధి. అయినా ఆ ఊళ్ళో రెండంతస్తులమేడ ఒకటే ఉంది. ఆ మేడలో ఒక ప్లీడరుంటున్నాడు. ఆ ప్లీడరుకొక గుమస్తా ఉన్నాడు. ప్లీడరుకు ప్రాక్టీసు ఉంది. మంచిరాబడి ఉంది. మేడలో ప్లీడరుంటున్నాడు. ఒక పెంకుటింట్లో గుమస్తా ఉంటున్నాడు. మేడ ప్లీడరు స్వంతం. పెంకుటిల్లు గుమస్తా స్వంతం కాదు. అద్దె కొంప.

ప్లీడరుగారన్నా - ప్లీడరుగారి మేడన్నా ఊళ్ళో అందరూ గౌరవంగా చూస్తారు. గుమస్తాని ప్లీడరుగారి గుమస్తా అనే అంటారు. గుమస్తాకి ఇది బాధ. ప్లీడరూ తనూ చిన్నప్పట్నుంచీ స్నేహితులు. పెద్దయ్యాకకూడా స్నేహితులే. యజమాని నౌకరు అనే సంబంధం వాళ్ళమధ్య లేదు. ఊళ్లో ఉంది. అందుకే గుమస్తాకి మనసులోనే ఈబాధ ఉంది. ఆబాధ ఉన్నట్టు కూడా గుమస్తాకి చైతన్యంగా తెలియదు. అవ్యక్తంగా లోలోపల లోపల ఏదో ఈసు. తగని ఈర్ష్య. ఎత్తుకి ఎగరాలని ఆశ. సమాన హోదాలో ఉండాలని తాపత్రయం. తలదన్నాలని కోరిక. తప్పేం లేదు. అవకాశం రావాలి.

ఆదిలో ప్లీడరుగారికొక కూతురుంది. గుమస్తాకి లేదు. ప్లీడరుగారికి గుర్రబ్బండీ ఉంది. గుమస్తాకి లేదు. ప్లీడరుగారికూతురు గుర్రబ్బండీలో షికారు వెళుతుంది. గుమస్తాకి ఈ సరదా లేదు. ఎనిమిదోఏడు రాగానే

ముఖచిత్రం : "రుఖ్ సానా" హిందీచిత్రంలో మీనాకుమారి, షమ్మీ.

ప్లీడరుగారు కూతురికి పెళ్లి చేశాడు. ఊరంత పందిరివేశాడు. ఊరంతా అందులోనే ఉంది. అయిదురోజులు. ఆనందం. పండుగ. అదంతా గుమస్తా తన చేతిమీదుగానే చేశాడు. తనకి కూతురు లేదు. తను పెళ్లిచేయటంలేదు. అయినా ప్లీడరుకూతురు పెళ్లిఖర్చులన్నీ - ఏర్పాట్లన్నీ తనచేతిమీదుగానే జరిగాయి. ఇది బాధాకరం.

ప్లీడరు కూతుర్ని అత్తవారింటికి పంపించాడు. వంద కావిళ్ళసారె పెట్టాడు. పందిరిపట్టె మంచం - వంద రవివర్మ పటాలు - నాలుగు అద్దాల బీరువాలు. పది సంవత్సరాలకి సరిపొయ్యేపాత్ర సామాగ్రి. రెండు ఫర్లాంగుల ఊరేగింపు ఆసారె. తన ఇంట్లో ఎన్ని వస్తువులున్నాయో అన్ని సాల్తీలు కొత్తవి తెప్పించి సారెపెట్టాడు. ఇవన్నీ ప్లీడరుగారి కూతురు కోసం గుమస్తాయే కొన్నాడు. కూలీల తల కెత్తించాడు. వీధిలో నడిపించాడు. సారె పంపించాడు. ఏదీ తన కూతురు. ఏది తన ముద్దూ ముచ్చటా ఏదీ తన వైభవం?

ప్లీడరు తనస్నేహితుడు. బాల్యమిత్రుడు. తనని నిశ్శబ్దంగా అదృశ్యంగా వెక్కిరిస్తున్నాడు ఈసడిస్తున్నాడు. మోసగిస్తున్నాడు. గుమాస్తాకి పదేళ్లనుండీ ఈ బాధ ఉంది అందుకే ప్లీడరుగారి కూతురి పెళ్లి మాటలనుంచీ గుమాస్తా పగతీర్చుకోడానికి పట్టు పట్టాడు. కూతురు ముచ్చటలతో తనని మోసగిస్తున్న ప్లీడర్ని తనే మోసగించడం మొదలెట్టాడు. డబ్బు తినేయడం ఆరంభించాడు.

డబ్బు తినడం మొదలు పెట్టిన వాళ్లకి ఇంకొకటి రుచించదు. పొద్దున్నే వచ్చి మంచినీళ్లు పుచ్చుకోడానికి ముందు విచ్చు రూపాయి నమిలి మింగితేనేగాని వాడికి తెల్లవారదు. పొద్దు పొడిచిన క్షణంనుండి పొద్దు గడిచే క్షణందాకా గంటలని రూపాయలతో తింటేనేగాని వాడికి తృప్తి ఉండదు.

ప్లీడరు ఇంటి ఖర్చులన్నీ గుమాస్తా చేతిమీదుగానే అవుతాయి. పావలా బంగాళా దుంపలు కొంటే అయిదణాలు పద్దురాస్తే పుట్టిమునిగిపోదు. పట్టుకొనేవాళ్లు ఉండరు. ఇంటికొక పుష్పం ఈశ్వరుడికొక మాల. రోజుకొరూపాయి కాజేస్తే పదేళ్ళలో సంపద. ప్రతిరోజూ మోసగిస్తూ ప్లీడరుమీద గుమస్తా పగతీర్చుకొంటున్నాననుకొన్నాడుగాని పదేళ్ళలో కాజేసిన డబ్బు చూస్తే గుమాస్తా గుండె బరువెక్కింది. ఇంత డబ్బు ఏం చేసుకోడానికి? ఎవరు అనుభవించడానికి? ఏది తన కూతురు? ఏది తన ముద్దూ ముచ్చట? ఏదీ తన వైభవం?

ఇంత డబ్బు మూలుగుతున్నదే - కూతురుంటే గుర్రబ్బండీ కొని పెట్టవచ్చే - షికారు తీసుకెళ్లవచ్చే - ఊరంత పందిరివేసి ఊరంత అందులో వుండేట్టు చేయవచ్చే బజారంతా కొని సారెపంపవచ్చే ఏదీ తన కూతురు?

గుమస్తా ఆవేదన గుండెలు తరిగే ఆవేదన. అతడిలో దుఃఖం ఏరులు పారింది. వరదలు అయింది. అతడిలో సముద్రం ఉంది. ఆ సముద్రానికి విరామం లేదు. ఒకటే హోరు. ఒకటే రోదన. నిలువెత్తు పొంగు. కదలివచ్చే కడలిపొంగులు. కడలిలో హాలాహాలం పుట్టింది. హాలాహాలం దహిస్తుంది. ఆతరువాత వెంటనే అమృతం పుడుతుందా?

గుమస్తాకి సంతానం కలిగింది. కూతురు కాదు. కొడుకు. నయం. ఎవరో ఒకరు. అదృష్టం ఉండాలిగాని: అనేలేదు. ఏడాది తిరగకముందే శిశువు కన్ను మూశాడు. గుమాస్తా విన్నుపొడిచినట్టు - కడలిలో హాలాహాలం పుట్టినతరువాత కల్పవృక్షం - పుట్టిపోయింది. కామధేనువు పుట్టింది. గుమాస్తాకి మరొక సంతానం కలిగింది. అదీ ఏడాదిలో పోయింది. ఏడుకానుపులు. ఏ ఒక్కట్టి దక్కలేదు. ఎంతమథన - ఎంత వేదన - ఎంతరోదన. ఎనిమిదో కాన్పు - చిన్నవెన్నెలకంగా వున్నదన్ని సుధాశ్రీ పొడిమిన చెలువ. బిడ్డ దక్కింది. తల్లి పోయింది.

ఒక్కగానొక్క కూతురు. అపురూపం. గారాబం. అల్లారుముద్దు - ఓహో ఇది తన కూతురు. ఇది తనముచ్చట - ఇది తన వైభవం. ఇదే తన చిరకాలతపన - తపనీయ రచన. ఇందుకొరకే జీవించాడు. ఇందుకొరకే జీవిస్తాడు. ప్లీడరుగారికే కాదు. తనకీ ఉంది కూతురు. తనకూతురు గుర్రబ్బండీలో షికారు వెళుతుంది. తనకూతురికి రంగరంగ వైభవంగా తనూ పెళ్లి చేస్తాడు.

★ చీకట్లో సముద్రం ★

జగతిర్చుకొంటాడు. పాపకి ఎవరూ చెయ్యనంతగా ముద్దుచేస్తాడు.

తనకి పాప పుట్టినప్పటికే ప్లీడరుగారికి మనవడు పుట్టాడు. ఆ అబ్బాయీ పాపా స్నేహితులు. ఆటలేస్తారు. ఆడుకొంటున్నప్పుడు అబ్బాయి అన్నాడు "మా తాత గారిమేడ పెద్దమేడ. మీ ఇల్లు చిన్న ఇల్లు." పాప 'మాకూ ఉంది పెద్దయిల్లు' అని అంది. ఏదీ చూపించమన్నాడు అబ్బాయి. పాప నాన్న దగ్గరికెళ్ళింది. 'మన పెద్దయిల్లు ఏదీ?' అని అడిగింది. గుమస్తాకి ఇంతవరకూ ఇది తట్టనేలేదు. ఊళ్ళో అంతా ప్లీడరుగారిమేడ గురించే చెప్పుకొంటారు. తను ప్లీడరుతో సరిసమానంగా అన్ని ప్రాభవాలు జరుపుకుంటూ, అన్ని ముచ్చటలూ తీర్చుకొనబోతున్నాడు. అయితే తనగురించి గొప్పగా చెప్పుకొనడానికి మేడలేదు. తనకి మేడ కావాలి. తనకూతురు సగర్వంగా దాని గురించి చెప్పుకోవాలి. ప్లీడరుగారికి రెండంతస్తులమేడే ఉంది. తను మూడంతస్తులమేడ కట్టించాలి. అప్పుడు ఊళ్ళోకల్లా ఎత్తయిన స్థానం తనకి కావాలి. మేడ కట్టిస్తే గాని తన చిన్నతనాన్ని — ప్లీడరు కన్నా తన ఎక్కువతనాన్ని లోకం గుర్తించదు. తన కూతురి కోరిక సిద్ధించదు. తనకి ఆనందం లభించదు.

విశాలమైన నివేశన స్థలం కొన్నాడు. లోతైన పునాదులు తీయించాడు. శంఖుస్థాపన చేశాడు. పాతికమంది తాపీ మేస్త్రీలను పెట్టాడు. మూడు నెలల్లో మూడు అంతస్తుల మేడ కావాలన్నాడు. పాపకి మూడు నెలలదాకా ఎలాగైనా మురిపింతాలు పెట్టాలి, అంతదాకా ఆ అమ్మాయి ప్లీడరుగారి మనవడితో ఆడుకోకూడదు. ఆ తరవాత ఫరవాలేదు. • ఊళ్ళోకల్లా పెద్ద మేడ మాదే అని అప్పుడు పాప చెప్పగలదు. అంతదాకా — అంతదాకా పాప వేరే ఆడుకోవాలి. అందుకు ఏర్పాట్లు చెయ్యాలి.

చేశాడు పాపకి చక్కటి స్నేహితుడు దొరికాడు. ఆ స్నేహితుడు సాగరుడు, సముద్రాన్ని చూశాక పాపలో ఆనంద సముద్రం ఉప్పొంగింది. సముద్రం సముద్రం వినీల సముద్రం — విశాల సముద్రం — కోటి కెరటాల తీగెల విపంచిక — పాట పాడేస్తాడు. ఆటలాడే దోస్తు — తరంగాలు పాపలేత పాదాలని స్పృశించి అభివందనం చేసి — మహారాజ్ఞి సముఖంలో అభిముఖంగా కనబడుతూ వెనక్కి నడిచే సామంతుల లాగా సెలవు తీసుకొంటాయి. ఇసుక తిన్నెలమీద పిచుక గురించి దిక్కులేని పక్షులకోసం పాప గూళ్ళు కడుతుంది. తటాకాలు నిర్మిస్తుంది. రత్నాకరుడు కనికరించి తీరాన విరజిమ్మిన వెలలేని రత్నాలని సేకరిస్తుంది. చిన్న చిన్న శంఖాలు, ఆలిచిప్పలు, చందమామలు, పలకపుల్లలు, మహాసంపద — అన్నీ పాపకోసమే సాగరుడు ఒడ్డున పడేస్తున్నాడు. సాగరుడు మంచివాడు. చక్కటి చెలికాడు.

మూడు నెలలు దాటాయి. మూడంతస్తుల మేడ లేచింది. గుమస్తా మనసులో ఆశా పుష్పం పూచింది. సంతృప్తి మారుతం వీచింది. పాపని తీసుకొచ్చాడు. మేడ చూపించాడు. పాప మూడో అంతస్తు ఎక్కింది. చుట్టూరా చూసింది. "ఎలా ఉందమ్మా మేడ?" అని అడిగాడు. "నాన్నా! సముద్రం కనబడటం లేదే" అని పాప నిరుత్సాహం వెలిబుచ్చింది. నిజమే. మూడో అంతస్తునుంచి సముద్రం కనబడ్డం లేదు. గుమస్తా — తాపీవాళ్ళని పిలిచాడు. సముద్రం కనబడేదాకా అంతస్తులు కట్టమన్నాడు. 'సముద్రం మన ఇంటినుంచి కనబడుతుందమ్మా — ఏడవకు!' అని కూతుర్ని సముదాయించాడు.

నాల్గో అంతస్తు కట్టారు. సముద్రం కనబడలేదు. అయిదో అంతస్తు కట్టారు. సాగరుడు కనబడలేదు. ఆరో అంతస్తు కట్టినా అంతే. ఏడోది పెంచారు. కనిబడింది. సముద్రం — వినీల విశాల సముద్రం. విలాస విలోల సముద్రం. కోటి కెరటాల నాలుకల చీటా — నిరంతరగానంచేసే నీలాలసముద్రం— కోరికలాగ హోరెత్తే సముద్రం. ఏడో అంతస్తుమీదనుంచి నిద్రపోతున్నట్టు నిశ్చలంగా, బుద్ధిగా నీలంగా కనబడింది.

గుమస్తా పాపని ఏడో అంతస్తుమీదకి తీసుకెళ్ళాడు. సముద్రాన్ని చూపెట్టాడు. పాప ఆనందానికి మేరలేదు. సంతోషంతో గెంతులేసింది. చప్పట్లు చరిచింది. సముద్రాన్ని పిలిచింది. సముద్రుడు సంయ్ అన్నాడు. పాప పొంగిపోయింది. పాప పొంగిపోవడంచూసి గుమస్తా పొంగిపోయాడు. ఏడో అంతస్తుమీద ఆడి ఆడి అలసిపోయింది. నిద్రపోయింది. నిద్రపోతున్న పాపను ఎత్తుకొని గుమస్తా అద్దెయింటికి వెళ్ళాడు. పాపని పడుకోబెట్టాడు. మేస్త్రీలను పిలిచాడు. వారం రోజుల్లో గృహప్రవేశానికి వీలుగా పనులన్నీ పూర్తి చెయ్యమన్నాడు.

పాప నిద్రపోతున్నది. నిద్రలో సముద్రాన్ని తలుచుకొంది. సముద్రంతో ఆడుకొంది. దానిగొంతుతో గొంతు కలిపి టపా పాడింది. తరంగాల ఊయలమీద ఊగుసలాడింది. చిరుచేపలతో ఊగులాడింది. నిద్రలో నవ్వుకొంటున్న పాపని చూసి గుమస్తా సంబరపడ్డాడు.

చీకటిపడ్డది. పాప యింకా నిద్దర లేవలేదు. గుమస్తా లేపలేదు. రాత్రి అలముకొనడం మొదలెట్టింది. చుక్కలు కనబడడం — మేఘాలు విచ్చుకొనడం — నిశి ప్రాకింది. పాప నిద్దరలో చక్కని కల కంటున్నది. గుమస్తా పక్కింటికి వెళ్ళాడు. పాప కలగంటూనే ఉంది. కలలో సముద్రుడు పాపని లాలించాడు. మిఠాయి తినిపించాడు. బొమ్మలు కొనిపెట్టాడు ఒక బొమ్మ ఎంచక్కా ఉంది. అంత మంచి బొమ్మని ఇచ్చిన సముద్రుడు ఎంత మంచివాడు!" "నాదగ్గర ఎంచక్కని బొమ్మ ఉందో" అని ప్లీడరుగారి మనవడికి చూపించింది. వాడు ఆ పిల్ల చేతుల్లోంచి దాన్ని లాక్కుంటున్నాడు. తను ఇవ్వటంలేదు. ఈ పెనుగులాటలో బొమ్మ పడిపోయింది. విరిగిపోయింది. సముద్రుడితో తను చెప్పుకొని ఏడిచింది. అంతకన్నా పెద్ద బొమ్మను సముద్రుడు ఇస్తానన్నాడు. తెస్తానని వెళ్ళిపోయాడు. ఇంకా రాలేదు. ఏడీ సముద్రుడు ఏడీ ఆట చెలికాడు? పాపకి తెలివొచ్చింది. ఇంట్లో అద్దె కొంపలో చీకటిగా ఉంది. బయటకి వచ్చింది. చీకటిగాఉంది. ఏడంతస్తుల మేడదగ్గరికి వెళ్ళింది. చీకటిగా ఉంది. ఏడో అంతస్తు ఎక్కింది. చుట్టూరా చూసింది. చీకటిగా ఉంది. చీకట్లో సముద్రుడు కనబడడం లేదు. పాప పిలిచింది. చీకటిగాఉంది. సముద్రం కనబడడం లేదు. పాపగోడ ఎక్కింది. చీకటిగాఉంది సముద్రుణ్ణి పిలిచింది. చీకటిగా ఉంది.

ఆ తరవాత అంతా చీకటే — గుమస్తా జీవితం అంతా చీకటే. ఏడంతస్తుల మేడ పూర్తిగా చీకటే.

సముద్రంలో లీనమవుదామనుకొన్న నది సముద్రాన్ని చేరకముందే ఎండిపోయింది. పిల్ల వాగులు పెద్ద పరుగులు పరుగెత్తలేవు. మహానదులకు గాని సాగరసంగమం చేసే మహాదృష్టం పట్టదు. కాని ఏజన్మలోనో నోములు నోచుకొన్న చిన్న చిన్న వాగులు — పెద్ద నదిఒడిలో చేరి సముద్రస్నానానికి వెళతాయి. అయితే చీకటి కాటుక అలుముకొంటే — కన్ను పొడుచుకొన్నా తెన్ను తెలియకపోతే, చీకటిలో సముద్రం కనిపించదు. వినిపిస్తుంది. అంతే!

(రేడియో ప్రసారితం)

సీరియల్

ఉదయ కిరణాలు

పోలిశెట్టి సాంబశివరావు

3

ఒక వారం రోజులు గడిచాయి. నరసింహం లేచిపోయినట్టు, ఒక వేళ కనిపిస్తే, జాబు వ్రాయవలసిందని, సోమయాజులు తను ఎరుగున్న బంధువులకందరికీ వ్రాశాడు. కాని ఎవరి దగ్గర నుంచి జవాబు రాలేదు. ఎక్కడికేనా వెళ్లి వెతుకుదామన్నా ఎక్కడికి వెళ్లడం? అయినా ప్రయాణాలకి అయేఖర్చులు ఎక్కడనుంచి తేవడం? తను మిగిల్చే సొమ్మ కాస్తా సీతమ్మ గుప్పెటలో ఉంటుంది. ఆమెను అడిగితే?... ఇంకేమన్నా ఉందా? ఒక్కసారి భయంతో గుటకమింగి, ప్రయాణాలు చేసే ఉద్దేశ్యం మానేశాడు సోమయాజులు.

ప్రకాశం బెంగతో కుమిలిపోతున్నాడు. వయసులో చిన్నవాడైనా కుటుంబపరిస్థితులు అర్థం చేసుకునే జ్ఞానం వచ్చింది. కుటుంబంఆస్తి క్షీణిస్తూండడం, తండ్రి పేకాటలకు డబ్బు విస్తారంగా ఖర్చుపెట్టడం, ఎప్పటికప్పుడు డబ్బులేక సంసార విషయాలు చక్కదిద్దుకుంటూ తల్లి అవస్థపడడం ప్రకాశానికి బాగా తెలిసిన సంగతులే. తండ్రి యింట్లోఉన్నా లేకపోయినా, తనే చిన్నప్పటినుంచీ బజారుకు వెళ్ళి పెచ్చాలు, కూరలు తీసుకురావడం పరిపాటి. బజారులోని ధరలు, కుటుంబానికి అయే ఖర్చు, మనిషికి కావలసిన ముఖ్యావసరాలు, మొదలైన విషయాలన్నీ తన చిన్న లేత మెదడుతో ఊహించుకుంటూ బాగా అర్థంచేసుకున్నాడు ప్రకాశం. తండ్రి లేచిపోయిన యీ పరిస్థితుల్లో, తనకుటుంబం ముందుగతి, తనకీ తమ్ముడికీ చదువులు, చెల్లెలు పెండ్లి, యివన్నీ ఎలా జరుగుతాయో అని పెద్ద తరహాలో ఆలోచించసాగాడు. వయసుకు మించిన తెలివితేటలు ఉండడంవల్ల కుటుంబకష్టాలన్నీ ప్రకాశం హృదయాన్ని దూసుకుని బాధ పెడుతున్నాయి. పెద్దవాళ్లు భరించవలసిన బెంగలన్నీ తనే ఏవేవో ఊహించుకుంటూ బాధపడుతూండడంవల్ల నిద్రాహారాలమీద శ్రద్ధమాని చిక్కిపోసాగాడు.

ప్రకాశానికి ఆరోగ్యం చెడి జ్వరం వచ్చింది ఒకనాడు. కాని ఎవరితోనూ తనకు జ్వరంవచ్చినట్లు చెప్పలేదు. మామూలుగా రెండుమెతుకులు నోట్లో వేసుకుని లేచిపోయాడు, బడికి వెళ్ళాలంటూ. తండ్రి మీద బెంగవల్ల అన్నం సరిగా తినటం లేకేమో అనుకుంది రాధమ్మ. కానీ ఆరోజు ప్రకాశానికి నిజంగా అన్నం సయించలేదు జ్వరంవల్ల.

మామూలుగా పుస్తకాలు తీసుకుని చిట్టిబాబు, ప్రకాశం బడికి బయలుదేరారు. ప్రకాశం స్నేహితులమధ్యఉన్నా ఏదో పరాకుతో ఉంటున్నాడు. అక్కడికి ప్రకాశంబాధ కొంతవరకు అర్థం చేసుకున్న చిట్టిబాబు అప్పుడప్పుడు అతన్ని నవ్వించడానికి ప్రయత్నించేవాడు. ఒకవేళ నవ్వినా, తిరిగి బాధతో ముఖం చిట్లించుకునేవాడు ప్రకాశం.

ప్రకాశం తండ్రి లేచిపోయాడన్నవార్త బడిలో, చుట్టుప్రక్కల వీళ్ళ కుటుంబం ఎరుగున్న వారందరిలో వ్యాపించి పోయింది. కనిపించిన మాష్టారు, ఎరుగున్న విద్యార్థి స్నేహితులు అందరూ రోజూ ప్రకాశంపై ప్రశ్నలు కురిపిస్తున్నారు 'మీ నాన్న కనిపించేడురా' అని. వీటన్నిటికీ ఏ సమాధానం చెప్పలేకపోయేవాడు ప్రకాశం. ఒక్కొక్కసారి దుఃఖం ఉబికి స్తబ్దుడై మౌనంగా కన్నీళ్లు పెట్టుకునేవాడు. ప్రకాశం పరిస్థితిచూసి జాలిగా తమ ప్రశ్నలకు జవాబు కూడా అపేక్షించకుండా కొందరు తమ దారిని వెళ్ళిపోయేవారు. మరికొందరు జవాబుకోసం నిరీక్షిస్తుంటే చిట్టిబాబు ఏదో సమాధానం చెప్పి సర్దేవాడు. కొంతమంది కొంటె కుర్రాళ్లు, క్లాసులో ఎక్కువ మార్కులు తెచ్చుకుంటాడని అసూయపడే విద్యార్థిశత్రువులు, 'ఒరే వీడి నాన్న లేచిపోయాడుటరా? ఎవత్తినో లేవదీసుకుపోయి ఉంటాడు! వీడు కూడా అటువంటి ప్రబుద్ధుడేలే! ఎప్పుడో లేచిపోతాడు' అంటూ యిష్టమొచ్చినట్టు పేలసాగారు. ఇవన్నీ ములుకుల్లా ప్రకాశం లేతహృదయాన్ని గ్రుచ్చుకునేవి.


క్లాసులో మానీటరుగా మాష్టారు లేనప్పుడు కుర్రాళ్లు అల్లరిచెయ్యకుండా చూడవలసిన బాధ్యత ప్రకాశంపై ఉంది. మునుపటిలా సరదాగా, యుక్తితో తోటి విద్యార్థులపై అధికారం చలాయించలేకపోతున్నాడు. క్లాసులోని ఆడపిల్లలు, మొగకుర్రాళ్లు, అందరూ అతన్ని చూసి హేళనగా లోలోపల నవ్వుకునేవారు. మాష్టారు క్లాసులోకి వచ్చేదాకా తప్పని సరిగా మాష్టారు టేబిల్ప్రక్కనే ప్రతిమలా తలవొంచుకు నుంచుని, విద్యార్థులు అల్లరిచేసినా ఏమీ మాట్లాడకుండా ఏదో కాలక్షేపంచేసి తనసీటుకు వచ్చి కూర్చుంటున్నాడు.

జ్వరం లెక్క చెయ్యకుండా బడికి వచ్చాడు ప్రకాశం ఆరోజు. ప్రక్కనే కూర్చున్న చిట్టిబాబుకు ప్రకాశంఒళ్ళు వేడిగా తగిలింది. ఆశ్చర్యంతో 'జ్వరం వచ్చిందేమిటిరా?' అంటూ తలమీద చెయ్యివేసిచూశాడు చిట్టిబాబు. 'ఏమీలేదు, కొంచెం తలనొప్పిగా ఉంది' అన్నాడు ప్రకాశం. చిట్టిబాబు జ్వరం వచ్చిందేమో అని అనుమానపడినా, మళ్ళీ ప్రకాశం మాటలవల్ల సర్దుకుని ఊరుకున్నాడు.

మొదటిపీరియడ్ అయిపోగానే మానీటరుగా ప్రకాశం క్లాసు జాగ్రత్తగా చూడడానికి మాష్టారు కుర్చీప్రక్క నుంచున్నాడు. జ్వరతీవ్రత, ఆయాసము, బడలిక, తండ్రిగురించిన బెంగ ఇవన్నీ అతనికి ఉపద్రవమైన నీరసం కల్గించాయి. కళ్లు తేలిపోయాయి. కాళ్లు పచ్చలు కమ్మాయి. ఒంటినిండా ముచ్చెమటలు పోశాయి. నుంచున్నవాడు హఠాత్తుగా ఒక్కసారి నేలమీద కూలిపోయాడు.

కుర్రాళ్ళంతా దిగ్భ్రమతో గబగబ ప్రకాశాన్ని చుట్టుముట్టారు. చిట్టిబాబు కంగారుగా 'ప్రకాశం! ప్రకాశం!' అంటూ తట్టి ఒళ్లు కుదిపాడు. మాట లేదు. ఒక విద్యార్థి నీళ్లు తేడానికి పరుగెత్తాడు. 'ఏమయింది. ఏమయింది' అంటూ కుర్రాళ్ళంతా గుసగుసలాడుకుంటున్నారు.

ఈలోపుగా తెలుగుమాష్టారు రానే వచ్చారు. కుర్రాళ్లంతా అల్లరి చేస్తున్నారేమో అని లేనికోపం ఒక్కసారి తెచ్చుకుని గబగబా లోపలికి అడుగుపెట్టారు. కాని క్లాసులో తెలివైన విద్యార్థి ప్రకాశం తెలివి తప్పి క్రిందపడిపోయాడనగానే, మాష్టారి హృదయం చివుక్కుమంది. తక్షణం కుర్రాళ్ళని తప్పుకోమని ఒక్కకేక పెట్టి గబగబా ప్రకాశం ముఖంమీద నీళ్లు చల్లారు. కాస్సేపటికి ప్రకాశం ఆయాసంతో లేచి కూర్చున్నాడు. ప్రకాశం ఒళ్లు కాగుతూండడం మాష్టారు గమనించి 'ఇంటికి వెళ్ళిపో ఈ



మైలాపూర్ కపాలేశ్వరాలయ గోపురం

ఫొటో: క. శేషాంజనేయులు—మద్రాసు.

★ ఉదయకిరణాలు ★

వేళకు. జ్వరం వస్తే బడికి ఎందుకు వచ్చావురా బాబూ' అంటూ చిట్టిబాబును పిల్చి ప్రకాశాన్ని ఇంటికి తీసుకువెళ్లమన్నారు.

చిట్టిబాబు రిక్షా పిలవడానికి వెళ్ళాడు. అప్పటికప్పటికే తమాషాగా ఆకాశాన్ని మేఘాలు ఒక్కుమ్మడి ఆవరించాయి. రిక్షా వచ్చి క్లాసు ముందు ఆగగానే ప్రకాశాన్ని రిక్షాలో కూర్చోపెట్టారు మేష్టారు. రిక్షా చక్రాలు రెండు తిరుగులు తిరగకముందే దడదడా వడగండ్లవాన ప్రకాశాన్ని, చిట్టిబాబును ముంచెత్తింది. జ్వరంతో బాధపడుతున్న ప్రకాశానికి వడగండ్ల దెబ్బలతో ఒళ్లు హూనం అయింది. వడగండ్లకు తట్టుకోలేక చిట్టిబాబును కౌగలించుకున్నాడు. ఇంతలో రిక్షావాడు రిక్షా ఆపి, వాళ్ల నెత్తిమీద టాపు లేవదీసి, వానపడకుండా ముందు గుడ్డ కట్టాడు.

ఎండకి కాగిపోయిన నేలమీద వడగళ్ళు పడగానే ఆవిరులు, దుమ్మూ లేగాయి. వాన రక్షణార్థం విస్తరించిన ఒక అసామీగొడుగు గాలి విసురుకు తల్లకిందులయి వడగళ్ల ముత్యాలు నింపుకుంది. కుర్రాళ్ళు ఇంటిఅరుగులమీద నుంచుని మీదకు వచ్చిపడిన వడగళ్లు పట్టుకుంటూ, అల్లరిచేస్తూ, నోట్లో ఊరించుకుంటున్నారు. రిక్షావాడు వడగళ్లధాటికి తట్టుకోలేక దారిలో ఒక యింటిముందు రిక్షా ఆపి, వీధి అరుగు ఎక్కాడు.

అరగంట ఏకధాటిగా ఎడాపెడా కుంభవృష్టికురిసి మళ్ళీ అంతలోనే మెల్లిమెల్లిగా మబ్బులు విడిపోనారంభించాయి.

రిక్షా మళ్ళీ బయలుదేరింది. సూర్య కిరణాలు మబ్బులచాటునుంచి తొంగి చూస్తున్నాయి. ఇంకా కరిగిపోని వడగళ్లు రోడ్డు ఎర్రదుమ్ములో కలిసి ఎండ వెలుగు వక్రీకరణలో కెంపుల్లా మెరుస్తున్నాయి.

వీధిగుమ్మంలో అమ్మలక్కలతో సభచేసి కూర్చున్న రాధమ్మ రిక్షాలోంచి ప్రకాశాన్ని జాగ్రత్తగా దింపుతున్న చిట్టిబాబును చూసి కంగారుగా బయటికి పరుగెత్తుకొచ్చింది.

'ఏంరా బాబు! ఏమయింది' అంటూ చిట్టిబాబు నడిగింది.

రాధమ్మ గబగబ లోపలికి వెళ్ళి ప్రకాశానికి ప్రక్కపరిచి పడుకోబెట్టింది. చిట్టిబాబు క్లాసులో జరిగిన సంగతంతా టూకీగా చెప్పాడు. చిట్టిబాబు డాక్టరుదగ్గరకు పరుగెత్తాడు. జ్వర తీవ్రతలో, వడగళ్ళ దెబ్బల వల్ల నీరసంతో, ఏమీ మాట్లాడలేక ప్రకాశం దుప్పటితో ముసుగు పెట్టుకుని ఎవరినీ చూడకుండా ఒత్తిగిలి పడుకున్నాడు.

"జ్వరమొచ్చిందా ప్రకాశానికి" ఒక అమ్మలక్క రాధమ్మను ప్రశ్నించింది.

పరిస్థితే సమాధానం యిస్తోందికదా అని రాధమ్మ ఔనని తలూపింది.

'అసలే అవిటి మనిషి. కూర్చుంటే జ్వరం! నుంచుంటే జ్వరం! వీడు ఎలా బ్రతుకుతాడో గాని' సాగదీసుకుంది ఒకావిడ.

'దానికి తోడు తండ్రి లేచిపోడం, ఒకళ్ళమీద ఆధారపడ్డం! ఏమో బాబు యీ కుటుంబం ఎలా నెగ్గుకొస్తోందో!' మరొక అమ్మలక్క తాళం వేసింది.

'పోనీ లెద్దురూ! ఎలా జరిగేయోగం ఉంటే అలా జరుగుతుంది! జ్వరంతో బాధపడుతున్నవాడి ముందు ఈ మాటలన్నీ ఎందుకు' రాధమ్మ వాళ్ళ సంభాషణ మరోవైపు త్రిప్పాలని అడ్డు వచ్చింది.

"అవునులే కాని! ఈ పిల్లల బదువులు సంధ్యలు అన్నీ ఎవరు చెప్పించగలరమ్మా! డబ్బుకి చిక్కులు వస్తే ఎవరితోనైనా చెప్పుకొని తీర్చుకోవాలి గాని, యిల్లా పిల్లలిని వదిలేసిపోతే ఎవరు పోషిస్తారు? ఎవరు ఆదుకుంటారు?" మాణిక్యంఅంటే కిట్టని ఒకావిడ దురుసుగా విసిరింది మాటలు.

"ఏమో బాబు యింతంత కష్టాలు మా కుటుంబాల్లో వస్తే నిజంగా తెంచేలు ఎత్తిపోదుం! కుర్రాళ్లకు చదువులు చెప్పించడమంటే మాటలా?"

రాధమ్మకు కోపం వచ్చింది. అనవస

రంగా వీళ్ళకెందుకు ప్రకాశం గురించి అని. పోనీ లెద్దురూ వాడిగురించి మీరు అనవసరంగా ఏమీ మాట్లాడకండి. అసలే బెంగతో చిక్కిపోతున్నాడు కుర్రాడు. మనం కూడా లేనిపోని మాటలంటే మనస్సులో పెట్టుకుని బాధపడతాడు.'

అంటూ అమ్మలక్కల సంభాషణ అంతం చేసింది రాధమ్మ.

జ్వరతీవ్రతవల్ల కళ్లుమూసుకుని దొర్లుతున్నా నిద్రపోలేదు ప్రకాశం. అమ్మలక్కల సంభాషణలన్నీ వింటూనే వున్నాడు. కష్టాలలో ఉన్నవాళ్లంటే సుఖపడుతున్నవాళ్లకు సాధారణంగా హేళనగా ఉంటుంది. ఒకవేళ ఆకష్టాల్ని వాళ్లు అర్థంచేసుకున్నా అతిసామాన్యమైన ఒక్క సానుభూతివాక్యంతో ఆకష్టాలను స్మృతిపథంలోంచి తప్పిస్తారు. ఇంట్లో పనిలేక, కాలక్షేపంకోసం ఒకచోటు జేరి, ఏదో మాట్లాడగానూ ఎగురుగా కనిపించిన ప్రతీ వాడినిగురించి తమకేదో ఒరిగిపోతోందన్నట్లు ఆసక్తితో, పెద్ద రాజకీయసమస్యలు తీవ్రంగా చర్చించే రాజకీయవేత్తల ధోరణిలో కలిపి పెద్దవిచేసి, గుసగుసలాడుకుంటూ, చెవులు కొరుక్కునే ఆడవాళ్లంటే ప్రకాశానికి ఒళ్లుమంట! వాళ్లకి అనవసరమైన గొడవఅంటూ లేదు. ఇంట్లోని దాసీదాని జీవితచరిత్ర మొదలుకొని, దారిలోపోయే ప్రతీమనిషియొక్క స్థితిగతులన్నీ తెలుసుకునేదాకా వీళ్ళకు నిద్రపట్టేట్లు కనిపించదు!! అని విసుక్కునేవాడు. 'తనగతి ఏమయితే వీళ్లందరికీ ఎందుకో!' కోపంతో ఉద్రిక్తుడై గుప్పెళ్ళు బిగబట్టి, పళ్లు కొరికేవాడు ప్రకాశం అమ్మలక్కలపైన.

అమ్మలక్కలను పంపవేసి, రాధమ్మ లోపలికి వెళ్లింది. అప్పుడే కురిసి వెలిసిన వడగళ్లవాన గాలి హోరువల్ల దొడ్డి అంతా చిందరవందరగా తయారయింది. దొడ్లో బొగ్గులు బుట్టలో వడగళ్లు రాలి బొగ్గులన్నీ తెల్లబడ్డాయా అన్నట్లు కనిపించాయి. దొడ్డినిండా ఎండిపోయిన జామి ఆకులు, మామిడాకులు చెల్లాచెదురుగా పడివున్నాయి. జాంపిందెలు మామిడిపిందెలు చెట్లక్రింద రాలిపడ్డాయి. వడగళ్లు కరిగిన నీటిలో రాలిపడిన ఎంగిలాకులు తేలుతున్నాయి. దొడ్డిలో వీలైన చోట్లా వాననీరు చేరి మళ్ళు కట్టుకుంది.

రాధమ్మ రాలిపోయిన పిందెలన్నీ జాగ్రత్తగా ఏరి ఒక బుట్టలోకి ఎక్కించింది. జామిచెట్టు, మామిడిచెట్టు చాలా కాలంనుంచి ఎన్నో పండ్లు యిస్తున్నాయి. గంపలునిండే ఆ ఫలాలు చుట్టుపక్కల బంధువులకు, స్నేహితులకూ ప్రతి ఏడూ రాధమ్మ పంచిపెట్టడం అలవాటు. ఆ చెట్లు పూతిపూసి పిందెలు కాసేయో లేదో,



నమ్మిన బంటు

ఫోటో: కూతే రమేష్ — ఏలూరు.

అప్పుడే యీ ఏడు మూడుసార్లు ఉపద్రవమైన వడగళ్లవాన వచ్చిపడింది. ఈలెక్కలో పంటలు పాడవుతాయి. దొడ్లో చెట్లవల్ల ఫలాలుకూడా దక్కేటట్లు కనిపించటం లేదు. ప్రకృతి మార్పులను మానవులంతా కలిసి అడ్డుపెడదామన్నా అడ్డుపెట్టలేరు. అకాలంలో అసహజమైన ప్రకృతి పరిణామాలు గురించి ఆలోచిస్తూ, దొడ్డి శుభ్రం చేసుకుంది రాధమ్మ.

చిట్టిబాబు మందు తీసుకువచ్చాడు. రాధమ్మ ప్రకాశానికి మందు యిచ్చింది.

"ఏంరా నాయనా. నాన్నగురించి బెంగపెట్టుకున్నావా ఏమిటి?" అంది రాధమ్మ.

"లేదు దొడ్డమ్మా" అంటూ అబద్ధమాడాడు ప్రకాశం

"మీ నాన్న తప్పక వస్తాడులే. అవధాని మామయ్యకు కూడా ఉత్తరం వ్రాశాం. మామయ్య మీ నాన్నను తప్పకుండా వెతికి ఇంటికి తీసుకువస్తాడు" అంటూ ఓదార్చింది రాధమ్మ.

రాధమ్మ ఆదరణ, చిట్టిబాబు పరిచర్యలవల్ల ప్రకాశం ఒక్క రోజులోనే తేరుకున్నాడు. మామూలుగా భోంచేసి, బడికి, ఆటలకు వెళ్లసాగాడు.

ఆరోజు కాంతమ్మగారి ఇంటినుంచి పనసకాయ కత్తి తెచ్చిపెట్టమని రాధమ్మ ప్రకాశానికి పురమాయించింది.

కాంతమ్మగారు ఆ చుట్టుపక్కల అమ్మలక్కలలో బాగా ప్రసిద్ధికెక్కిన మనిషి. ఎవరైనా ఇద్దరు సుఖంగా స్నేహంగా

ఉన్నారంటే వారిద్దరిమధ్యా ఏవో చాడీలు చెప్పి వైరము పుట్టించడంలో మంచి చాకచక్యం కలది. సాధారణంగా ఆవిడ చెవిలో ఏ రహస్యాలు పడకుండా ఆచుట్టు పక్కల గృహిణులందరూ జాగ్రత్తపడుతూంటారు. ప్రకాశం తండ్రి లేచిపోయాడన్న వార్త విని ఒకసారి అప్పుడే రాధమ్మ యింటికి వచ్చి ప్రకాశం ముందుగతి, మాణిక్యం కుటుంబం ఎలా జీవించకల్గుతున్నదీ మొదలైన విషయాలు తెలుసుకుంది. పైగా రాధమ్మతో అనేసింది. "ఈ సంసారాన్ని మీ రెలా భరించగలరే! ఏమో ఏమౌతుందో! అంతా దైవాధీనం! మామూలుగా సంపాదించుకుంటున్నవాళ్లు బ్రతకడమే కష్టమౌతున్న ఈరోజుల్లో, తండ్రి దిక్కులేని అనాథ కుటుంబాన్ని ఎవరు పోషించగలరు!" అని. ఈమాటలు విన్న ప్రకాశానికి కాంతమ్మగారింటికి వెళ్ళడమంటే ఒకవిధంగా భయంగానే ఉంది యింకా ఆమె ఏ ప్రశ్న పరంపర కురిపించి ఏ దెప్పుడు మాటలు విసురుతుందో అని! అయినా ఆ చుట్టుపక్కల యిండ్లల్లో కాంతమ్మదగ్గరే పనసకాయ కత్తి ఉండడంవల్ల తప్పనిసరిగా వెళ్లవలసి వచ్చింది ప్రకాశం.

కాంతమ్మ తల దువ్వుకుంటోంది- ప్రకాశం వెళ్ళేటప్పటికి. వచ్చినపని చెప్పాడు ప్రకాశం. వంటింట్లో చూరులో పదిలంగా దాచిన కత్తితెచ్చి ప్రకాశానికి యిచ్చింది.

'ఒరే మీ నాన్నా కనిపించాడురా!' అంటూ సంభాషణ మొదలెట్టింది కాంతమ్మ.

అసలే ఆవిడంటే భగ్గుమని మండిపడుతున్న ప్రకాశానికి యీ ప్రశ్న వినగానే స్వాభిమానం, ఆత్మగౌరవం దెబ్బతిన్నట్లయింది - తన కుటుంబ ప్రతిష్ఠ యీమె మూలంగా గంగపాలౌతుందని భయపడ్డాడు ప్రకాశం.

'మా నాన్న అవధాని మామయ్యను చూడడానికి విజయనగరం వెళ్లారట! త్వరలో వచ్చేస్తారని తెలిసింది' రాధమ్మ తన జ్వరంలో అన్నమాటలు జ్ఞప్తికివచ్చి

యుక్తిగా చెప్పాడు. కాంతమ్మ కళ్లు పెద్దవిచేసి నోరు ఆవలించింది ఈ వార్త వినగానే.

'అయితే ఎవరు చెప్పార్రా యీ సంగతి' పరిశోధన మొదలెట్టింది కాంతమ్మ.

ప్రకాశానికి చెప్పలేనంత చిరాకు వచ్చింది.

'ఎవరు చెప్పడమేమిటి! ఉత్తరం వచ్చింది' అంటూ ఇంక ఒక్కక్షణం అక్కడ ఉండకుండా కత్తితీసుకుని ఒక్క అంగలో వీధులో పడ్డాడు.

అక్కమొగవాళ్లకు తన గురించీ, తన తండ్రి గురించే కావాలి! తను క్షేమమైతే వీళ్లకెందుకో! లోలోపల విసుక్కుంటూ ఇంటికి వచ్చేశాడు ప్రకాశం.

మర్నాడు రాత్రి భోంచేసి, చిట్టిబాబు, ప్రకాశం, పరీక్షలు దగ్గరకు వస్తున్నాయని శ్రద్ధగా చదువుకోడానికి పుస్తకాలు ముందు వేసుకుని హరికెన్ లాంతరు వెలుగులో చదువుకుంటున్నారు. రాధమ్మ వంటింట్లో సవరింపులలో నిమగ్నమై ఉంది. సోమయాజులు నవ్వుతూ రాధమ్మ ఇంట్లో అడుగు పెట్టాడు.

సోమయాజులుకు సాధారణంగా రాత్రి భోజనం చేసేక చిన్నపచార్లు చెయ్యడం అలవాటు. వీలున్నప్పుడు రాధమ్మ యింటికి కూడా వచ్చి ఏదో పిచ్చాపాటి మాట్లాడి యింటికి వెళ్లిపోతాడు. రాధమ్మ కాపురానికి వచ్చిన మూడేళ్లలోనే వైధవ్యం రావడం, అప్పటినుంచి ఆవూళ్లోనే వుంటున్న మరిది సోమయాజులు అవసరాలకు వీలైనప్పుడు ఆదుకుని సహాయం చేస్తూండడం, పైగా రాత్రిళ్లుకూడా వచ్చిపోతూండడం గమనించిన సీతమ్మకు సోమయాజులు నైతిక ప్రవర్తనమీద అపనమ్మకం లేకపోలేదు. కాని దేవుడిలాంటి మనిషైన సోమయాజులును, అగ్నిహోత్రంలా మసలుతున్న రాధమ్మను ఊళ్లో ఇంకెవరూ ఎప్పుడూ అపార్థం చేసుకోలేదు. లోకాన్ని ఎప్పుడూ నమ్మకూడదనుకుంటూ సీతమ్మ తన అభిప్రాయం మాత్రం మార్చుకోలేకపోయింది. కాని సాహసించి పైకిమాత్రం ఎప్పుడూ అనలేదు.

'ఏరా ప్రకాశం! ఎలా చదువుతున్నావు' సోమయాజులు ప్రశ్నించాడు. ఆయనకు పిల్లలు ఎవరు చదువుతున్నా అలా ప్రశ్నించడం అలవాటే. స్వతస్సిద్ధంగా బడి పంతులవడంవల్ల పిల్లల చదువులుగురించి కనుక్కోడం ఆయనకు ఇష్టం.

"మీ నాన్న విజయనగరంలో ఉన్నాడుటరా! రెండుమూడు రోజుల్లో ఇంటికి వస్తాడుట." అన్నాడు సోమయాజులు ప్రకాశంవైపు నవ్వుతూ!

'నిజంగానే పినానా!' ఒక్క గెంతుగెంతాడు ప్రకాశం.

"అమ్మాయి! నరసింహం బాబయ్య విజయనగరంలో ఉన్నాడుట" అంటూ చిట్టిబాబు పుస్తకాలు దీపంముందు వదిలేసి వంటింట్లో రాధమ్మ దగ్గరకు పరుగులంకించుకున్నాడు.

సోమయాజులుదగ్గరకు వచ్చిన ప్రకాశాన్ని హత్తుకుని తల నిమిరేడు. ప్రకాశానికి యీ వార్త వినగానే ఒళ్లు పులకరించింది. లోపల ఉప్పొంగే సంతోషం కట్టలు త్రెంచుకుని వాగులుగా ఒళ్ళంతా ప్రాకింది. నిన్న ప్రొద్దున్న రోషంతో కాంతమ్మ ముందు అన్నమాటలు జోస్యం చెప్పినట్లు నిజమెలా అయ్యాయా అని ఆనందంతో సతమతమయ్యాడు ప్రకాశం

'చిన్నపిల్లలలో దేవుడుంటాడుట' అని తల్లి ఒకప్పుడు చెప్పినమాటలు జ్ఞాపకం వచ్చాయి

'నిజమేనా?' అనుకుంటూ చొక్కాతో కళ్లు తుడుచుకున్నాడు.

రాధమ్మ యీ వార్త వినగానే కడుగుతున్న వంటిల్లు వదిలిపెట్టి నీళ్లుకారే చీపురుతో, చేతిలో నీళ్ళచెంబుతో, వరండాలోకి వచ్చింది. సోమయాజులు రాధమ్మవైపు చూసి నవ్వాడు.

'నిజమేనా!' అంది రాధమ్మ సంతోషంతో.

'అవును. అవధాని ఉత్తరం వ్రాశాడు.' అంటూ సోమయాజులు, జేబులో దాచిన ఉత్తరం బైటికి తీశాడు.

'ప్రియమైన బావకు,

నీ ఉత్తరం అందింది. పదిరోజుల క్రిందట నరసింహం ఇక్కడకు వచ్చి ఒకరోజు కులాసాగా గడిపాడు. విశాఖపట్నం పనిమీదవచ్చి నన్ను చూడ్డానికి ఇక్కడికి వచ్చానన్నాడు. నిజమనుకున్నాను. మర్నాడు వెళ్ళిపోయాడు.

నాలుగురోజులక్రితం నీ ఉత్తరం చేరాక నేను చాలా గాభరాపడ్డాను. కాని మొన్ననే నరసింహందగ్గరనుంచి ఉత్తరం వచ్చింది. రాజస్థాన్ దగ్గరలో మౌంట్ అబు దగ్గర ఒక హోటల్లో ఉన్నాడుట. డబ్బు పంపమనీ ఇంటికి తిర్గి వస్తాననీ వ్రాశాడు. నాకు నమ్మకం కుదరక తక్షణం అతన్ని ఇంటికి తీసుకురమ్మని డబ్బిచ్చి స్నేహితుణ్ణొకణ్ణి పంపాను. ఇప్పుడే టెలిగ్రాం వచ్చింది. రేపు నరసింహం ఇక్కడికి వస్తాడు. తరువాత సంగతులు క్రమంగా తెలియజేస్తాను.

మీరంతా క్షేమమని నమ్ముతున్నాను.

ఇట్లు
వందనములతో
'అవధాని'

ఉత్తరం చదవడం పూర్తి అవగానే 'మావయ్య ఎంతమంచివాడు!' అనుకుంటూ ప్రకాశం సోమయాజులువైపు సంతోషంగా చూశాడు.

'ఇంక బెంగపెట్టుకోకేం.' అంటూ సోమయాజులు ప్రకాశం ఒళ్లు నిమిరాడు.

'వెర్రినాగమ్మ! యీ పదిహేనురోజులు ఎంతో బెంగపెట్టుకుని ఎలా చిక్కిపోయాడో!' అంటూ జాలిగా చూసింది రాధమ్మ.

'ఒరే! టీపార్టీ ఎప్పుడురోయి!' అంటూ చిట్టిబాబు కేరింతాలు కొట్టాడు.

'రేపు జిలేబీ చేసి పెడతాలెండ్రా' అంది రాధమ్మ. అందరూ ముసిముసి నవ్వులతో ఒకరినొకరు చూసుకున్నారు.

"కూర్చో బావా!" అంటూ రాధమ్మ వంటింట్లోకి వెళ్ళింది పనులు పూర్తిచేసుకుందామని. పిచ్చాపాటి రుచిమరిగిన సోమయాజులు రాధమ్మతో కాస్సేపు కులాసా కబుర్లు చెప్పిపోదామని ప్రక్కనేఉన్న పేముకుర్చీలో కూర్చున్నాడు. ఎదురుగా గోడమీద వేలాడుతున్న నరసింహం మాణిక్యంల పెళ్లినాటి ఫొటో కనిపించింది. అది చూసి లోలోపల నవ్వుకున్నాడు సోమయాజులు. ప్రకాశం, చిట్టిబాబులకు ఇంకే ఆపూట చదువు సాగలేదు.

(ఇంకా వుంది)

కాలవాహిని

వేళా విశేషం...

చిన్న కోడలు ఇంట్లో కాలు పెట్టినరోజు మంచిదంటే మంచిదన్నారు. ఈ శుభం చిన్నకోడలు రాజమ్మ మూడు నిద్రలకు వచ్చిన నాడే కనిపించింది.

"చిన్న కొడుకు ఉద్యోగం ఖాయమయింది. జీతం ఎక్కువ చేశారు. ఆ అదృష్టం అంతటితో ఆగిపోలేదు. చిన్నకోడలు రజస్వలయి సంసార జీవితంలోకి అడుగు పెట్టడానికి సిద్ధమవుతున్న రోజులలో చిన్న కొడుక్కి ఇంకా పెద్ద ఉద్యోగం వచ్చింది.

వీటివల్ల గుమాస్తా రామయ్యగారికి కలిగిన ఇంకా కలుగుతున్న ఆనందం వర్ణనాతీతం. కాని, చిన్న కొడుకు శర్మకు మాత్రం వీటివల్ల ఆనందం కలగటంలేదు. బియ్యే పాసవగానే అన్న సహాయంతో ఉద్యోగం సంపాదించాడు. ఆ వుద్యోగంలోనే క్రమంగా పైకి వస్తున్నాడు. జీతంలో తన ఖర్చులకు కావలసినది ఉంచుకొని మిగతా డబ్బంతా తండ్రికి ఇస్తున్నాడు. ఇచ్చి ఋణం తీర్చుకొంటున్నాననుకొన్నాడు. గుమాస్తా రామయ్యగారు పెద్ద కుటుంబీకుడు. ఆస్తి చాలాతక్కువ. సంపాదన చాలక చేసిన అప్పులు నాగుపాములై వేధిస్తున్నాయాయనను. కొడుకులు సహాయపడాలని ఆశిస్తాడు. కేవలం వాళ్ళు తనకు సంపాదించిపెట్టాలనే దృష్టితోనే కాకపోయినా పిల్లల చదువుసంధ్యల విషయంలో కొంచెం ఓపిగ్గా ఖర్చుచేస్తే ఒకనాటికి కాకపోతే మరొకనాటికయినా తనబాధలు తగ్గగలవని ఆశ ఆయనకు.

ఆ ఆశతోనే పెద్దకొడుకుకు ఎఫ్. ఏ. దాకా చెప్పించాడు. ఇక ఆ తరువాత పెద్ద కొడుకు శాస్త్రి రాజకీయాలలోకి దిగి స్వతంత్రుడైనాడు. ఇంటిపట్టున ఉండడమే మానివేశాడు. ఎప్పుడో వస్తాడు. రెండు పూటలుంటాడు. మూడోపూట ఎక్కడికో లేచిపోతాడు. ఆ పోవడం పోవడం ఏ ఇరవై రోజులకో నెలరోజులకో మళ్ళీ వస్తాడు. ఉన్న రెండుపూటలయినా ఇంట్లోవాళ్ళందరితో సరదాగా వుండడు. ఏవో పుస్తకాలు ముందర వేసుకు కూర్చుంటాడు. లేదా రాత్రింబవళ్ళు ఏవో రాస్తూ కూర్చుంటాడు. దమ్మిడీ సంపాదన లేదు. క్షణం తీరిక లేదు. వాడిమీద గుమాస్తా రామయ్యగారు పెట్టుకున్న ఆశలు నిరాశలే అయినవి. ఒక్కొక్కపూట ఇంట్లో కట్టెలుండవు. కట్టెలు తెస్తే బియ్యం ఉండవు. ఈ రెండూవుంటే మరొకటి ఉండదు. ఆరుగురు ఆడపిల్లలూ పెద్దవాళ్ళు ఇద్దరూ కాక అయిదుగురు మగపిల్లలూ భార్యాభర్తలూ కలిసి మొత్తం పదమూడు పొట్టలు నిండాలి. రెక్కలు ముక్కలయ్యేటట్లు రాత్రి పదిగంటలదాకా తాలూకా

వి. యస్. అవధాని

ఆఫీసులో శ్రమించినా, కాగితాలు రాత్రి పూట ఇంటికి తీసుకువచ్చి రాసినా, జన్మకు శివరాత్రిలాగ తాను అడగకుండానే రైతులు పదీ పరకా యిచ్చినా రోజులు గడవడం కటకటగావున్న రోజులలో చిన్నకొడుకు శర్మ నెలకు వందా, నూటయాభై సర్దడం సంతోషంగానే వున్నది గుమాస్తా రామయ్యగారికి మరి. పెద్దకొడుకు తనకు సహాయపడడని రామయ్యగారు అనుకోకపోయినా రెండోకొడుకుమీద మాత్రం మొదటినుంచీ చాలా ఆశలు పెట్టుకొన్నాడు. పెద్దకొడుకు తెలివితక్కువ వాడని అనుకోలేదు గాని రెండవ కొడుకుకు ప్రతి తరగతిలోనూ ఫస్టుమార్కులు రావడం రామయ్యగారికి సంతోషంగానే ఉన్నది. పెద్దకొడుకు రాజకీయాల పేరుతో దేశద్రిమ్మరిగా తిరగడం, చదువు మానివెయ్యడం, ఉద్యోగ ప్రయత్నమే చేయకపోవడం మొదలయిన కారణాలవల్ల అసలు వాడికి పెళ్ళికాదేమోనన్న భయం రామయ్యకూ ముఖ్యంగా ఆయనభార్య సుబ్బమ్మగారికీ ఎక్కువయింది. ఇటు చిన్నకొడుకు శర్మకు మాత్రం సంబంధంమీద సంబంధం వస్తున్నది. పెద్ద పెద్ద కట్నాలు ఇస్తామంటున్నారు. రామయ్యగారిని శర్మ ఎట్లాగో బియ్యే పూర్తిఅయ్యేవరకూ ఆపి ఆ తరువాత ఉద్యోగంలో చేరి మరి పెళ్ళికి ఒప్పుకున్నాడు. అందువల్ల పెద్ద కొడుకు శాస్త్రికి వచ్చిన మొదటి సంబంధంవారికి సరేనని మాటయిచ్చి పదిరోజులలో పెళ్ళి చేశాడు. ఆ పెళ్ళయిన సంవత్సరానికి శర్మ పెళ్ళి చేశాడు.

* * *

ఇష్టంగానో అయిష్టంగానో తెలిసో తెలియకో శాస్త్రి పెళ్ళికి ఒప్పుకున్నాడు. కాని, తనకు పెళ్ళి చెయ్యడమనేది తన తండ్రికి ఎంతమాత్రం యిష్టంలేదని పెండ్లిలోనే తోచిం దతనికి. తన అభిప్రాయం వాళ్ళు అడగలేదు. ఇంకా నయం. అడిగితే మాత్రం పెళ్ళి వద్దు అని తను చెప్పివుండేవాడా? యేమో! ఇప్పుడు ఎన్ని అయినా అనుకోవచ్చు. అనుకొనేవన్నీ ఇతరులకు చెప్పవచ్చు. చెప్పినవన్నీ ఇతరులు వినాలని ఎక్కడున్నదీ? పెళ్ళి అయిన తరువాతనే శాస్త్రి ఇంటిముఖం చూడడం పూర్తిగా మానివేశాడు. దీనికి కారణం పెద్దకోడలు అదృష్టహీనని సుబ్బమ్మగారికి గట్టిగా తెలుసు. గట్టిగా తెలిసినవిషయాన్నే వాడవాడలా అమ్మలక్కలందరికి చెప్పింది. ఇదివరకు తను ఒక్కడే తన తండ్రిదృష్టిలో అప్రయోజకుడని శాస్త్రి అనుకొన్నాడు. ఇప్పుడు తాను మంగళసూత్రంకట్టిన పార్వతికూడా వాళ్ళ దృష్టిలో అదృష్టహీనురాలని తెలిసివచ్చింది వాడికి. ఇంతకూ పెద్దకోడలు అదృష్టహీనురాలనడానికి సుబ్బమ్మగారి నిదర్శనము లేమిటి?

పెండ్లి అయిన అయిదోరోజుననే శాస్త్రికి టైఫాయిడ్ వచ్చింది. అయితే సంతోషించతగ్గ విషయం ఏమిటంటే ఆ జబ్బువల్ల శాస్త్రి గుమాస్తా రామయ్యను గాని, ఆయన భార్య సుబ్బమ్మను గాని బాధ పెట్టలేదు. గుంటూరు ఏదో సభకు వెళ్ళి జబ్బుపడ్డాడు. వాడి స్నేహితులే మందు మాకుల విషయం చూచారు. కాకపోతే ఎందుకయినా మంచిదని గుమాస్తా రామయ్యగారికి జాబు వ్రాశారు. రామయ్య సతీసమేతంగా కొడుకును చూడడానికి వెళ్ళాడు. వాళ్ళు వెళ్ళేటప్పటికి శాస్త్రి వళ్ళు తెలియకుండా పడి ఉన్నాడు.

"ఇంటికి తీసుకువెళ్తాను నాయనా" అన్నాడు రామయ్యగారు శాస్త్రి స్నేహితుడు శేషుతో. వీల్లేదంటే వీల్లేదన్నాడు శేషు. శాస్త్రికి తన కుటుంబంతో గల సంబంధ బాంధవ్యాలు మొదటినుంచీ శేషుకు తెలుసు. కనుక శాస్త్రిని వాళ్ళతో పంపించడం కంటె గుంటూరు జనరల్ ఆస్పత్రిలో వుంచి చేత

నయిన సహాయం చెయ్యటమే మంచిదని శేషు అభిప్రాయం. చివరకి ఆ అభిప్రాయమే నెగ్గింది. పదిహేనేండ్లుగా తలనొప్పి అంటే ఏమిటో తెలియని శాస్త్రికి ఇంత పెద్దజబ్బు రావడం పెద్ద కోడలు అదృష్టం కాక మరేమిటని సుబ్బమ్మగారి నమ్మకం. అయితే ఈ పదిహేనేండ్లలోనూ చెయ్యని అనేక పనులు శాస్త్రి చేస్తున్నాడని ఆమెకు తెలియదు.

అదివరకల్లా నెలకోసారయినా ఇంటికి వచ్చే శాస్త్రి ఇప్పుడసలు ఇంటి ఛాయలకే రాకపోవడం పెద్దకోడలు అదృష్టహీనతకు పెద్ద నిదర్శనమంటుంది సుబ్బమ్మగారు.

పెద్దకోడలు అదృష్టంలేనిదయితే అయిందని సరిపెట్టుకు పోదామనుకుంటే ఆమ పుట్టింటివారు "పిసినారివాళ్ళు"—'అనాగరికులు' కావడం ఆమెకు చాలా యిబ్బందిగా వున్నది. ఈ సంబంధం చేసుకోవడంవల్ల నలుగురిలోనూ తాను తలయెత్తుకు తిరగలేని పరిస్థితియేర్పడ్డదని గుమాస్తా రామయ్యగారి బాధ.

ఇక చిన్న కోడలు పుట్టింటివారి సంప్రదాయాలూ పద్ధతులూ అబ్బో... వాటిని తలచుకొంటేనే రామయ్య దంపతులకు విపరీతమైన ఆనందోత్సాహాలు కలుగుతున్నవి.

* * *

రామయ్య మూడవకొడుకు ఉపనయనం. వియ్యాలవారిద్దరికీ శుభలేఖలు పంపించాడు రామయ్యగారు. పెద్దకోడల్ని తీసుకు రమ్మని పెద్దకూతురు సరస్వతినీ, నాలుగో కొడుకు గోపాలాన్నీ పంపించాడు రామయ్యగారు.

"నా వదినను తీసుకువెళ్ళడానికి వచ్చామండీ" అన్నది సరస్వతి సంగతంతా చెప్పి పార్వతితల్లి రామాయమ్మగారితో. "ఏమండీ ...సాయంకాలం బండికి మా వదినెను తీసుకు వెళతాం" అన్నాడు గోపాలం రాఘవయ్యగారితో.

"ఉపనయనం ఎప్పుడు" అన్నది రామాయమ్మ.

"వచ్చే శుక్రవారం" అన్నది సరస్వతి.

"మరి మేము రావద్దూ. అందరమూ కలిసి వస్తాం" అన్నాడు రాఘవయ్య.

"అట్లాకాదు. మా వదినను మేము ఇవాళ్ళ తీసుకువెళతాము" అన్నది సరస్వతి.

"ఎట్లా తీసుకువెళతావమ్మా తల్లీ. మీ వదినె బయటచేరింది. ఇవాళ్టికి రెండూ. స్నానం చేయించి నేను తీసుకువస్తాను. సరేనా." అన్నది రామాయమ్మగారు.

* * *

పెద్దకొడుకు రామాపురంలో పంతులు ఉద్యోగానికి కుదిరాడు. భార్యను తీసుకు వెళ్ళి కాపురంకూడా పెట్టాడు. తను బ్రతికే వున్నాడు. తనను సంప్రదించలేదు. భార్యను తీసుకువచ్చి వేరే కాపురం పెడతానని చెప్పనయినా చెప్పలేదు. ఆఖరికి ఆ పార్వతి తన యింట్లో పట్టుమని నాలుగురోజులయినా ఉండలేదు. పెద్ద కొడుకు తనకు అక్కరకు రాకపోతే రాకపోయినాడు. తనకు సంపాదించి పెట్టకపోతే పెట్టకపోయినాడు. ఆ పార్వతి అయినా నాలుగురోజులపాటు తన ఇంట్లో వుండి కాస్త ఆ యిల్లాలి చేతిపనికి అడ్డురాకూడదా? లోకంలో ఇలాగే జరుగుతున్నదా? పిల్లలను కని, పెంచి పెద్దవాళ్ళను చేసేది, ఇందుకేనా? పెద్దకొడుకు శాస్త్రికి తాను చేసిన అన్యాయమేమిటి? వాడికి తను ఏమి తక్కువచేశాడు? తనతో ఇంత శత్రుత్వం దేనికి? ఇంటికి రానేరాడే. వచ్చినా తనతో మాట్లాడనే మాట్లాడడే? మంచి చెడులు తెలియనివాడయితే ఏమోలే అనుకోవచ్చు. బంధువులలోగాని, స్నేహితులలోగాని ఎవడినోటివెంటవిన్నా శాస్త్రి తెలివి తక్కువవాడని వినిపించదే. ఏమిటిదంతా అని రామయ్యగారి హృదయం మూలుగుతూంది.

* * *

చిన్నకోడలుకూడా కాపరానికి వచ్చింది. అయితే ముద్దు ముచ్చటలన్నీ జరిగినవి. తన చేతిసొమ్ము నాలుగువందలు దాకా వదిలింది. వదవ డబ్బు పోతేయేం? ముద్దు ముచ్చటలూ, సరదాలూ లేకపోయినతరువాత డబ్బు దేనికి? భార్యాభర్తలిద్దరూ చాలా సంతోషించారు. ఈ సంతోషంలో భాగం పంచుకొనడానికి శాస్త్రి రాలేదు. పార్వతి రాలేదు. ఈ సంఘటనలో, యీ సరదాలో ముఖ్యుడయిన రెండవకొడుకు సరదాగా తిరగలేదు. లోకంకోసం అన్నట్లు వ్యవహరించాడు......

వేళావిశేషం... ...చిన్న కోడలు కాపురానికి వచ్చిన రెండునెలలకే గుమాస్తా రామయ్యగారు ఏకదమ్మున ముగ్గురు ఆడపిల్లలకు పెళ్ళిచేశాడు. పెళ్ళికి ఎనిమిదివేల రూపాయలు అప్పు అయితే మాత్రమేం? మూడెకరాల పొలం అమ్మవలసి వస్తే మాత్రం మునకపోయినదేమిటి?

కాకపోతే ఒక్కటే ఒక్కబాధ. పెద్ద కొడుకు శాస్త్రి పెళ్ళిళ్ళకు రానివాడు రాకుండానూ ఉండడు. వచ్చినవాడు సరదాగా వుండనూ ఉండడు. అంత మాత్రాన ముక్కుముడుచుకు కూర్చున్నాడని కాదు. పెళ్ళివారికి వడ్డించడం దగ్గర నుంచి చిన్నా పెద్దా పనులకు అడ్డం తగలలేదనీ కాదు. ఇవన్నీ చేశాడు. తనతో మాత్రం మాట్లాడలేదు. సుబ్బమ్మగారితో ముక్తసరిగా మాట్లాడాడు. వాడికంటేకూడా ఆ పార్వతి. ఇటు ఆడపిల్లలతోగాని, అటు మగవాళ్ళతోగాని, ఇటు ఇంట్లో వాళ్ళతోగాని, అటు వియ్యాలవారితోగాని సరదాగా వ్యవహరించలేదు. ఇక చిన్నకోడలో...

అసలు చిన్నకోడలు చెయ్యని పని ఏమి ఉన్నది కనుక ఇది చేసిందని చెప్పడానికి. మనుసులో మనుసుగా నడుచుకొన్నది చిన్నకోడలు. డబ్బు పెత్తనందగ్గిరనుంచి ప్రతి పని తిప్పుకొచ్చింది చిన్నకోడలు.

* * *

ఈ పెళ్ళిళ్లు జరిగినప్పటినుంచీ యింట్లో చిన్నకోడలు స్థానం స్థిరపడిపోయింది. కాఫీపొడి ఎంత వాడాలనే చిన్న విషయం దగ్గిరనుంచి పిల్లల చదువు సంధ్యలవంటి పెద్ద విషయాలవరకూ అన్ని విషయాలలోనూ గుమాస్తా రామయ్యగారికి చిన్నకోడలు సలహాయే కావాలి. చిన్నకొడుకు సంగతికూడా ఆయనకు అంతగా పట్టదు. చిన్నకొడుకు సలహాలయినా తోసివేస్తాడుగాని చిన్నకోడలు సలహామాత్రం తోసివెయ్యడు. తోసివెయ్యలేడు. రామయ్యకు కాఫీ కావాలంటే చిన్న కోడలే తయారు చెయ్యాలి. రామయ్యకు కాలునొప్పి పెడితే చిన్నకోడలే మందు వెయ్యాలి.

తమాషా. సుబ్బమ్మకు కూడా యిదంతా మొదట్లో మొదట్లో చాలా సంతోషంగానే వున్నా దీనికి కారణమేమిటని ఆమె తనకు తెలియకుండానే ఆలోచించడం మొదలుపెట్టింది. ముప్ఫయ్యేండ్లు కష్టసుఖాలలో భాగం పంచుకొని సంసారజీవితం సాగించిన తన కంటే చిన్నకోడలే రామయ్య దృష్టిలో ఇంత ప్రధానమైనవ్యక్తిగా ఎందుకు తయారయిందని పాపం సుబ్బమ్మగారు అహర్నిశలు ఆలోచించడం మొదలుపెట్టింది.

ఒకరోజున! తాను పొరుగింటికివెళ్ళి వచ్చేటప్పటికి వాకిట్లో రామయ్య కూర్చుని వున్నాడు. ముందు గదిలో చిన్నకోడలు పడుకొనివున్నది.

మరొకరోజున :

(48 వ పేజీ చూడండి)

విజ్ఞానవీధులు

"డాక్టర్"

విద్యుత్ప్రవాహమంటే?

ఏమిటని కాకినాడనుంచి పి. శారదగారు అడుగుతున్నారు. పట్టుతో రుద్దిన గాజుకడ్డీ చిన్న చిన్న కాగితపుముక్కల్ని, వెంట్రుకల్ని ఆకర్షిస్తుంది. ఫ్లానల్‌తో రుద్దిన లక్కకడ్డీ కూడా ఈ గుణమే చూపిస్తుంది. అయితే పై గాజుకడ్డీని వ్రేలాడదీసి, దానికొసకి ఈ లక్కకడ్డీ కొసని చూపిస్తే రెండూ ఆకర్షించుకుంటాయి. పట్టుతో రుద్దిన గాజుకడ్డీలు రెండు వికర్షించుకుంటాయి.'

శాస్త్రజ్ఞులు గాజుకడ్డీకి ధనావేశమూ, లక్కకడ్డీకి ఋణావేశమూ వస్తున్నదన్నారు. ధనావేశితములైన వస్తువులు ఋణావేశితాల్ని ఆకర్షిస్తాయి.

నీరు ఉదజని ఆక్సిజనుల సమ్మేళనము. నీటినుండి విద్యుత్ప్రవాహమును పంపుటకు ఏర్పాటుచేశామనుకోండి. అంటే నీటిలో ఒకమూల ధనధ్రువమూ, ఇంకొకమూల ఋణధ్రువము పెట్టినామనుకోండి. అప్పుడు నీటిఅణువులు ధన విద్యుదావేశములగు ఉదజని అయానులుగానూ, ఋణవిద్యుదావేశితములకు ఆక్సిజను అయానులుగానూ విడిపోవును. అయానులంటే విద్యుదావేశితములగు పరమాణువులో, లేక అణువులో లేక అణుసంఘములో. విద్యుదావేశమున్నంతసేపూ అవి సాధారణపు అణువుల ధర్మాలు కనపరచవు. అంటే గాలిబుడగలుగా కనపడవు. (సోడియమునీటితో కలిస్తే బుసబుసమని పొగలు కక్కుతుంది. సోడియము అయానులు - ఉప్పునీటిలోనివి - మహాసాధువులు.) ఎప్పుడైతే ధన విద్యుదావేశితములగు ఉదజని అయానులు ఋణధ్రువము వైపు ఆకర్షింపబడి, దానిని చేరి దానికి తమ విద్యుదావేశమును కోల్పోవునో అప్పుడు వాటి నిజస్వరూపము బయటబడి అవి ఉదజని బుడగలుగా పైకి తేలిపోవును. అట్లే ఆక్సిజను ధనధ్రువము కడ బయటబడును. విద్యుత్ప్రవాహమనగా విద్యుదావేశితములగు అయానుల ప్రవాహము.

'క' నుండి 'చ' కు ధనావేశితములగు అయానులు ప్రవహించినా, 'చ' నుండి 'క' కు ఋణావేశితములగు అయానులు ప్రవహించినా, శాస్త్రవ్యవహారములో 'క' నుండి 'చ' కు విద్యుత్ప్రవాహము ప్రవహించినదనుట ఆచారము. అయానులలో ఏ ఒక్క రకమైనాసరే ఈ వర్ణనకనుగుణముగా ప్రసరించినట్లైతే 'క' నుండి 'చ' కు విద్యుత్తు ప్రవహించినదందుము.

లోహములలో అతికనీసపు విద్యుదావేశముగల ఎలక్ట్రానులనే ఋణావేశకణములు కొన్ని విడిగా తిరుగుచుండును. లోహపుతీగె రెండు కొసలనూ, విద్యుద్ఘటముయొక్క ధన, ఋణ ధ్రువములకు తగిల్చినచో, రికామీగా తిరుగుతూన్న ఈ ఎలక్ట్రానులు ధనధ్రువమువైపు సాగును. అనగా ఋణావేశితములగు "లక్ట్రానుల ప్రవాహము ధనధ్రువమువైపు సాగునన్నమాట. దీనినే శాస్త్రపరిభాషలో - పైన చెప్పిన శాస్త్రసమయము ననుసరించి ధనధ్రువము నుండి ఋణమునకుసాగే విద్యుత్ప్రవాహమందుము... అంటే, ఎలక్ట్రానుల ప్రవాహముగాని, అయానుల ప్రవాహముగాని విద్యుత్ప్రవాహమని చెప్పబడుచున్నది. సూక్ష్మంగా చెప్పవలెనంటే, ధన లేక ఋణ, అయానుల ప్రవాహమే విద్యుత్ప్రవాహము. వేరేదీ కాదు.

★



46

డాక్టర్ గారి ప్రోద్బలంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తూ సదానందం పదిమంది యువకుల్ని వెంటేసుకుని ఆవార్డంతా కలయ తిరుగుతున్నాడు. ఇలా అతి నెన్నడూ వ్యక్తి వ్యక్తినీ కనుక్కుని పలకరించి వుండలేదు గనక అతనికి సమాజంస్థితి ఇప్పుడు అర్థమౌతున్నది.

మధ్యతరగతి గుమాస్తాలూ, దర్జీలూ, ఇతరులూ ఒక మాదిరిగా జీవితాన్ని ఈడ్చుకు పోతున్నారు. ప్రతివాడి జీవితమూ సమస్యల మయం. ఏదో నిరర్థకంగా బతుకుతున్నట్లుగా గాఢ వైరాగ్యంలో జీవిస్తున్నారు వాళ్లు. జీవితావసర వస్తువులు కొనుక్కునే తాహతైనా లేదు అనేక మందికి. మధ్యరకం మనుషులు బాధల్ని కప్పిపుచ్చుకుని పరువు కాపాడుకొంటూ తిరుగుతున్నారు. కర్మ సిద్ధాంతం పుణ్యమా అని తమ సమస్యల్ని బాధల్నీ ఏదో అగోచర కారణాలకి ముడిపెట్టి సంతృప్తిపడుతున్నారు. వాళ్ళ దగ్గర మెసిలే కొద్ది డబ్బునీ ఆశ చూపించి లాగేస్తూ ఇతరులు బాగుపడుతున్నారు. ఆశ వున్నంతకాలం జూదం మీదా జ్యోతిషంమీదా మనిషికి నమ్మకం చావదు; ఇందువల్లే, పజిల్సూ, ప్రాకెట్లూ విపరీతంగా వ్యాపించిపోతున్నాయి. బాగా విజృంభించి, లేనివాళ్లకు ఆశలు రెచ్చగొట్టి వాళ్ళ రక్తాన్ని పీల్చేస్తున్నాయి...

సదానందం వోటర్లతో మాట్లాడుతూ ఇంకా చాలా విషయాలు తెలుసుకుంటున్నాడు. ఎవరు గెలిస్తే ఏమిటి? మనని ఎవడూ ఉద్ధరించడులెద్దూ" అన్న ధోరణిమాత్రమే కన్పిస్తోంది.

...దానికి మూలకారణాలు అనంతం. కలకాలంగా వాళ్లు ఈ దౌర్భాగ్య నిరాశావాతావరణంలో పెరిగారు. కొందరికి వృత్తి ఉద్యోగం వుండిగూడా కడుపునిండా కూడు లేదు. చాలామందికి నిరుద్యోగం. వాళ్ళ కష్టాల కంతులేదు...

సదానందం ఇదంతా విని కళ్ళారా చూసి చాలా బాధపడుతున్నాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. దీనంతా పరిష్కరించాలంటే పని ఎక్కడ మొదలెట్టాలో అతనికి తోచటంలేదు. మొత్తం సమాజం పునాదిలోనే ఎక్కడో పెద్దదోషం ఉన్నది. అది సరిదిద్దితేగాని – ఈ సమస్యలన్నీ పరిష్కారం కావు. ఎవర్ని చూసినా ఏదో దిగులుగా, ఏదో బాధగా 'ఎందుకిట్లా బ్రతకటం' అన్నంత నిరాశతో కన్పిస్తారేమిటి?...

ఇంకో వంక అతడు పెద్ద వుద్యోగస్తుల్ని భాగ్యవంతులైన వ్యాపారస్తుల్ని ఆస్తిపరుల్నీ చూశాడు. వాళ్లి సమస్యలు ఆశ్చర్యం గొల్పుతున్నాయి. ధరలింకా పెరగటం లేదేమనీ, ఇంకా అర్జన పెరగదేమా అనీ దిగులుపడుతున్నారు వాళ్లు. ఇంకొకొందరు తమ ఆస్తుల సరిహద్దుల దగ్గర గజన్నర స్థలం కోసం హైకోర్టులదాకా వెళ్లి డబ్బు ఎలా వినియోగించాలో ఇతర్లకి చూపిస్తూన్నారు. వీళ్ళ మూలంగా న్యాయస్థానాల్లో ఖాళీలుండటంలేదు. న్యాయవాదులు బాగుపడుతున్నారు...వాళ్లకి జీవితమే జూదంగా, డబ్బే పావులుగా కన్పిస్తోంది.

మొత్తానికి సదానందం ఈ ఎలక్షన్ దెబ్బతో చాలా విషయాలు ఏ పుస్తకాలూ నేర్పలేనివి నేర్చుకున్నాడు.

అతను చాలా ఆసక్తిగా ప్రతి వాళ్లనీ వెళ్లి కలుసుకుంటున్నాడు. ఒకరోజు మధ్యాహ్నం అతడూ తన స్నేహితులతో సహా ఓ కారుడ్రైవర్ ఇంటికి వెళ్లాడు. ఆయింటికి రేకుల కప్పు. గోడలు శిథిలావస్థలో వున్నాయి.

[illegible] యజమాని లేడు. అతని భార్య వున్నది. ఇద్దరు పిల్లలతో సహా. మొహాలు ఎండిపోయి కళ్లు పీక్కుపోయి, కూర్చుని వున్నారు ముగ్గురూ.

"ఏమండీ డ్రైవర్ వెంకన్నగారిల్లు ఇదే గదండీ" అని ప్రశ్నించాడు సదానందం ఆమెని. తల వూపింది. "ఎందుకూ? మీకేమన్నా బాకీయా?" అన్నది ఆమె భయం భయంగా. సదానందానికి ఒక్కసారిగా నవ్వూ విషాదం కలిసి వొచ్చాయి. "ఏమిటమ్మా! అలాగడుగుతున్నారు?" అని ప్రశ్నించాడు. మిగతా యువకులు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"మావారు ఏవూరో పోయినారు పదిరోజులైంది. ఆయన ఎళ్లిందగ్గిర్నించి రోజూ ఏ బాపతు బాకీవారైతేం రోజూ ఇద్దరూ ముగ్గురూ వొచ్చి ఇంటిముందు కూర్చుని నానామాటలు అంటున్నారు నాయనా! మీరూ...అంతేనేమో అనుకున్నాను."

సదానందం కుంగిపోయినాడు. "పదండి, డ్రైవర్ గారొచ్చింతర్వాత మళ్లీ వొద్దాం" అని స్నేహితులతో కలిసి బయల్దేరాడు.

మధ్యాహ్నపు ఎండ రోడ్డుమీద తళతళలాడుతోంది. వేప్పచెట్ల ఆకుల్లోంచి గాలి దూసుకుపోతోంది.

వాళ్లింకో ఇంటి కెళ్లారు. ఈయిల్లు ఆరు కుటుంబాలున్న పెద్ద పెంకుటి కొంప. బైట అరుగుమీద ముసలాయన వొకరు పిల్లలకి చదువు చెబుతున్నాడు. ఆయన్ని పలకరించాడు సదానందం.

"ఏమండి, ఈ యింట్లో ఐదుగురు వోటర్లున్నారండి. మున్సిపల్ ఎలక్షన్లు దగ్గిరపడుతున్నాయి. నేను స్వతంత్ర అభ్యర్థిని!" అని తన్ను తాను పరిచయం చేసుకున్నాడతను.

ముసలాయన "ఆపేళ్లటి కెవరికో ఒకరి కేస్తారులెండి [illegible] మీరు ఓటు కింత ఇస్తున్నారేమిటి?" అన్నాడు గొంతు [illegible].

సదానందం విస్తుపోయ్యాడు. కొంచెం తమాయించుకుని "అభ్యర్థులవారేమన్నా ఇస్తానన్నారా?" అని ప్రశ్నించాడు.

ముసలాయన "మా ఐదు వోట్లకిగాను నూటపాభై అడిగాం. ఇస్తామన్నారు. మీరూ మాకు ముఖ్యులే. ఏదైనా ఎక్కువ ఇప్పిస్తే మీకే వేస్తాం వోట్లు" అన్నా డాయన నిష్కర్షగా.

"నమస్కారం తాతగారు! నేనలాంటివాణ్ణిగాదు. నా దగ్గర డబ్బు లేనూలేదు. ఏదో మనందరి తరఫునా కౌన్సిల్లోవుండి, కాస్త సేవచేద్దామని అడిగాను" అన్నాడు సదానందం.

"చాలా గొప్పవాడివిలే. ఏమిటయ్యా నువ్వు చేసే సేవ? కౌన్సిలరయి నాల్గుడబ్బులు చేసుకోటమేగా? పదవయ్యా, పద!" అన్నాడు ముసలాడు విసుగ్గా.

సదానందం బయల్దేరాడు. ఇంత మాత్రానికే నిరాశపడితే లాభంలేదు...వాళ్ళు ఇంకా చాలామందిని కలుసుకున్నారు. గూడెంలో వోట్లు గ్యారంటీగా తనకే వస్తాయి. కాకపోతే డబ్బాశ చూపించి, గుమాస్తాలవీ, ఇంకా అటువంటివారివీ లాగేస్తారు ప్రత్యర్థులు...తనకి డిపాజిట్టు దక్కవచ్చు. పొరపాట్న గెలవవచ్చు కూడా; అట్లాంటి ఆశకి ఆస్కారం లేకపోలేదు. చాలామంది ఓటు వేస్తామన్నారు...అదే నిజమైతే సంగతి.

సదానందం ఆవేళ ఇంటికి వొచ్చేటప్పటికి రంగయ్యగారు దొడ్లో కాలుజారి కిందపడి మంచంమీద వున్నాడు. పైకేమీ గాయం కన్పించలేదుగాని, లోలోపల బాధపడుతున్నాడు. మతి అసలే లేదు. ఎప్పుడు చూసినా భాగవతం స్మరణే. జయ గొడవే; తప్పితే, హైస్కూలూ, హెడ్‌మాస్టరూను.

సదానందం తండ్రి దగ్గరకొచ్చి కూర్చుని ఆయనవంక చూడసాగాడు, ఎన్నడూ లేనంత ఆసక్తిగా. అతనికి తండ్రి అంటే భయమేకాదు, చాలా గౌరవభావంకూడా వుంది మనస్సులో ...ఆయన రాసిన భాగవతంలో ప్రతీవాక్యం ఎంత గొప్పగా వుందో, ప్రతీ పద్యమూ ఎంతటి భావసమున్నతమైనదో అత నెరుగును. కాని ఆయనకీ దుస్థితేమిటి? ఆయన ఈ స్థితిలోనే కన్ను మూస్తాడా?

సదానందం తండ్రి వొంటిమీద చెయ్యేసి చూశాడు. ఆయన వొళ్ళు కాలిపోతోంది. జ్వరతీవ్రతవల్ల కణతలు పొంగివున్నాయి. సదానందం వెంటనే లేచి బల్లమీదవున్న ఒక సీసాలో పొడిని నీళ్ళల్లో కలిపి తండ్రి నోట్లో పోశాడు. "నాన్నా! కాస్త మందు తాగు!..." అన్నాడు.

రంగయ్యగార్కి దొడ్లో కాలుజారి కిందపడ్డప్పటి అదురుకి, కొంచెం బాహ్యస్మరణ కలుగుతోంది, రెండుమూడు నిమిషాలకి. కాని మధ్యమధ్య ఎక్కువసేపు యథాప్రకారం మతి భ్రమిస్తోంది.

అట్లాంటి స్మరణ అకస్మాత్తుగా కలిగిం దాయనకు. మందు మింగి, "నాయనా! సదానందం! నువ్వేనా?" అని అడిగా డాయన హీనస్వరంలో.

"అవును నాన్నా! నేనే. మాట్లాడు నాన్నా!" అన్నాడు సదానందం, చాలా ఆశతో.

వరలక్ష్మిగారు వంటింట్లోంచి పరిగెత్తుకొచ్చిం దీ మాటలు విని. "నాన్న మాట్లాడుతున్నార్రా! పరమేశ్వరుడి పుణ్యమా అని...నన్ను దయదల్చాడు." అందామె సగం ఏడ్పు గొంతులో.

రంగయ్యగారు కొడుకు చేతులు తడిమి పట్టుకుని, "బాబూ! శేషాద్రిరావు వుత్తర మేమైనా రాశాడా! జయ సంగతేమైనా తెలిసిందా!" అన్నాడు ఆయాసంతో.

"వాళ్ళ బాకీ తీరిపోయింది నాన్నా! జయకి వొళ్ళు కులాసాగానే వుందిట. వారం పదిరోజుల్లో ఇక్కడికి వొస్తుంది నాన్నా!" అన్నాడు కొడుకు చాలా ఆప్యాయంగా, తండ్రికి మంచి వార్త వల్ల మతిస్థిరం ఏర్పడొచ్చన్న ఆశకొద్దీ.

కాని రంగయ్యగారి మాటల్ని సగం వినకముందే తిరిగి ఆయన పిచ్చిలో పడిపోయాడు. "ఒరే శేషాద్రీ! నీకు డబ్బే ప్రధానం గాని నా కూతురు ఏగతికిపోతే నీకేమిరా!" అని అరవసాగా డాయన.

తల్లీకొడుకులు ఒకరి మొహా లొకరు చూసుకున్నారు. సదానందం తండ్రి మంచంమీంచి లేస్తూ, "రేపు నాన్నగార్ని పెద్దాస్పత్రిలో చేరుస్తానే అమ్మా! ఈ జ్వరం ఈ పిచ్చిమాటలూ చూస్తాంటే నా కేదో భయంగావుందే" అన్నాడు.

తల్లి కంట తడిపెట్టి వెక్కుతూ, "ఏదో ఒకటి చెయ్యి నాయనా! నాకేం తోచటం లేదురా!" అంది.

"భయపడకమ్మా! నాన్న కాస్త దోవన పడుతున్నారులే. ఇందాక సరిగ్గా మాట్లాడలేదు?" అన్నాడు.

47

కనకవల్లి ఇంట్లో ఓ కుర్చీలో కూర్చుని పైకప్పువంక చూస్తూ ఆలోచిస్తోంది. వరదరాజింకా రాలేదు. సాయంత్రం ఆరు కావస్తోంది. కిటికీలోనుంచి చూస్తే ఆకాశంలో తెల్లని నక్షత్రం ఒకటి మెరిసిపోతోంది. ఆమె బాగా అలంకరించుకునివుంది. ఈ సమయాన శాస్త్రిగారు లోపలికొచ్చారు మెల్లిగా చుట్టూ చూస్తూ. ఆమె ఆయన్ని ఆహ్వానించి కుర్చీ చూపించి "ఏమిటిలా బయల్దేరారు వేళగానివేళ!" అన్నది.

శాస్త్రిగారు కూర్చుని, "ఏమిటో పిచ్చిగా వుంటేనూ బయల్దేరానులే. మొన్న చెప్పి వెళ్లానే, నెక్‌లెసు, చేయించాడా?" అని ప్రశ్నించాడు.

"చేయిస్తానన్నాడు. నిన్న ఆదివారమైంది. ఇవ్వాళ తీసుకొస్తాడేమో!" అన్నది చాలా మామూలుగా.

శాస్త్రిగారి మొహంలో ఆశ్చర్యం మెరిసింది. "ఏమిటేవ్! ఇతను చూస్తే అఖండుల్లా వున్నాడు! నువ్వడగడం తరవాయి అన్నీ వొచ్చి పడుతున్నాయి! ఆ నెక్‌లేసు ఎంత చేస్తుందో నీకేమైనా తెలుసా?...కనీసం రెండువేలుంటుంది. అందులోని 'పచ్చ' ఖరీదు ఐదొందలు! ఎలాగో మాయలో పడేశావు! అదృష్టవంతురాలివి!" అన్నా డాయన.

కనకవల్లి మొహంలో అసహ్యం, భయం ఆవరించాయి. ఆమె మందకొడి కళ్ళల్లో ఏదో చెప్పరాని రహస్యం దాగివున్నట్టు తోచింది శాస్త్రిగార్కి. ఆమె ఒకసారి వాకిలివైపు చూసింది. "ఏం మాయలో వేశా నంటారు? ఈ రోజుకి నేను అతనికి అవసరమో కాదో, అసలు నేనెందు కిక్కడ వున్నానో నాకే తెలియటం లేదండి శాస్త్రిగారు! కొంచెం కరుగ్గా మాట్లాడితే— మొన్న ఒకనాడు, దవడమీద పోటుగా కొట్టాడు. చనువుగా మాట్లాడితే, "ఎందుకే దొంగవేషాలు! ఎందుకీ నంగిమాటలు! అంటాడు. అయితే—చిత్రం, ఏమడిగినా వెంటనే తెచ్చి పడేస్తాడు, ఇష్టమో అయిష్టమో!...ఏమిటోనండి, నా కిదో పంజరంలా గున్నదండి. ఎప్పటికి విముక్తో తెలియటంలేదు!" అన్నదామె చాలా బాధగా.

శాస్త్రిగారు నవ్వాడు. "పిచ్చిదానా! డబ్బుగలవాడితోటి స్నేహం ఎప్పుడూ ఇలానే వుంటుంది! అతడెటువంటివాడైతే నీ కెందుకు? నీపని నువ్వు నెరవేర్చుకో. ఏనాడు పోవాలనుకుంటావో ఆనాడే వుడాయించు! ఏం బాధ!" అన్నా డాయన.

"అదంత తేలికపనికాదండి శాస్త్రిగారు!..." అని ఆపేసింది.

శాస్త్రిగారికి ఆమాట అనటంతోటే, ఆనాటి రాత్రి తన ముందు మెరుపు వెలుగులో బాకు చేతపట్టుకుని భయంకర యముడల్లే నిలబడివున్న వరదరాజు జ్ఞాపకం వొచ్చాడు. ఆయనకి ఒక్క నిమిషం వొళ్లు జలదరించింది. "నిజమే, నిజమే, ఎలాగో జాగ్రత్తగా మసులుకో" అంటూ లేచాడాయన. "నే వెళ్ళొస్తా. అతనొస్తే, ఉదయం పార్టీఆఫీసుకు రమ్మనిచెప్పు" అని బయల్దేరివెళ్లాడాయన.

కనకవల్లి కిప్పుడు నెక్‌లెస్ కన్న ఈ పంజరంవొదిలి ఎటన్నా పోతే బావుణ్ణు అనే ఆవేదన ఎక్కువైంది. కాని కర్తవ్యంతోచదు.

ఆ వేళ వరదరాజు చాలా పొద్దుపోయిగాని ఇంటికి రాలేదు. అప్పటిదాకా అతను పచ్చమేడలో చిన్న పక్కనే కూర్చున్నాడు. చిన్నా జ్వరతీవ్రతలో గొణుగుతూ అతన్ని పట్టుకుని వొదల్లేదు. రాత్రి ఏడింటినించీ వరదరాజు అక్కడే వున్నాడు. కుర్రాడితల్లి అబ్బాయికి పరిచర్యలుచేస్తూ, మందు తాగిస్తూ అక్కడే వుంది.

ఆమెభర్త దిగులుగా ఓ కుర్చీలోకూర్చుని ఆలోచిస్తున్నాడు. వరదరాజు, కుర్రాణ్ణి సముదాయిస్తూనే, "మీరేం భయపడకండి. నేనుపోయి పెద్ద డాక్టర్‌ని తీసుకువస్తాను" అన్నాడు ధైర్యం చెబుతూ.

కుర్రాడితండ్రి "అంత డబ్బు మాదగ్గిర ఎక్కడిదండి, మా ఆదాయ మెంత మేమెంత! చిన్న బీడీకొట్టు పెట్టుకుని జీవిస్తున్నాం. ఆచార్లుగారిస్తున్న మందుతో సరి!." అన్నాడు దిగులుగా.

వరదరాజు, "డబ్బుకు చూస్తున్నారా! ఎంత కావలిస్తే అంతా నేనిస్తానండి. చిన్న లేచి తిరగాలిగాని, ఎంతడబ్బు అయితేం లెక్క!" అంటూ జేబులోనించి పదిరూపాయలకట్టు బైటికి తీశాడు.

తండ్రి 'అబ్బే! మీ రివ్వట మేమిటండి! నేనులేనూ! నా ప్రాణమేనా అడ్డం వేసి కుర్రాణ్ణి కాపాడుకుంటాను. మీదగ్గిర తీసుకోటం ధర్మమా! వొద్దు. వొద్దు" అన్నాడు. ఆయన అభిమాని.

వరదరాజు "ఇట్లాంటిసమయాల్లో ఒకరికొకరు సాయం చెయ్యటం తప్పగాదండి" అంటూ లేచి, డబ్బు ఆయన కివ్వబోయాడు.

ఇంటాయన నిరాకరించాడు మొండిగా. "అక్కర్లేదులెండి. పెద్దాస్పత్రిలో డాక్టర్ నాకు పరిచయంలెండి. కుర్రాణ్ణి రేపు ఆస్పత్రిలో చేర్పిస్తాను" అనేశాడు.

మొదటిసారిగా వరదరాజు డబ్బు నిరుపయోగం కావటం చూసి విసుక్కున్నాడు. ఆతర్వాత చాలాసేపు కుర్రాడిపక్కనే కూర్చుని వుండిపోయినాడు.

కుర్రాడు నాలుగురోజులకిందటికంటే ఈరోజుకి చాలా తేరికించి వున్నాడు. వరదరాజు డబ్బు జేబులోపెట్టుకుని పదకొండింటికి ఇల్లు చేరుకున్నాడు. అతనికి బహు చిరాకుగా వుంది.

కనకవల్లి అలాగే కుర్చీలో కూర్చుని తూలుతూవుంది. వరదరాజు తలుపు తట్టగానే ఆమె వులికిపడిలేచి తలుపుతీసింది.

కొంచెంసేపు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు చెరిఒక మూల. ఎవరిమనస్సులోని భారం దిగులూ వాళ్ళని దిగలాగుతోంది. ఈ మౌనాన్ని ఆట్టేసేపు భరించలేకపోయింది కనకవల్లి. "ఏమండి, నెక్‌లెస్ తెచ్చారూ?" అంది, మెల్లిగా.

వరదరాజు, "రేపు తెస్తాలెద్దూ. అది లేకపోతే నీ అందం తగ్గిందా ఏమిటి?" అన్నాడు విసుగ్గా.

"ఇందాక శాస్త్రిగారొచ్చి నిన్ను ఉదయం వాళ్ళ పార్టీ ఆఫీసుకు రమ్మని చెప్పమన్నాడు" అన్నది.

వరదరాజేమీ మాట్లాడలేదు.

మర్నాడు దీపంపార్టీ ఎలక్షన్ ప్రచారం పెద్దఎత్తున ప్రారంభమైంది. సత్యనారాయణపురంలో ఒక ఇంటిని అద్దెకి తీసుకున్నారు వరదరాజుకోసం. అక్కడినించి వాలంటీర్లు బయల్దేరి వరదరాజు పెట్టించిన హోటల్లో చెక్కపూటుగాతిని ఒక బజారంతా, "మీ వోటు వరదరాజుగారికే" అని అరిచి, తిరిగి అలిసిపోవటంవల్ల మళ్ళీ హోటలుకువచ్చి కాఫీ తాగేవారు. ఒక వాలంటీరు ఇంకో వాలంటీరుతో, "ఇప్పుడు విజయవాడ మొత్తంమీద వరదరాజులా ఖర్చుపెట్టేవాడు ఈ ఎలక్షన్‌లో ఎవడూ లేడురా" అన్నాడు.

"నిజమేరా! వాలంటీరుకి రోజుకి రెండు రూపాయలు! భోజనం కాఫీలు ఇచ్చి!" అన్నాడు రెండోవాడు.

"పెద్ద ధర్మసత్రంలా సాగుతున్నది వ్యవహారం, ఇంకో సంగతి విన్నావా? వోటుకి ఎంత ఇస్తాడో తెలుసా?"

"తెలీదురా!"

"నాకూ నిఖరంగా తెలీదుగాని, మొత్తంమీద పది, పదిహేనువరకూ ఇస్తాడ్ట..."

టీ హోటలు మహాజోరుగా సాగుతున్నది. ఒక్కడూ డబ్బు ఇవ్వటంలేదు. ఎవ్వడడిగినా "ఓటర్ని!" అంటున్నాడు. ఏడుకొండలే మేనేజరు. ఓటు విలువ తెలిసిన పరువుగల ఓటరు కొందరు డబ్బులిచ్చి వెళ్తున్నారు. వాళ్ళని మహాశ్చర్యంతోటే చూస్తున్నాడు ఏడుకొండలు.

అదే సమయాన ఎలక్షన్ ఆఫీసు మేడమీద గూడెం పెద్దని కూర్చోబెట్టి వరదరాజూ, శాస్త్రి దీపంపార్టీ టౌన్ ఆర్గనైజరు యుగంధరరావూ మాట్లాడుతున్నారు.

"ఏమోయ్, ఫుల్లయ్యా, మరి మీ వోట్లు పన్నెండు వందల వరకూ ఉన్నాయి, తెలుసా?" అన్నాడు యుగంధరరావుగారు.

ఫుల్లయ్య బక్కపల్చగా పొడుగ్గా వున్నాడు. కారు నలుపు. తల ముందువేపు నున్నగా గొరిగి, వెనక జుట్టు ముడేశాడు. ఎర్ర పంచె, వలబనీను, మల్లు చొక్కా తొడిగాడు. తాంబూలపు గారతో పళ్లు కావిరంగు తిరిగాయి. అతను చిరునవ్వు నవ్వి, "తెలుసు దొరగారూ" అన్నాడు.

యుగంధరరావు వరదరాజును అతనికి చూపించి, "వీరు నిలబడ్డారీ వార్డుకి. ధర్మాత్ములు. మీకు చాలా మేలుచేస్తారు...మరి మీ వోట్లన్నీ ఇటే పడేట్టు చూడాలి నువ్వు" అన్నాడాయన.

ఫుల్లయ్య రెండుమూడు నిమిషాలు వరదరాజు వేలి వుంగరాన్ని, మెళ్లో గొలుసుని, అతని నీటు దుస్తుల్ని చూశాడు. ఉన్నవాడే...తను ఈ దెబ్బతో కొంత బాగుపడే అవకాశం వుందన్నమాట...

"మీ మాట కాదంటానా? అందరికీ చెబుతాను." అన్నాడతను.

"చెబుతానంటే కాదోయ్, దగ్గరవుండి వేయించాలి. గూడెం పెద్దవి నువ్వు. నువ్వు చెబితే పని కాకపోతుందా?..." అన్నాడు శాస్త్రిగారు.

"చెబుతానండి. కాని..." అని ఫుల్లయ్య నసుగుతుంటే వరదరాజు అందుకుని, "ఆ గూడెం గోతులూ అవీ బాగుచేయిస్తానోయ్!...ఊం అను!" అన్నాడు.

"కానీ ఏమిటోయ్?" అన్నాడు యుగంధరరావు. ఆయనకి తెలుసు వ్యవహారం. గూడెం పెద్దకిగానీ, శాస్త్రిగారిక్కాని, టౌన్ ఆర్గనైజర్‌గారిక్కాని, గూడెం గోతులు బాగుపడ్డం కాదు కావల్సింది. ఫుల్లయ్యకి డబ్బు ఇస్తే దాంతో సాధిస్తాడు పని. మిగతా వోటర్లకి డబ్బు చేరితే ఏం చేరకపోతే ఏం?...కులపెద్దగా! కులంలో వెలెయ్యటానికి చేర్చుకోటానికి అతనికి అధికారంవుంది. ఆ అస్త్రం ప్రయోగిస్తే పని కాకపోతుందా?...

ఫుల్లయ్య మెల్లిగా, "రేపు మా గూడెం అమ్మవారి కొలుపులున్నాయి దొరా! ఓ ఐదారువందల డబ్బు కలుగుద్ది. అదిగాని అయ్యగారిచ్చినారంటే ఇంక పనయినట్టే!" అన్నాడు ఫుల్లయ్య.

"అట్లాగే తీసుకో. అమ్మవారి కొలుపులు చేసుకుంటామంటే కాదంటామా!" అన్నాడు టౌన్ ఆర్గనైజర్.

వరదరాజుకి ఆశ్చర్యంగా వుంది. డబ్బుకి వినియోగం ఇదేనా? ఇంకేం లేదా! అని. కాని ఆ విధంగా ప్రశ్నించేపాటి సంస్కారం అతనిలో లేదు. ఇది అనవసరం అని మాత్రం తెలుసు. పైకి ఎలా అంటాడు? చుట్టూవున్న పెద్దలలో వెలితి కాదూ?... "పుల్లయ్యా! నే వెళ్తున్నా వొచ్చి పైకం తీసుకు వెళ్ళవోయ్. ఎలాగో మాట దక్కించు!" అన్నాడు.

పుల్లయ్య పైపంచ దులిపి వేస్తూ "దండం బాబూ!" అని నిష్క్రమించాడు.

అతను వెళ్ళింతర్వాత లోన్ అడ్వైజర్ వరదరాజువంక చూసి నవ్వి, "పోనీ వెధవలండీ. డబ్బు అంటే సరి, చచ్చే శవంగూడా నోరు తెరిచి మాట్లాడుతుంది!" అన్నాడు.

శాస్త్రి గారు అందుకున్నారు. "అందులో అతిశయోక్తి లేదు లెండి. మొన్న నీమధ్య నే ఓటుకులాడు అకస్మాత్తుగా చస్తే దాయాదులు 'విల్ నామా' రాయించి, శవం చేత వేలిముద్ర వేయించుకున్నారు; తీరా రిజిస్ట్రార్ వొచ్చేవరకు మనిషికి ప్రాణం లేచివొచ్చి కూర్చుని, తన ఆస్తంతా ధర్మానికి రాసిచ్చి మరీ చచ్చాడు" అన్నాడు.

అందరూ గొల్లున నవ్వారు.

అడ్వైజర్ యుగంధరరావు "ఓటర్ల లిస్టులో చూశారా, ఎంతమంది చచ్చినవాళ్లో? ఒక్కొక్కప్పుడు అవసరమైతే వాళ్ళు లేచివచ్చి వోట్లు వెయ్యడంకద్దు!" అన్నాడు ధిలాసాగా.

వరదరాజు "చచ్చిపోతే వచ్చినవాళ్లు లేస్తారు గావును?" అన్నాడు.

"ఇంతే — అంతే! అది నిజంగా వంచనలాంటిది!" అన్నారు శాస్త్రిగారు.

48

ఎలక్షన్ వారం వుందనగా ఒకరోజున సదానందం డాక్టర్ తో మాట్లాడుతూ ఆనాటి కార్యక్రమం గురించి. "ఇవ్వాళ రాత్రి గాంధీపార్కు చౌకులో బహిరంగసభ. మీరువచ్చి అధ్యక్షత వహించాలి" అన్నాడతను.

డాక్టర్ "మాకొవుటోయ్ అబ్బాయి! మీమా ఖర్చు పెట్టగాదేవంటూ ... తేరితే ఇప్పటికి రెండొందలయింది! చివరికి ఎలా తేలుతుందో గాని!" అన్నాడు.

"అవునండి! పదిహేనురోజులనించి, తిండీ తిప్పలూ నిద్రా పోరాలూ మానేసి తిరిగి తిరిగి, నేను చివరికి 'ఓ కాంటు' వయ్యొట్టున్నాను. కాని మహోత్సాహంగావుందిలెండి ఈ వుద్యమం" అన్నాడు.

"నీకు ఓటర్ల పరిస్థితులూ అవీ బాగా తెలిసివుంటాయే!"

"బాగా తెలిశాయండి! ఎటుచూసినా తీవ్రమైన దారిద్ర్యం కన్పిస్తున్నదండి. అందరూ ఒకటేపల్లవి; 'ఎవడైతేం?' అని. అందుకు వాళ్ళనన్న ప్రయోజనంలేదు. వాళ్ళ దారిద్ర్యం అలా అనిపిస్తోంది. వాళ్ళసమస్యలు ఎలక్షన్లలో వోట్లు వేసినంతమాత్రంచేత పరిష్కారం అయిపోతాయన్న నమ్మిక వాళ్ళకి కలిగించలేకుండా ఉన్నామండి"

"ఎలాగా కలిగించలేవు. నిజానికి ఆ సమస్యల్ని పరిష్కరించలేంగూడానూ! వ్యక్తిగతసమస్యలైతే ఎలాగో సవరించగలవు. సాంఘికంగా అలుముకునివున్న ఈ సమస్యల్ని ఎలా పరిష్కరించగలవు? నీకయితే చిత్తశుద్ధి వుంది. నీతోటి కౌన్సిలర్లు కాబోయేవారంతా నీతో సహకరిస్తారా? అందాకా ఎందుకూ? అసలు నిన్ను గెలవనిస్తారా? మెజార్టీ గనక నిజం మాట్లాడావా, నిన్నులాగే వాళ్ళూ వాగించి తన్నించేస్తారు! అన్నిటికీ తన్నించుకుని కౌన్సిలరవుతావు? ముఖ్య పూరికి ఆ మహాదేశాల్లో అరుగుదల వుండవల్సిందే."

"అదైనా మంచిదేగా డాక్టర్ గారూ! కొత్త అరవనిస్తే, మరగోలు విననైనా వినబడుతుందిగదా! అదీ నా ఉద్దేశ్యం!"

"అంతవరకు నీకోరిక పరిమితమైవుండడం మంచిది; కనీసం కొంతకాలంవరకు!" అన్నాడు డాక్టర్.

"ఇవ్వాళ సభకు వొస్తారుగదండీ?" అన్నాడు సదానందం డాక్టర్ గారివంక సగౌరవంగా చూస్తూ. డాక్టర్ కొంచెం సవరించుకుని, "వొస్తానయ్యా! తప్పేముంది! కాని, నాకు... ముఖ్యం, నేను డాక్టర్ ని. ఏ వేళప్పుడు ఏరోగికి ప్రమాదం అని పిలవాల్సి వొస్తుందో ఏం చెప్పగలను! ఇంకెవరైనా చూసి వుంచు. నేనొస్తేనాసరే; లేదా, ... ఇటు చూడవోయ్! నాకు ఎలక్షన్ల కంటే మనుష్యుల ప్రాణాలు ముఖ్యం; రోగులంటే నాకు జాలి!" అన్నాడాయన. అది నిజమే. ఆ సంగతి సదానందానికి బాగా తెలుసు.

సదానందం వెళ్ళేవేళకి పదకొండుగంటలయింది. మధ్యాహ్నం ఎండ మండుతూంది. అతని కడుపులో ఎలుకలు పరుగెత్తుతూ వుంటే, పక్కనే ఒక హోటల్లోకి వెళ్ళి అరకప్పు కాఫీ తాగి పైకి వచ్చాడు. శ్యామల అటు వెళ్తూవుండడం అతనికి కన్పించింది. ఆమె కొంచెం సమీపించగానే, అతను, "ఏమండీ, ఈవేళప్పుడు ఎక్కడికో అదాటుగా వెళ్ళిపోతున్నారు?" అని ప్రశ్నించాడు.

శ్యామల ఎండకి కొంచెం వాడినట్టుగావుంది. "ఇవ్వాళ మీ యింటికైనా వొచ్చి మిమ్మల్ని కలుసుకోవాలనుకుంటున్నానండి. ఒకమాట మీతో చెబుదామని!" అన్నది.

ఆమె పక్కనే నడుస్తూ, సదానందం, "ఏమిటది!" అని ప్రశ్నించాడు.

"నాన్నగారికి మీ ఊరు ట్రాన్స్ఫర్ అయిందండి. కుటుంబంతా వెళ్ళిపోతున్నాం. రేపో ఎల్లుండో" అన్నదామె చాలా సహజంగా.

సదానందం కుంగిపోయ్యాడు. తనను ప్రేమిస్తున్నదనే కొంచెమైనా బాధపడదా, ఇక్కణ్ణించి వెళ్ళిపోతున్నందుకు? కాని వెళ్ళకేమా! కాలేజీ చదువుతోందిగా! "మరి మీ చదువో?" అని ప్రశ్నించాడతను నీరసంగా.

"మానెయ్యటమే! నాకు పెళ్ళి కుదిరిందని నా అమ్మ చెప్తోందండి. నాన్నగారు తలొంచక తప్పలేదు!" అన్నదామె తల వొంచుకుని నడుస్తో.

"చదువు మానటం మీ కిష్టం లేదనుకుంటా!" అన్నాడు సదానందం.

"మన యిష్టాయిష్టాలతో నిమిత్తం లేదండి.. వ్యతిరేకించి ప్రయోజనం లేదేమో అనిపించింది. మా నేస్తానన్నాను."

"అయితే ఇక మనం దూరమైపోతున్నామన్నమాట! మరి నేను జ్ఞాపకం వుంటానా?" అన్నాడతను లోలోపల బాధపడుతూ ఏం సమాధానం చెబుతుందోనని ఆశగా ఎదురుచూస్తూ.

శ్యామల ఈ ప్రశ్నలోని అంతరార్థాన్ని అతని స్వరాన్ని పట్టి పోల్చింది. "ఎందుకు జ్ఞాపకం వుండరండి? మీ చిత్రాలమీద గౌరవం శాశ్వతం" అన్నదామె, అతనివంక చూస్తూ.

సదానందం ఉద్రేకం ఆపుకోలేకపోయినాడు. తన ఉద్దేశాన్నయినా ఆమెకి తెలియచేస్తే, హృదయభారం కొంతవరకు తగ్గుతుంది... "శ్యామలా! నా చిత్రాలమీదనేనా నీకు గౌరవం?

అయితే నేను పొరబడ్డాను శ్యామలా! నిన్ను నేను ఎంతగానో ప్రేమించాను. ఇప్పుడు ప్రేమిస్తూనే ఉన్నాను. నా పొరపాటుకి నన్ను క్షమించు..." అన్నాడతను బాధగా.

"నేను మిమ్మల్ని క్షమించడమా! మీరే నన్ను క్షమించాలి గాని! మిమ్మల్ని నేను ఆదినించీ గౌరవించాను. మీరా గౌరవాన్ని ఇలా అర్థం చేసుకున్నారంటే నేను ఎక్కడైనా హద్దు మీరి ప్రవర్తించానేమో ననిపిస్తోంది. నన్ను క్షమించండి. ఇందువల్ల నాకు మీమీది గౌరవం హెచ్చిందిగాని ఏమీ తగ్గలేదండి. నే వెళ్లొస్తాను! జయ వొస్తే నేను అడిగినానని చెప్పండి!" అంటూ శ్యామల చకచక నడిచి వెళ్ళిపోయింది.

సదానందం పది నిమిషాలు అదే ఆవేశంలో నిలబడిపోయినాడు. కాని తర్వాత తేరుకుని ఎండమావులవెంట పరిగెత్తితే ఫలం ఇంతే ననుకున్నాడు. ఎంత సమర్థించుకున్నా అతని హృదయభారం తగ్గటంలేదు. అతను చాలా సేపటికి తన దృష్టిని తిరిగి ఎలక్షన్ గొడవలోకి మరల్చుకోగలిగాడు.

అతను ఆస్పత్రికి రాగానే డాక్టర్ గారు, "ఏమోయ్, శాస్త్రులుగారు ట్రాన్స్‌ఫర్ ఐనాట్టుగా? మన కియ్యవల్సిన ఫీజు అరవై తిరిగి పంపించారులే. నా శ్రీమతియే వొచ్చి చెప్పి వెళ్ళింది." అన్నాడు.

సదానందం మొహం వాల్చుకుని "నాతోనూ చెప్పిందండీ" అన్నాడు. అతని హృదయంలో భారం మొహంలో తొంగి చూస్తోంది. డాక్టర్ అనుభవజ్ఞుడు. "కొంత శీలవుతున్నట్టున్నావే?" అని ప్రశ్నించాడు.

"ఏదో కొంత పొరబడ్డాను. ఇప్పుడే తెలుసుకున్నాను డాక్టర్ గారు! అయినా మనస్సు ఇంకా బాధిస్తూనేవుంది" అన్నాడతను.

డాక్టర్ నవ్వాడు. "ఈ వయస్సులో అలా పొరబడ్డం సహజమే. బాధగాకూడా వుంటుంది. అంతమాత్రానికే మునిగిపోయినట్టుగా యాక్ట్ చెయ్యటం, కర్తవ్యం మరిచిపోవటం అవివేకం" అన్నాడాయన.

"కర్తవ్యం మరిచిపోతానా! బాధ తప్పదుగాని." అన్నాడా నిరాశాక్రాంతుడైన యువకుడు.

"ఆ బాధ కొద్దిరోజుల్లో మర్చిపోతావులే" అన్నాడు డాక్టర్.

ఆ వేళ రాత్రి పదిగంటలకి చౌకులో మీటింగ్. పెద్ద బల్లలు రెండు జతగా వేసి రెండుపక్కలా 'బహిరంగ సభ' అని అట్టలు కట్టారు సదానందం స్నేహితులు. పెట్రోమాక్సు లైట్లు వెలుగుతున్నాయి. జనం పలచగా కూర్చుని వున్నారు. ఎదురుగా వీధిలో

★ అపస్వరాలు ★

ఒకవేపు ఇళ్ళవరసల అరుగులమీద చాలామంది కూర్చుని వున్నారు ముసుగులు వొత్తుగా కప్పుకుని.

ఈ బహిరంగసభకి మైకులు లేవు. ముందుగా డప్పులు కొయించడంలేదు; కనీసం నోటీసులేనా పంచలేదు. అంచేత జనం చాలా తక్కువున్నారు. దూరంగావున్న ఒక బీడీకొట్టు ముందు బల్లలమీద నలుగురు దీపంపార్టీవర్కర్లూ పార్టీ టౌన్ ఆర్గనైజర్ యుగంధరరావు కూర్చుని సభనిగురించి మాట్లాడుతున్నారు సిగరెట్లు తగలేస్తో, నవ్వుతో.

ఒక వాలంటీరు మరో వాలంటీరుతో "సభ మధ్యలో ఆరిపోవు గదా లైట్లు!" అంటూ పకపక నవ్వాడు.

ఇంకో అతను బీడీ అంటించి, "చాలామంది వొచ్చార్రా! నిజంగా ఇది వాళ్ళఅంచనాకన్న చాలా ఎక్కువ. కింద కూచున్న వాళ్లు ఇరవైమంది వుంటారులే! ... అమూల నిద్రపోతున్నాడే అతనితో, హా!" అన్నాడు.

టౌన్ ఆర్గనైజర్ నవ్వి "మరీ అంత తీసేసినట్లు మాట్లాడకండి బాగుండదు. ఏదో డిపాజిట్టేనా దక్కుతుందిలే అతనికి" అన్నాడు అప్పుడే బల్లమీదనుల్చుని మాట్లాడబోయ్యే సదానందాన్ని చూపుతో.

వాలంటీర్లు, "డిపాజిట్టా!" అని నవ్వారు పెద్దగా.

"ఉష్." ఏదో చెబుతున్నాడు వినండోయ్" అన్నాడు ఆర్గనైజర్. చలివేస్తోంది. బీడీకొట్టు యజమానికి సదానందం అంటే లోపల అభిమానం. పైకి దీపంపార్టీ వాళ్ళతో సఖ్యత. లేకపోతే బేరం పోతుంది...

సదానందం ఉపన్యసిస్తున్నాడు; "మీ రివ్వాళ వోటుకింత అని తీసుకుంటారు తప్పేంలేదు. వ్యక్తిగతమైన కష్టాలు ఎవరివి వాళ్ళకుంటాయి. పాతికో పరకో వస్తే, ఎందుకైనా వస్తాయి. కాని బాగా ఆలోచించండి. వాళ్లు మీవోట్లకి ఎందుకు డబ్బిస్తున్నారు? ఈ డబెక్కడిది? అంత దయాపరులైతే ఆ డబ్బెట్టి ఇంకో మంచిపని ఎందుకు చెయ్యరు? మీమీద దయదల్చి వోటు కొంటున్నారా! లేదు. అందులోవున్న నిజమేమిటో గ్రహించండి..."

వాలంటీరు ఆర్గనైజరువంక చూశాడు. ఆర్గనైజర్ "సాంతం చెప్పనీరా. నెత్తిన కానీ పెడితే దంబిడీ చెయ్యడు! డబ్బుమీద వుపన్యాసాలు!" అన్నాడు.

సదానందం చెప్పుకుపోతున్నాడు. "వోట్లు కొనటంగూడా వాళ్లదృష్టిలో ఒక వ్యాపారంమాత్రమే. ఇన్ని వేలుపోసి గెలిచారనుకోండి? తిరిగి, ఇంతకి రెండింతలు తన కౌన్సిలర్ వోటును చెయిర్మన్ కాబొయ్యేవారికి అమ్ముకుంటారు. లేదా ఇంకో రకంగా. తమ పరపతి చూపించి సంపాయిస్తారు. ఈ మోసాన్ని గ్రహించండి. మీవోటుకి విలువ కట్టలేం. దాన్ని సద్వినియోగం చేస్తే, మీకు మేలుచేస్తుంది. లేదా, తర్వాత పశ్చాత్తాపపడవల్సి వొస్తుంది."

ఆర్గనైజర్, "మహా కనిపెట్టాడురా! తనకివ్వటం చేతగాదు. ఇచ్చేవాడ్ని చూస్తేమంట. వీడు మహా పతిత్తు అయినట్టు! వీడి కిరోజున కూడులేదు. నేనూ అభ్యర్థినేనని బయలేరాడు. ఏదో నాలుగుడబ్బులు జబురుకుందామని కాకపోతే ఏమిటి!" అన్నాడు సిగరెట్టు వెలిగించి.

సభికులు మౌనంగా వింటున్నారు. పెట్రోమాక్సు లైట్లు మందంగా వెలుగుతున్నాయి. చుట్టూ చీకటి మధ్య సభాస్థలి సదానందం—అధ్యక్షుడు డాక్టర్ వీరభద్రరావుగారూ బాగా కన్పిస్తున్నారు.

సదానందం "మీకు ఇంకో అనుమానంగూడా కలగవొచ్చు. నేనుగూడా వాళ్లలాగే ప్రవర్తిస్తానేమోనని. ఈ వొచ్చే డబ్బులు కూడా రావే అని గూడా అనిపించవొచ్చు, అలా అనుకోకండి. నా శక్తికొద్దీ మీ మేలుకోసం ప్రయత్నిస్తాను. తిరిగి ఇంకోసారి మీదగ్గిరకి రావొద్దా! రోజూ మీ ముందే తిరగాలిగదా? నావంటివాడికి ప్రజలతో ఎప్పుడూ అవసరం వొస్తూనే వుంటుంది. నే నేం లక్షాధికార్ని కాను; మేడల్లో దాక్కుని, ప్రపంచాన్ని చూడకుండా వుండడానికి" అన్నాడు.

వలంటీర్లు మండిపడుతున్నారు; ఎందుకో వాళ్ళకే తెలీదు. డబ్బుగలవాళ్ళ తరఫున పనిచేస్తున్నారు గనుకనే గాబోలు; యధార్థంగా వాళ్ళూ దరిద్రులే. వాళ్ళూ రోజు కూలికి ప్రచారం చేస్తున్నారు; తప్పితే, దీపంపార్టీ ఆదర్శాలు—నిజమని నమ్మరేమో... ఆర్గనైజర్ "వొరే, పోదాం పదండిరా! వీడి నీతులు ఎరగమూ ఏం?" అని లేచాడు.

వాళ్లు వెళ్లాక బీడీకొట్టు అతను పక్కనే నుల్చున్న ఇంకో కుర్రాడితో, "వీళ్ళకేంరా! కష్టాలంటే ఏమిటోనుకుంటు వీళ్లు? తేరగా ఏ బాబో, తాతో సంపాయించింది కూర్చుని తింటూ, నిజం మాట్లాడేవాణ్ణి చూస్తే మండిపడతారు" అన్నాడు.

సభ పావుగంటకి ముగిసింది కరతాళధ్వనుల మధ్య.

సదానందంతో సహా అతని తరఫున పనిచేస్తున్న స్నేహితులు కిందపరచిన చాపలూ, బల్లలూ చేరవేస్తున్నారు. అందరూ అన్ని చేరవేశాక, మిగిలిన ఒక లైటు తీసుకుని సదానందం ఇంటికి బయల్దేరాడు.

బాగా చలిగావుంది. అంతటా చీకటిగావుంది. ఆకాశం నిండా నక్షత్రాలు మెరుస్తున్నాయి. బజార్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. ఎలక్ట్రిక్ లైట్లున్నచోట్ల వెలుగు ప్రసరిస్తోంది. మిగిలినదంతా చీకటి. సదానందం వేగంగా నడిచి, ఆ లైటు స్వంతదారు కివ్వటానికి ఒక ఇంటిముందాగాడు. లైటు ఆయింట్లో ఇచ్చి అతను నిదానంగా ఆలోచిస్తూ బయల్దేరాడు తన ఇంటివేపుగా... తన ఆశలన్నీ భగ్నమైపోయాయి...చదువు అట్లా అయింది... తండ్రి పెద్దాస్పత్రిలో ప్రాణావశిష్టంగా పడివున్నాడు...తల్లి ఇకే దిగులుతో చిక్కి శల్యమైపోయింది—ఏదో ఉద్యోగంతో తనీ ఎలక్షన్లోకి దిగాడు. తనూ ఓ కౌన్సిలరయితే...అయితేనేం—కాకపోతేనేం? తను ఎంతగానో ప్రేమించిన యువతి తృటిలో తనని తిరస్కరించి వెళ్ళిపోయింది. ఊహాపథంలో ఆమెని ప్రేమిస్తూ కూర్చోటానికి తనంత తెలివి తక్కువవాడు కాకపోయినా, ఆమె తిరస్కారం తన హృదయాన్ని రంపపుకోత కోస్తోంది...

సదానందం ఒక సందు మలుపు తిరిగాడు; అతని ఇల్లు ఆ సందు చివరనే వుంది. పార్కు అడ్డం. పార్కు ప్రహారీగోడ వెంబడి దట్టంగా నిద్రగన్నేరుచెట్లున్నాయి రోడ్డుమీదికి వూగేకొమ్మలతో. దూరంగావున్న ఎలక్ట్రిక్ లైటు వెలుగులు ఆ నిద్రగన్నేరు గుబుళ్ళలోంచి చీల్చుకుని పడడంలేదు. అంతా కటికచీకటి. సదానందం ఇంకా పార్కు దాటకముందే, అతన్ని వెనకనించి వచ్చి ఎవరో నల్లటి నీడల్లాంటివాళ్లిద్దరు, ఓ లాటీకర్రతో తలమీద బలంగా కొట్టారు. సదానందం "ఓ" అంటూ అరిచి కింద పడిపోయాడు. ఆ నల్లనినీడలు పార్కుగోడ దూకి ఎటో మాయమైనాయి చీకట్లో.

అతని అరుపు విని దూరంగావున్న ఇళ్ళవాళ్లు లేచివచ్చి చూశారు లాంతర్లతో సహా. సదానందం రక్తపుమడుగులో పడివున్నాడు. అతని కపాలం దాదాపు బద్దలైపోయి నెత్తురు ప్రవహిస్తోంది. ఆ వొచ్చినవాళ్ళే అతన్ని వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్ళారు.

డాక్టర్ "చాలా అపాయకరమైన దెబ్బలు! బంధువు లెవరైనావుంటే కబురు చెయ్యండి" అన్నాడు వాళ్ళతో. వొచ్చిన వాళ్లుపరిగెత్తారు కంగారుగా. (ఇంకా ఉంది)

ఆఖరి తప్పు

[స్థలం రైల్వేస్టేషను. కూలీలకేకలు, అమ్మకపువాళ్ళ అరుపులు, ప్రయాణీకుల గోల, ముష్టివాళ్ళ దీనాలాపాలు ఇంజన్ల కూతలు.

ఇంతలో లౌడ్‌స్పీకర్‌లోనుండి బొంగురుగా ఒక కంఠం.

"మద్రాసు మెయిలు మరోక ఐదునిమిషాలలో బయల్దేరుతుంది." ఒక కంపార్ట్‌మెంట్ తలుపు తెరుచుకుంటుంది.]

ఒకవ్యాపారి: వెంకట్రావ్ గారూ, భోజనం చెయ్యకపోయినా ఫలహారం ఏమన్నా పుచ్చుకోరూ?

వెంక: రాజమండ్రీలో పూర్తిగా టిఫిన్ తీసుకునే ఎక్కాను బండి. ఆకలిగాకూడా అనిపించడంలేదు. మరోగంటకల్లా మా ఊరు.

వ్యాపారి: సరే మీఇష్టం.

వెంక: ఎలా ఉంది బెజవాడ భోజనం?

వ్యాపా: ఈ స్టేషను భోజనాలమీద కాకదోకరకమైన విరక్తిభావం ఉండేది – మానేరుకదూ. మరి ఇన్నిసార్లు వ్యాపార రీత్యా ఈఊరుమీంచి వెళ్లేరు. ఇంతవరకు ఇక్కడ భోంచెయ్యలేదు. ఇదే మొదటి సారి.

వెంక: విరక్తి తప్పక కలుగుతుంది లెండి. ఇంట్లోలా ఉంటుందా?

వ్యాపా: మీకాశ్చర్యం వెయ్యొచ్చు. ఇంట్లోకన్నా బాగుంది.

వెంక: ఇంట్లోకన్నా బాగుందా? నాకు నమ్మకంలేదు.

వ్యాపా: ఓసారి తినిచూడండి.

వెంక: అయితే అదృష్టవంతులే. సంక్రాంతి అయినందుకు ఇంట ఉండక పోయినా మంచి భోజనం దొరికింది.

వ్యాపా: పీకలమీది పనికాబట్టి ... లేకపోతే కదిలేవాడినా? ఈ వ్యాపారంలో ఎప్పటిదప్పుడు తెగిపోతేనే కాని...

వెంక: మీరు దిగాల్సిన స్టేషన్ ఇంకా ఎంత దూరం ఉంటుంది?

వ్యాపా: మనమిద్దరమే ఉన్నట్టుంది పెట్టెలో. అయినా సంక్రాంతిపూటా ఎవడు బయల్దేరతాడు లెండి. ఎవడో నాలాటి దరిద్రుడు తప్పించి...మీరు కలవరండోయి. హహహా. మాదంతా డబ్బుగురించి ప్రాకులాట.

వెంక: (గొంతు తగ్గించి) పోలీసులా ఉన్నారెవరో ఆయన...ఆ మూడోసారుగులో మీదని పడుక్కున్నారు.

వ్యాపా: (బాగా గొంతు తగ్గించి) పోలీసా. అయినా ఈ కొత్తరకం పెట్టెలు చాలా గమ్మత్తుగా ఉన్నాయి. ఈ సారుగులూ అవీను. పక్కసారుగులో ఎవరున్నదీ తెలీదు. (రైలుకూత పెట్టి కదుల్తుంది)

వెంక: (ఆత్రంగా) ఎవరా అమ్మాయి. మనపెట్టెవేపే పరుగెత్తుకొస్తోంది?

వ్యాపా: ఆఁ? అర్రెర్రె. ఉండండుండండి. తలుపు తీస్తున్నా.

వ్యాపా: ఆ బ్యాగ్ ఇలా ఇవ్వండి ముందు. తొందరొద్దు...జాగర్త. (ఆమె రైలెక్కుతుంది. బాగా ఆయాసంతో ఒగర్పు వస్తుంది)

వ్యాపా: ఆలస్యంగా వచ్చినట్టుంది...

స్త్రీ: (మౌనం)

వ్యాపా: బాగా అలసిపో[illegible]రు.

స్త్రీ: (మౌనం)

వెంక: (మృదువుగా) మీరింక గాభరా

మంథా వెంకటరమణారావు

పడనవసరం లేదులెండి. రైలందుకున్నారుగా.

స్త్రీ: (మౌనం)

వ్యాపా: ఇవాళ పెట్టంతా ఖాళీయే. కూర్చోండి.

స్త్రీ: (ఇంకా ఒగరుస్తూనే) దేముడు నిజంగా రక్షించేడు.

వ్యా: (సరిగ్గా వినబడక) క్షమించాలి. ఏమన్నారు?

స్త్రీ: బండిని అందుకోడం నా అదృష్టం.

వ్యా: మీకూ చాలా తొందరపనే అయి ఉండాలి. లేకపోతే పండగపూటా...

స్త్రీ: (మెల్లగా) ఔను... రోడ్డు మీద నిజంగా పరుగెత్తడమే అయింది.

వ్యా: (ఆశ్చర్యంగా) రిక్షాలో రాలేదూ?

స్త్రీ: (కొద్దిగా ఊరుకుని) సైకిల్ రిక్షా టైర్ బద్దలయింది. స్టేషన్ ఇంకో ఫర్లాంగుందనగా...ఫర్లాంగేకదా నడిచేద్దామనుకున్నాను. నిజంగా బండిదొరకడం...

వ్యా: పాపం. బాగా అలిసిపోయేరు. ప్రయాణం ఉందీఅంటే గంట ముందు నుంచీ స్టేషన్లో వెళ్ళికూర్చుంటాన్నేను. రైల్లో కూర్చునేవరకూ అది తప్పిపోతుందన్న బెంగే. ఎంతవరకూ వెళ్తారు?

స్త్రీ: మద్రాసు.

వ్యా: మద్రాసే?

స్త్రీ: వింతగా అడుగుతున్నారేం?

వ్యా: ఒంటిగా వెళ్తున్నారే?

స్త్రీ: ఏం? వెళ్లకూడదా?

వ్యా: (ఊరుకొని) మద్రాసులో మీ ఇల్లా?

స్త్రీ: ఊహు

వ్యాపా: బెజవాడనుకుంటాను. మద్రాసులో చదువుతున్నారేమో...

స్త్రీ: (నీరసంగా) కాదు.

వ్యాపా: ఎవరన్నా బంధువులుకాని పండక్కి రమ్మని నిర్బంధించేరా?

స్త్రీ: (గద్గదస్వరంతో) ఊహుఁ.

వ్యాపా: (ఆశ్చర్యంగా) మీదీ ప్రాంతం కాదూ? అర్రెర్రె. ఎందుకలా కంటనీరు పెట్టుకుంటున్నారు? ఏమన్నా క[illegible] మాటన్నానా? క్షమించండి.

స్త్రీ: (దుఃఖంమధ్య) లేదు. మీ[illegible] అనలేదు...(వెక్కి వెక్కి ఏడుస్తుంది)

వ్యాపా: (బాధతో నిండిన గొంతుతో) అరెరె, ఎందుకలా ఏడుస్తారు? ఏదన్నా కష్టంలో ఉన్నారా? బాధలేదు. నాతో చెప్పండి. మా పిల్లలాటివారు.

స్త్రీ: (మరింతకుమిలి కుమిలి ఏడుస్తుంది)

వ్యాపా: మనస్సు స్థిమితపడ్డాక చెప్పండి. ఎప్పటి కెవరి కెలాటి కష్టాలొస్తాయో చెప్పలేం. ఏబాధ కలుగుతుందో కనుక్కోలేం. మనిషిగా పుట్టాక నాకూ గుండెన్నది ఉంది. గుండె రక్తమే కాకుండా దయ కూడా చిమ్మాలని మా గురువుగారన్నారు. నాకు చేతయిన సాయమేమన్నా చేస్తాను.

(ఆమె ఇంకా ఏడుస్తుంది)

ఊరుకోండి, మీ బాధ చెప్పండి. నిజంగా ధైర్యవంతులని మొదట అబ్బురపడ్డాను. ఇంతేనా ధైర్యం.

స్త్రీ: (తేరుకొని) ఇంత...దయతో నిండిన గొంతువిని ఎన్నాళ్లయింది?

వ్యాపా: అబ్బే దయకేముంది, ఇది వ్యాపారంలాటిదే. ఇచ్చి పుచ్చుకోడం... నేను మీకు సాయపడితే దేముడు నాకు సాయపడతాడన్న ఆశ. అంతే మరి. నాకు లాభం లేదనుకోకండి. అప్పుడే నవ్వు మానేశారా? ఇంతకీ మీ రెందుకంత బాధపడ్డారు. ఇష్టంలేకపోతే చెప్పకోకండి.

స్త్రీ: (వికారంగా) పండగ! [illegible]

అంతగానే దుఃఖం పొర్లి వచ్చింది...ఇంతక.. బంధువులు (ఏడుపు బిగపట్టుకొని) నా కెవ్వరూ...లేరు. (ఏడ్చేస్తుంది.)

వ్యాపా: (విస్తుపోయి) అఁ....

స్త్రీ: (కాస్సేపటికి ఏడుపు ఆపుకుంటుంది) మీ కాశ్చర్యం వెయ్యొచ్చు.

వ్యాపా: అవును. చాలా ఆశ్చర్యంగా ఉంది:

స్త్రీ: చాలాన్నా?

వ్యాపా: ఔను. మొదట ఒకలా అనుకున్నాను. ఇంకోలా అయినందుకు చాలా ఆశ్చర్యం వేసింది...మీకు ఎవ్వరూ లేరా?

స్త్రీ: ఉహుఁ...

వ్యాపా: చాలా వింతగా ఉందే... క్షమిస్తే...మీకు వివాహం...

స్త్రీ: (గద్గద స్వరంతో) ఉహుఁ.

వ్యాపా: రుమాలిందండి ... కళ్లొత్తుకోండి. అంతగా అధైర్యపడి కన్నీళ్ళు కార్చకండి ఒంటికి మంచిది కాదు.

(కొంతసేపు మౌనం)

ఇదంతా ఒక నాటకం.

స్త్రీ: (బెదురుగా)—అఁ....

వ్యాపా: ఈ జీవితం ఒక నాటకం. మనని ఆడిస్తున్నవాడెవడో ఉన్నాడనుకుంటాం. ఉన్నాడేమో కూడా. మనకి కనుపించడు.

స్త్రీ: (స్థిమితపడి) చెపుతే మీరు నమ్మలేరు...నాకన్నా ఎక్కువ కష్టాలు వచ్చినవాళ్లు లేకపోలేదు. కష్టాలెప్పుడో ఓనాడు పోతాయంటారు.

వ్యాపా: పోతాయి. వాటికి మనంఅంటే విసుగు పుడుతుంది ఓనాటికన్నా.

స్త్రీ: కాని నేనంటే వాటికి ప్రత్యేక ఆకర్షణ ఉన్నట్టుంది. నాలో అవి ఎప్పటికీ నివాస ఏర్పరచేసుకున్నాయి. (ఏడుస్తుంది)

వ్యాపా: అలా అని ధైర్యం వదులుకుంటే మరీ బాధ. ధైర్యం లేని మనుష్యులంటే వాటికి సరదా. రోజులు మారతాయి రాత్రి ఎప్పుడూ చీకటిగానే ఉండిపోతుందా?...అయితే బెజవాడలో మీరు ఏం చేస్తున్నట్టు ఇన్నాళ్లూ?

స్త్రీ: ఎన్నాళ్లో కాదు. మూడు రోజులే.

వ్యాపా: ఇంతేనా. అయితే మరి...

స్త్రీ: నా కథ చెప్పి మిమ్మల్ని శ్రమపెట్టలేను.

వ్యాపా: శ్రమ అంటే నే నొప్పుకోను.

స్త్రీ: మాది ఈస్ట్ బెంగాల్.

వ్యాపా: పాకిస్తానా?

స్త్రీ: విభజనకు పూర్వం.

వ్యాపా: అయితే మీరు...

స్త్రీ: నాకన్నా పెద్దవారు.. మీరు అని నన్ను అనకండి.

వ్యాపా: (నవ్వి) ఓ... ఫరవాలేదు.

స్త్రీ: ఈ విభజనముందునుంచీ ఆరంభమయ్యాయి కష్టాలు...మేం స్థితిమంతులం.

వ్యాపా: మాటలనిబట్టే తెలుస్తోంది.

స్త్రీ: తల్లి చిన్నప్పుడే పోయింది. మా నాన్నగారు జనపనారలో పెద్ద వ్యాపారస్థులు.

వ్యాపా: ఓహో. మీదీ వ్యాపారమే..

స్త్రీ: ఔను. నా కిద్దరు అన్నలు. నేనంటే వాళ్ళకి ప్రాణం. హిందూ ముస్లిమ్ అల్లర్లకి అన్నలిద్దరూ బలైపోయారు. (వెక్కి వెక్కి ఏడుస్తుంది).

వ్యాపా: ఎంత ఘోరం. ఎంత ఘోరం జరిగిపోయింది?

స్త్రీ: ఇద్దరూ ఒకరోజునే. (తిరిగి ఆమె ఏడుపు)

వ్యాపా: ఔను. చాలా అత్యాచారాలు జరిగిపోయేయి. మేమంతా పేపర్లలో చూడ్డమే కాని...అయ్యయ్యో, ఎంత పని అయిపోయింది.

స్త్రీ: మా నాన్నగారు బెంగపెట్టుకుని మంచం పట్టేరు... కొన్ని నెలలకి కాని తేరుకోలేదు.

వ్యాపా: అవును పాపం. ఎంత దెబ్బ.

స్త్రీ: తరవాత ఈ విభజన. ఆస్తిపాస్తులన్నీ వదిలి కట్టుగుడ్డలతో కలకత్తా వచ్చేసేం. ఇన్నాళ్ళూ అక్కడే ఉంట.

వ్యాపా: అయితే మీ రిప్పుడు కలకత్తానించి బెజవాడ వచ్చేరన్నమాట.

స్త్రీ: ఔను.

వ్యాపా: మీ నాన్నగారు తిరిగి వ్యాపారం మొదలుపెట్టారా?

స్త్రీ: ఏం పెట్టి? నేను స్కూలు ఫైనలు పాసయ్యాను. బెంగాలీ వచ్చు. అక్కడే ఒక గరల్ స్కూలులో మిస్ట్రెస్‌గా చేరేను.

వ్యాపా: మీ రాపాటి చదువుకోడం నిజంగా చాలా ఉపయోగించింది చూసేరా.

స్త్రీ: మూడు నెలల్కితం మా నాన్నగారు పోయేరు.

వ్యాపా: అయ్యో ఎంత పని! ఎన్ని కష్టాలు.

స్త్రీ: దేశంకాని దేశంలో ఒంటిగా ఉండడం నాకు మనస్కరించలేదు. స్త్రీ ఒంటరిగా ఉంటోందనగానే...అందులో ఆ తెలియని జాగాలో...

వ్యాపా: మరి కాదూ?...నీ కెవరన్నా ఏమన్నా బాధ కలిగించేరా?

స్త్రీ: (సందేహిస్తూ) ఆ స్కూలు మేనేజరు...అతన్ని తప్పించుకు తిరిగేందుకు ఎంతో ప్రయత్నం కావాల్సొచ్చేది... నాకా ప్రదేశం అంటేనే భయం, అసహ్యం పుట్టేయి...తిరిగి మన ప్రాంతంలో పడి మన మాటవిని మన మనుష్యుల్ని చూసేక పోయిన ఆత్మీయులంతా వచ్చినట్టుగా అనిపించింది...

వ్యాపా: నిజంగా అలానే ఉంటుంది. మన భాష చెవినిపడ్డాక ప్రాణం లేచి రాదూ మరి?

స్త్రీ: ఇక్కడ ఒంటరిగా ఉండేందుకు నాకు జంకు లేదు...కాని... నా అన్నలు.. మా స్థితి...ఇవ్వీ జ్ఞాపకానికొస్తే...(ఆమె ఏడుస్తుంది – రైలు కూతపెడుతుంది).

వ్యాపా: నీ సంగతి వింటూ ఉంటే నాకు చాలా బాధ కలుగుతోంది... నేను దాన్ని మాటల్లో చెప్పలేనేమో...

స్త్రీ: మీరు ఓదారుస్తూ ఉంటే మా నాన్నగారు మాట్లాడేటట్టనిపిస్తోంది...మనస్సుకి ఎంతో హాయిగా ఉంది...గుండె తేలికబడుతోంది....

వ్యాపా: మీ ఇళ్లు ఆస్తి తిరిగి నీకు రాకపోయినా, వాటి విలువ నీకు ముట్టిపోతుంది. మన ప్రభుత్వం తగినచర్య తీసుకుంటోంది.. ఫరవాలేదు. అయితే మరిప్పుడు ఏం చెయ్యదల్చుకుంటున్నావ్?

స్త్రీ: కలకత్తాలో ఉన్నప్పుడే టైపు నేర్చుకున్నాను.

వ్యాపా: భలే మంచిపని చేసేవు... ఏదన్నా విద్య చేతిలో ఉండడం చాలా ఉపయోగం...

స్త్రీ: టైపిస్టుగా ఎక్కడన్నా ఉద్యోగం దొరకొచ్చునని బెజవాడలో ఈ మూడు రోజులూ తిరిగేను. కాని లాభం లేకపోయింది...

వ్యాపా: [illegible] ఉద్యోగమేనా?

స్త్రీ: మరేం చెయ్యడం?

వ్యాపా: నిన్ను చూస్తే నిజంగా నాకు దుఃఖమొస్తోంది. పెళ్లి చేసుకొని ... కళకళా ఇల్లు చూసుకోవల్సిన వయస్సులో...నిన్ను నువ్వు ఆదుకోవల్సొచ్చింది ... అంతే చేసుకున్న కర్మ...

స్త్రీ: (విచారంగా) అంతేనంటారా?

వ్యాపా: ఉత్తినే మాటవరసకన్నాను. అదొక ఊతపదంలాటిది ... అంతా ఇలా జరగాలి అని రాసిపెట్టి ఉంటుందా? దాని మానాన అది లాటరీలా జరిగిపోతూ ఉంటుంది ... బెజవాడలోనే దొరకలేదా ఉద్యోగం?

స్త్రీ: ఒకటి రెండుచోట్ల అవకాశం ఉండేది...కాని ఎందుకూ చాలనిజీతం...

వ్యాపా: ఔను మరి ... ఉండడానికీ, తిండికీ, బట్టకీ అన్నా చాలాలికదా?

స్త్రీ: మద్రాసులో ఏమన్నా వీలుంటుందేమోనని ... అక్కడైతే మనస్సుకి కొంత హాయిగాకూడా ఉండొచ్చు...



"నాకు జన్మం బేమి జీవనమూ..."

ఫొటో: ఎ. వి. ప్రసాద్ — విజయవాడ.

వ్యాపా: నేనూ విన్నాను. మద్రాసులో హాయిగానే ఉంటుందని ... కాని ఇదే మొదటిసారనుకుంటాను ... నువ్వక్కడికి వెళ్ళడం!

స్త్రీ: ఇదివరకెప్పుడూ వెళ్ళలేదు.

వ్యాపా: నా కెందుకో మనస్సులో అంతో కొంత గుబులుగానే ఉంది ఒక్కర్తెవి నువ్వు వెళ్ళడం.

స్త్రీ: ఫరవాలేదు. ఏదోలా....

వ్యాపా: అలా అనబోకు. అసలే దగాకోరని వినడం...అందులో ఆడది ఒంటిగా కాన్పిస్తే మరీదగా .. (రైలు వేగం తగ్గుతుంది) నేను దిగే స్టేషను వచ్చేసింది.

స్త్రీ: (బాధగా) అప్పుడేనా. మాట్లాడుతూంటే మూడు నిముషాలనే అనిపిస్తోంది

....

వ్యాపా: కంట తడి పెట్టుకోకు...అన్నింటికీ వాడే ఉన్నాడు...ఫరవాలేదు. ఏమీ అనుకోకపోతే ఒక్కమాట అడుగుతాను.

★ ఆఖరి తప్పు ★

స్త్రీ: (వింతగా) అనుకోవడమా? మీ రడుసు తేసా?

వ్యాపా: సరే - ఇంక ఎలానూ స్టేషన్ వచ్చేసింది ... నువ్వు వెళ్ళేది పైఊరు. ఉద్యోగం వెంటనే దొరకొచ్చు...కొన్ని రోజులూ పట్టవచ్చు...డబ్బుకేం ఇబ్బంది లేదుకద.

స్త్రీ: డబ్బా?

వ్యాపా: ఔను.

స్త్రీ:...ఫరవాలేదు...

వ్యాపా: నా కెందుకో నమ్మకం చాలటం లేదు...చెప్పేందుకు జంకుతున్నావ్?

స్త్రీ: లేదు...నేను జంకటం లేదు.

(రైలు ఆగుతుంది)

వ్యాపా: అయ్యో ఎందుకలా మళ్లా కంటనీళ్లు... నేనూ పిల్లలు ఉన్నవాణ్ణే. కష్టాలంటే ఏమిటో నాకూ తెలుసు... పై ఊళ్లో డబ్బు తక్కువైతే ఎందుకూ కూరం. అందులో ఆడదానిని...ఇంకోలా అనుకోకు...

స్త్రీ: డబ్బా...

వ్యాపా: కాదు, సహాయం. ఈ కాలంలో సాయపడేది ఒక్క మాటే కాదు. ఇప్పుడు నీకు అవసరం లేకపోయినా ఒకసమయంలో ఎప్పుడైనా దీనికి అవసరం ఉంటుంది. ఈ మొత్తం ఉంచుకో...

స్త్రీ: వద్దొద్దు...డబ్బివ్వకండి...నేను పుచ్చుకోలేను.

వ్యాపా: అయితే నా మనస్సుకి కష్టం కలిగిస్తావా?

స్త్రీ: మీరు ఇందాకా అంతగా ఓదారుస్తూ మాట్లాడితే మానాన్నగారు దగ్గరున్నట్లనిపించింది. మనస్సెంతో తేలికపడింది. డబ్బు పుచ్చుకుంటే అది పోతుంది.

వ్యాపా: ఇది అప్పు. అప్పుకింద ఈ డబ్బు ఉంచుకో. ఉద్యోగం అయ్యాక పంపుదువుగాని. ఊఁ...మరి అడ్డు చెప్పకు. (నోట్లుతీసి అందిస్తాడు).

స్త్రీ: (సంకోచంగా అందుకుంటూ) మీరు అనవసరంగా...

వ్యాపా: ఛా...ఛా ... మరింకో మాట వద్దు. అన్నట్టు అడగడం మరిచేను. అక్కర లేకపోయినా తెల్సుకుంటే మరింత సన్నిహితంగా ఉంటుంది. నీ పేరు?

స్త్రీ: కమల.

వ్యాపా: వెళ్ళొస్తాను కమలా. పంతులుగారూ వెళ్లొస్తాను...మీకు తగని సిగ్గులా ఉంది. నోట ఒక్కమాటన్నా రాల్చలేదే.

వెంక: (సిగ్గుపడుతూ) అబ్బే, అదేం కాదులెండి. సెలవ్. (రైలు కూతవేసి కదుల్తుంది).

స్త్రీ: నమస్కారం ... మీరు చేసిన సహాయం...

వ్యాపా: (ప్లాట్ ఫారంమీంచి) చాలు. చాలు. అంతటితో ఆపు. (రైలు వేగం ఎక్కువౌతుంది).

స్త్రీ: అయ్యో. అన్నట్టు ఆయన అడ్రస్ తీసుకోలేదు. ఎలా ఇప్పుడు? (వెంకట్రావు కేసి తిరిగి) నే నాయనదగ్గర డబ్బు పుచ్చుకోడం సరిగా లేదనుకుంటున్నారా?

వెంక: (సిగ్గుపడుతూ) అబ్బెబ్బే, అదేమీ అనుకోటం లేదు.

స్త్రీ: అతనిదగ్గర ఇలా డబ్బు పుచ్చుకోడం మంచిది కాదేమో.

వెంక: ప్రతీవారికీ ఎప్పుడో ఒకప్పుడు సహాయం కావల్సివస్తుంది.

స్త్రీ: నామట్టుకి నా కెందుకో మంచిది కాదేమో అనిపిస్తోంది.

వెంక: బాగా బతిగాక ఇలా ఒకరి సహాయం పొందడం మీకు కష్టంగానే ఉండొచ్చు.

స్త్రీ: ఆ గర్వం ఏనాడో పోయింది. నా కష్టమ్మీద సంపాదించుకున్నప్పుడు మనస్సు ఎంతో హాయిగా ఉంటుంది.

వెంక: స్నేహభావంతో అతనిచ్చినప్పుడు పుచ్చుకోడంలో తప్పేమీ లేదు.

స్త్రీ: కాని ఇప్పుడు నేనేదో అతనికి ఋణపడినట్టుంది.

వెంక: కృతజ్ఞత. అది అతను కోరలేదు. మీరు చూపనక్కరలేదు.

స్త్రీ: ఎంతమాటన్నారు. ఒకరు మీకు సాయపడితే అందుకు కృతజ్ఞత చూపడం మీ బాధ్యత కాదా? (కొంతసేపు మౌనంగా ఉండి) ఇవాళ ఎంత చలిగా ఉంది!

వెంక: అలా కిటికీలోనుంచి అవతల తలపెట్టి ఉండకండి. చలిగాలి, మంచు, జలుబు చేస్తుంది.

స్త్రీ: ఆపాటిదానికి బాధలేదు. దానికే భయపడితే ఇంక బతికినట్టే.

వెంక: బెంగాలులో చలి ఎక్కువా?

స్త్రీ: మీ రేపాటి తట్టుకోగలరో చలికి నేనూ అంతే. పట్టుదల. కాని ఇలా చీకట్లోకి చూడాలనిపిస్తుంది. చెమ్కీలలా ఆ నక్షత్రాలు, ఈచీకటి, ఎందుకో మనస్సు బరువుగా ఉంటుంది. బెంగగా ఉంటుంది.

వెంక: రైల్లో ప్రయాణం చేస్తూఉంటే నాకూ అలానే ఉంటుంది. కాని నా మనస్సుకి ఏవో బంధాలు విడ్డట్టుంటాయి.

స్త్రీ: టయిమెంతయింది?

వెంక: అరె. వాచీ ఆగిపోయింది. కీ ఇవ్వడం మరిచిపోయేన్లా ఉంది.

స్త్రీ: ఫరవాలేదు లెండి. రేపు ఉదయానికల్లా మద్రాసు. (మౌనం)

వెంక: (జంకుతూ) నేనొక చిన్నమాట చెప్తాను. వింటారా?

స్త్రీ: చెప్పండి.

వెంక: మీకు...అభ్యంతరం లేకపోతే... ఇంకోలా అనుకోకపోతే....నాకు చేతనయినమట్టుకు మీకు సాయపడాలని ఉంది.

స్త్రీ: (బెదురుగా) సాయమా? వద్దొద్దు. డబ్బుమాత్రం ఇవ్వబోకండి.

వెంక: ఊహూఁ. డబ్బుకాదు. డబ్బు కాదు. అయినా మీకిష్టముంటేనే. మద్రాసు మీకు కొత్తకనక.

స్త్రీ: (మౌనం)

వెంక: నాకు దగ్గరిస్నేహితుడొకాయన, ఆయన చెల్లెలు, ఇద్దరూ అక్కడ మెడిసిన్ చదువుతున్నారు. వాళ్లు వేరేగా ఇల్లు అద్దెకి తీసుకొని ఉంటున్నారు. నేను ఉత్తరం ఇస్తాను.

స్త్రీ: ఉత్తరమా? దేనికి?

వెంక: మీ రక్కడ ఎన్నాళ్లున్నా ఫరవాలేదు. అందులోకీ ఆవిడ ఎంతో సంతోషిస్తుంది. చాలా సరదాఅయినమనిషి ఆవిడ. ఏమంటారు?

స్త్రీ: (మౌనం)

వెంక: నామాట కాదనకండి.

స్త్రీ: మీ సాయాన్ని కాదనలేను. కాని ...తెలియనివాళ్లతో ఉండడం అంటే నాకేదో స్వేచ్ఛ లేనట్టుంటుంది.

వెంక: మీ కాబాధేమీ లేదు వాళ్లతో... ఎంతయినా స్వేచ్ఛగా ఉండొచ్చు. వెళ్లేక మీకే తెలుస్తుంది. ఏం?

స్త్రీ: నామీద మీ కెందు కింతదయ?

వెంక: (మౌనం)

స్త్రీ: వరదలో కొట్టుకుపోయే రెమ్మలాటి బతుకు నాది. అది కొట్టుకపోకుండా ఎంతకని ఎవరాపగలరు? పోయిపోయి ఏదో సుడిగుండంలో పడి అక్కడ అలా తిరుగుతూ ఉండిపోతుంది. అప్పుడెవరెంత దయ చూపెట్టినా సహాయం చేసినా లాభం లేదు. (మౌనం)

వెంక: కన్నీళ్లెందుకు కారుస్తారు.

స్త్రీ: అంతకన్న చెయ్యగలిగే దేమీ లేదు.

వెంక: మీ రలా అధైర్యపడకండి. మీ ముఖం చూస్తే అనిపిస్తోంది. మీకు సహాయం ఎవరన్నా ఎక్కడన్నా చేస్తారని. మిమ్మల్ని ప్రపంచం అసహాయురాలినిగా వదలేయదు.

స్త్రీ: నామీద సానుభూతివల్ల మీ కలా అనిపిస్తోంది.

వెంక: సానుభూతి కాదు...మీరు ఎన్నో ఏళ్లతరబడి నాకు తెల్సుననిపిస్తోంది. పరిచయమై ఒక గంట అయినా...(ఆవేశంతో గొంతు తగ్గించి) ఏదో శక్తి నా మనస్సు నింపుతోంది...మీ కళ్లలోనూ ఆదేశక్తి....

స్త్రీ: నా కన్నీళ్ళు చూచి మీ రెందుకంత ఆవేశపడతారు? కన్నీళ్లు కారిపోయాక నాలోని బరువు తగ్గిపోతుంది. మనస్సు తేలికపడుతుంది. అందుకే అవి ఉద్దేశింపబడ్డాయేమో. వాటిని చూసి మీ రావేశం

పొందకండి. మగాళ్లు మీరు కన్నీరు కార్చ లేరు.

వెంక: మీరు నన్ను వెర్రివాడిని అనుకుంటారేమో. కాని...మీ కన్నీళ్లే కాదు.. మీ ముఖంలోని ప్రతి అనుభూతి...మీ కళ్ళలోని వెలుగు, మీ పెదవులలోని జీవం నాకు ఎన్నేళ్లనుంచో తెల్సినట్టు, వాటితో పరిచయమున్నట్టు అనిపించేయి. నన్ను వాటికి ఆత్మీయుల్నిగా చేసుకున్నాయి.

స్త్రీ: ఆత్మీయత. (మౌనం)

వెంక: ఔను.

స్త్రీ: ఏదో అపోహపడుతూ ఎంత సులభంగా మానసిక బంధాలకి పట్టుబడిపోతున్నారు.

వెంక: అది బంధం కాదు, ఒక అనుభూతి. స్నేహం కూడా ఒక బంధమేనా?

స్త్రీ: తప్పకుండా. అన్నింటికన్నా బలమైనది.

వెంక: కాదు. అది ఆత్మకి ఔన్నత్యాన్నిస్తుంది. పవిత్రతని చేకూరుస్తుంది.

స్త్రీ. (చిరునవ్వుతో) అయితే దానికో మారు పేరుంది. అదిమాత్రం ఉచ్చరించకండి. నాకు నవ్వొస్తుంది. నిజంగా మిమ్మల్ని పిచ్చివాళ్లంటాను.

వెంక: మారు పేర్లు నేనేవీ పెట్టను. కాని...కాని...

స్త్రీ: చెప్పండి.

వెంక: ఎక్కడా ఎప్పుడూ నాకు కనుపించని ఆత్మీయత మీ ముఖంలో కనుపించింది. దగ్గరితనం...ఎప్పుడూ ఆ ముఖానికి అండగా ఉండే జీవితం గడపాలని... (మౌనం) మీరు నన్ను ఇంకోలా....

స్త్రీ: (మెల్లిగా) మీకు కలిగిన భావం మీరు సూటిగా చెప్పేరు. కాని మీరు భ్రమపడుతున్నారు ... ఒక్క సంగతి అడుగుతాను. నా ముఖంలాంటి ముఖం మీ రెప్పుడూ చూడనేలేదా?

వెంక: చూసేను. అంతకన్నా అందమైనవి

స్త్రీ: మీరనే ఆత్మీయత ఆ ముఖాలలో మీకు అగుపించలేదా?

వెంక: లేదు.

స్త్రీ: చెప్పేది వినండి. అప్పుడు నా ముఖం మీరు రోజూ చూసే అందరిముఖం లాటిదే. ప్రత్యేకత ఏమీ లేదు. ఈ అనుభూతి కొన్ని నిముషా లుంటుంది. అది కేవలం జాలివల్లే. (మౌనం)

వెంక: కమలా.

స్త్రీ: (ఉల్లిపడి) ఆఁ.

వెంక: నన్ను క్షమించు.

స్త్రీ: దేనికి?

వెంక: నీ పేరు పెట్టి పిలుస్తున్నందుకు. చనువు తీసుకుంటున్నందుకు. కాని నాకు నీతో ఎన్నో ఏళ్ళనుంచి పరిచయ మున్నట్టుంది.

స్త్రీ: నాకు నవ్వొస్తోంది.

వెంక: పిచ్చివాడ్ననుకుంటున్నావా?

స్త్రీ: ఎలా అనుకుంటాను? మీరు ఒప్పుకుంటారా?

వెంక: నిశ్చయంగా చెపుతున్నాను. నీ బాధలతో నిండిన పాతజీవితం తెల్సుకోకపోయినా సరే, నీ కన్నీరు చూడకపోయినా సరే, నీ కళ్లలో, నీ ముఖంలో నాకు అసన్నిహితత్వం కనిపిస్తోంది. నాకలా అనిపిస్తోంది.

స్త్రీ: మీ రన్నది పై ఆకర్షణేమో.

వెంక: బాహ్యాకర్షణకీ దీనికీ ఉన్న భేదం నాకు తెల్సు .... మా లలితముఖంలో నేను చూసేది కేవలం బాహ్యాకర్షణ - కాని నీ ముఖం...నీకళ్లు...నాగుండెల్లోకి తొంగి చూస్తాయి.

స్త్రీ: మీరు పొరపాటు...

వెంక: ఎప్పుడూ కాదు. (మౌనం) కమలా...

స్త్రీ: ఊఁ....

వెంక: ఒకమాట చెప్తాను వింటావా?

స్త్రీ: చెప్పండి.

వెంక: నేను నీలో పొందిన అనుభూతి నీకు నాలో కానరాకపోవచ్చు.

స్త్రీ: (మౌనం)

వెంక: కాని నీముఖం ఎప్పుడూ సంతోషంగా నవ్వుతూ ఉండడానికి, నా జీవితం అల్లా పాటుపడాలని ఉంది ... దానికోసం ఏమన్నా చెయ్యగలను.

స్త్రీ: ఊరక నే ఆవేశపడకండి.

వెంక: నిజంగా అంటున్నాను. మద్రాసులో మా స్నేహితుల ఇంట నువ్వుండాలి.

స్త్రీ: ఉండకపోతే ఏమన్నా నష్టముందా?

వెంక: తెలిసే నా మనస్సుని కష్టపెట్టాలా?

స్త్రీ: మీ మనస్సు కష్టపడాలని అనలేదు.

వెంక: మా మేనమామగారింట రెండు రోజులుండి అక్కడికి వొస్తాను.

స్త్రీ: (ఆశ్చర్యంగా) ఇప్పుడంటాను... మీకు నిజంగా పిచ్చెత్తింది.

వెంక: రైలెక్కిందిగా నీ ముఖం చూస్తున్నాను. ప్రతి నిముషం అది నా మనస్సుని దగ్గర దగ్గరగా లాక్కుంటోంది. నీకోసం నేనేమైనా చేస్తాను.

స్త్రీ: ఏదో త్యాగం చేద్దామని చూస్తున్నారులా ఉంది. అందులో మీ కెంతయినా ఆనందముంది.

వెంక: నా మనస్సు నొప్పించడం నీకు సంతోషంగా ఉందా?

స్త్రీ: ఒక ప్రశ్న వేస్తాను. సూటిగా జవాబు చెప్పండి. మీరు మద్రాసు వచ్చాక ఏం చేస్తారు?

వెంక: ఇంకా అర్థంకాలేదా?

★ ఆఖరి తప్పు ★

స్త్రీ: ఎందుక్కాలేదు. కాని ... చూడండి. చదువు పోతుందని మీరు మా మామగారింటికి వెళ్ళేందుకు జంకేరు. మా చదువు పోవడం అలా ఉండగా...

వెంక: చదువు సంగతి ఫరవాలేదు.

స్త్రీ: అదలా ఉండగా మనం ఇద్దరం పెళ్ళి చేసుకోడం అసలు అవదు.

వెంక: ఎందుక్కాదు?

స్త్రీ: మా కప్పుడే సంబంధం నిశ్చయమయింది.

వెంక: నా కిష్టం ఉండొద్దూ?

స్త్రీ: మీరు బ్రాహ్మణులు. నేను కాను.

వెంక: ఓస్. దానికేం ఫరవాలేదు. నా ముఖం చూడు. అక్కడెక్కడన్నా నా జాతి, మతం, పేరు ఇవేవన్నా ఉన్నాయా?

స్త్రీ: మీ తల్లిదండ్రులు ఒప్పుకోరు.

వెంక: ఒప్పించే పూచీ నాది.

స్త్రీ: మీ జాతి కానిదాన్ని, నన్నెలా..

వెంక: నువ్వు మా జాతే అంటే కాదన వానికి ఎవరన్నా ఉన్నారా?

స్త్రీ: అబద్ధమా.

వెంక: అబద్ధం కాదు. జాతి అన్నది పిచ్చి కదూ. మనని మనం మోసం చేసుకోటం. ఇప్పుడు నువ్వు బ్రాహ్మణ పిల్లవి అంటే ఏం నష్టముంది?

స్త్రీ: నాకు మనస్సొప్పకుండా ఉంది. అది నిజంగా ద్రోహం.

వెంక: మా ఇంట ఎవ్వరూ నామాట కాదనరు. చదువు పోదు. ఒక కొత్త జీవితం ఆరంభించవచ్చు మనం.

స్త్రీ: నా మనస్సుని నేనెలా మోసం చేసుకోడం.

వెంక: ఇందులో మోసాని కేముంది. (ఊరుకొని) నేనంటే నీకిష్టం లేదా? (రైలు వేగం తగ్గుతుంది)

స్త్రీ: ఇప్పుడు చెపుతున్నాను. నా మనస్సుని మీనించి విడిపించుకోనేందుకే ఇంత సేపయి ప్రయత్నం చేస్తున్నాను.

వెంక: నిజమా కమలా? ఎంత అదృష్టం. పక్కస్టేషనువరకూ వస్తాను. ఈమధ్యని ఉత్తరం రాసి ఇస్తాను. మద్రాసులో వాళ్ల బసలో ఉంటాను. ఎల్లుండి నేనొస్తాను.

స్త్రీ: మీ మనస్సు నొప్పించడం నా కిష్టం లేదు. నన్ను మరిచిపోండి. నన్ను క్షమించండి.

వెంక: (విస్తుపోయి) ఆఁ...

స్త్రీ: మిమ్మల్ని మాత్రం నేను మరచిపోలేను. కాని ... నేను మీకు తగను ... నన్ను మరి ఒత్తిడి చెయ్యకండి.

వెంక: ఇవేం మాటలు కమలా. ఎందుకు తగవు? ఆమాటకొస్తే నేనే...

స్త్రీ: ఆమాట అనకండి – మీది చాలా మంచి మనస్సు—

వెంక: (బాధగా) నీకు మరింకేం అభ్యంతరం వుంది?

స్త్రీ: ఎందుకో నా కనిపిస్తోంది – నేను మీకు తగను... నామాట వినరూ? మీ రిప్పాను ఉత్తరం ఇచ్చినా నే నక్కడ [illegible] వెళ్లను... నన్ను మీరు కల్సుకోలేరు.

వెంక: (ఊరుకొని) నా మనస్సు నొప్పించడం ఇష్టంలేక అన్నావన్న మాట—నీకు నిజంగా ఇష్టం లేదు ఇదంతా - ఏం? (మౌనం.... రైలాగుతుంది) ఏం కమలా?

స్త్రీ: ఔను.

వెంక: (నిట్టూర్చి) సరే - నే వెళ్తున్నాను - కాని నిన్ను నా మనస్సులో ఉంచుకొని మరీ పోతున్నా - నువు ఎప్పుడూ అందులోంచి తప్పించుకోలేవు -

(వెంకట్రావు రైలు దిగిపోతాడు రైలు కూత వేస్తుంది)

వెంక: (ప్లాట్ ఫారంమీంచి) కమలా, ఇంత తెగింపు దేనికి... (రైలు బయలుదేరుతుంది. స్త్రీ కంట నీరు పెట్టుకుంటుంది. ఇంతలో టి. సి. వస్తాడు).

టి. సి: టికెట్ ప్లీజ్...అరె - అలా ఏడుస్తున్నారెందుకూ?

స్త్రీ: (పొంగివస్తున్న దుఃఖంతో) ఇప్పుడిప్పుడు చూసుకున్నాను. నా పర్సు పోయింది.

టి. సి: పర్సా...

స్త్రీ: ఔను. అందులో నా టిక్కట్టు కూడా ఉండిపోయింది. ఏం చెయ్యటం ఎలా ఇంక. (వెక్కి వెక్కి ఏడుస్తుంది).

టి. సి: గాభరా పడకండి - మనస్సు స్థిమితం చేసుకోండి...ఇలాంటివి సాధారణంగా జరుగుతూ ఉంటాయి—

స్త్రీ: ఇంక ఎలా...ఏం చెయ్యడం నే నింక.

టి. సి: ఎంతసేపయి మీరు చూసుకున్నారు?

స్త్రీ: మీరు వచ్చేముందే -

టి. సి: వెంటనే దిగి రైల్వే పోలీసుకి రిపోర్టివ్వలేదూ?

స్త్రీ: నాకేమీ తెల్సింది కాదు. ఏమీ పాలుపోలేదు ... ఇదివర కెప్పుడూ ఇలా పర్సు పోలేదు.

టి. సి: మీరు ఒంటిగా ప్రయాణం చేస్తున్నట్టుంది?

స్త్రీ: ఔను.

టి. సి: ఎంతదూరంనించి వస్తున్నారు?

స్త్రీ: బెజవాడనించి.

టి. సి: అయితే ఈ వంద మైళ్ళలోనూ పోయిఉండాలి. అసలు పర్సు మీ రెక్కడుంచేరు?

స్త్రీ: నా జాకెట్టు జేబులో ఉంచుకున్నాను ... ఓసారి తీసి, టిక్కెట్టుందో లేదో అని చూసుకొని, చేతిరుమాల్లో చుట్టపెట్టి చేత్తో పట్టుకున్నాను ... జాగర్త కోసం...

టి. సి: విచిత్రంగా ఉందే! చేత్తో పట్టుకున్న పర్సు ఎలా పోయింది...పర్సెక్కడ ఉంచి ఎటన్నా వెళ్లారా?

స్త్రీ: అలా ఎందుకు చేస్తాను - అది చేత్తో పట్టుకొనే యీ కిటికీమీద చెయ్యి ఉంచి, తల చేతిమీద పెట్టి పడుకున్నాను... ఈ స్టేషన్లో రైలు ఆగేసరికి తెలివొచ్చింది... పర్సు లేదు.

టి. సి: కిటికీమీద చెయ్యి వేసి పడుకున్నారు కదూ! ఆ చేతిలో పర్సుందా?

స్త్రీ: ఉంది.

టి. సి: అయితే ఇంకేం, నిద్రలో అది జారిపోయి ఉండాలి.

స్త్రీ: అలా జారిపోయి ఉండదు - మధ్య మధ్య నే తెలివొచ్చి చూసుకుంటే పర్సు ఉండేది. కాని కిందటి స్టేషన్లో ఎవరో నా చేతిని తగిలినట్టయి తెలివొచ్చింది. చూసుకుంటే పర్సు లేదు.

టి. సి: అయితే ఇంకేం మరి. ఎవడో మీ చేతిలో అది చూసి దక్కా లాగేశాడు. అందులోనూ రూపాయలు కూడా ఉన్నాయేమో, దీపాల కాంతిలో స్పష్టంగా కనిపించి ఉంటుంది.

స్త్రీ: (బేజారుగా) నేనింక ఏం చెయ్యడం ఇప్పుడు. మద్రాసు ఎలా వెళ్ళడం. వెళ్ళాక అక్కడింక ఎలా.

టి. సి: మద్రాసు వెళ్తున్నారా మీరు?

స్త్రీ: ఔను.

టి. సి: పర్సులో ఎంత సొమ్ముందేమిటి?

స్త్రీ: నూరు పైచిల్లర.

టి. సి: అంత డబ్బూ అందులోనే ఉంచేశారా?

స్త్రీ: ఒక్క కానీ కూడా పైన లేదు.

టి. సి: చేత్తో పట్టుకోడం మీది పొరపాటయింది. జేబులోనే ఉంచుకోవల్సింది.

స్త్రీ: చేత్తో పట్టుకుంటేనే మంచిదేమో అనిపించి అలా చేసేను - ఎలా ఇంక.

టి. సి: వచ్చే స్టేషన్లో పోలీసుకి రిపోర్టిస్తాను. మీ టికెట్టు నంబరు తెలుసుకుంటాను - పోనిండి. ఫరవాలేదు. మద్రాసు చేరుకొనేందుకు మీకేం బాధలేదు. నేను చూసుకుంటాను. అక్కడ స్టేషన్లో మళ్ళీ కలుస్తాలెండి.

[టి. సి. రైలు నడుస్తుండగానే తలుపు తెరిచి పక్క పెట్టెలోకి కమ్మీల ఆధారంతో వెళ్ళిపోతాడు.]

[రైలు వేగంగా పరుగెత్తుతూ వుంటుంది. ప్రక్క అరలో పై బెర్తుమీద ఎవరో కదలినట్లవుతుంది. అంతలో అక్కడనుంచి ఎవరో పలకరిస్తారు.]

గొంతు: అబ్బ. ఎంత చలిగా ఉంది.

స్త్రీ: (ఉలికిపడి బెరుకుగా) ఆ...

గొంతు: సంక్రాంతి కొదుకొని పెట్టెలో అలికిడి లేకుండా పోయింది! ఏం నరుసూ?

స్త్రీ: (ఆశ్చర్యంగా) ఇన్స్పెక్టర్. (సంబాళించుకొని) ఎవర్ని మీరు పలకరిస్తున్నారు?

ఇన్: నిన్నే నరూస్నూ...

స్త్రీ: మీ రేదో పొరపాటుపడ్డారు. మీ రనుకుంటున్న మనిషెవరో... నేను కాను.

ఇన్: పొరపాటే అయ్యిందనుకో - కాని నీ నుదుట ముచ్చట వేసిన ఆ మచ్చ ఎలా మరిచిపోమంటావ్?

స్త్రీ: కొంచెం మర్యాదగా మాట్లాడండి - మీరు తప్పకుండా పొరపాటే పడుతున్నారు. మనిషిని పోలిన మనిషి ఉండొచ్చు.

ఇన్: బెజవాడనించీ వింటూ వస్తున్నాను నీ గొంతు పోల్చుకోలేనంటావా?

స్త్రీ: (ఆశ్చర్యంగా) బెజవాడనించీ మీరీ పెట్టెలో ఉన్నారా?

ఇన్: ఆశ్చర్యం వేస్తోంది కదూ? ఈ ప్రక్క సొరుగులో పడుకున్నాను. తెల్సుకోలేక పోతే నీది పొరపాటు.

స్త్రీ: తెల్సుకోనంత మాత్రాన నష్టమేముంది? మీ రేదో పొరపాటుపడి...

ఇన్: ఇదుగో నరుసూ - మూడు సంవత్సరాల్లో నీ ముఖం గుర్తుపట్టలేనంతగా మరిచిపోతాననుకున్నావా?

స్త్రీ: మరిచిపోవడం అన్న ప్రశ్న ఇప్పుడెలా వచ్చింది? మీ రెవరినో చూసి...

ఇన్: మద్రాసుని ఆడించినట్టు నన్నలా ఆడించగలవ్? ఊరకనే ప్రమోషన్‌మీద వెళ్ళలేదు మద్రాసు -

స్త్రీ: మీరు పైగా నన్నవమాన పరుస్తున్నారు.

ఇన్: అదికాదా... నరుసూ, దారికిరా - ఒక్క నిముషంలో నేను ఋజువు చేసిగలను -

స్త్రీ: ఏమి ఋజువు చేస్తారు? మీరు పొరపాటు తెల్సుకోకుండా ఒక ఆడదాన్ని అవమానం చేస్తున్నారు.

ఇన్: నేనే పొరపాటుపడితే, దాని ఫలితాలు నే ననుభవించడానికి తయారుగా ఉన్నాను.

స్త్రీ: మీ రనేదేమిటి ఇంతకీ?

ఇన్: ఇంకా పైకి తోయాలా? నీ గుండె నిబ్బరం మెచ్చుకోవచ్చు. సరే - మొదటిది, నువ్వు టిక్కట్టు లేకుండా ప్రయాణంచేశావ్.

స్త్రీ: టిక్కట్టు లేకుండానా. నా టిక్కట్టు పోయింది.

ఇన్: అది తరవాత తేల్తుంది. టిక్కట్టు అడగడానికొచ్చిన టి. సి. ని మోసం చేసేవ్, పర్సు పోయిందని.

స్త్రీ: నా పర్సు పోవటం అబద్ధమంటున్నారా?

ఇన్: అది తరవాత తేల్తుంది... అతని చేత ఫాల్స్ కంప్లెంటు పోలీసులకి చేయించేక. నీ జాకెట్టు జేబులోంచి ఆ డబ్బు తీయించగలను.

స్త్రీ: ఇన్స్పెక్టర్...

ఇన్: ఇలాంటివాటిలో పండిపోయేను. ఇంక - కల్లబొల్లికథ కల్పించి ఒక తెగ మనిషిని మోసంచేసి డబ్బు తీసుకున్నావ్. ఆ మనిషి నాకు తెల్సు - అతన్ని సాక్ష్యం తేగలను .... ఆ మద్రాసీ మనస్సు లాగే ఆ అమాయకుడ్ని నీ వలలో వేసుకుందామనుకున్నావ్ - రైల్లోకూడా నీ వృత్తి నడిపిద్దామనుకున్నావ్........ ఏం అలా తెల్లబోతావ్... పోనీ మూడేళ్ళ కింద బ్రోతల్ చట్టానికి విరుద్ధంగా వెళ్ళకొన్నావన్న శిక్ష పొందేవ్. అదీ మరిచిపోయేవా? ఏం నరుసూ. అదేమిటి, ముఖం అలా అయిపోయింది...

[ఆమె తటాలున అతని కాళ్ళమీద పడుతుంది.]

ఇన్: (ఇంకా గాంభీర్యంగానే) ఎందుకలా పడిపోయేవ్ .... నా కాళ్ళెందుకలా పెనవేసుకుంటావ్? లే లే.

★ ఆఖరి తప్పు ★

స్త్రీ: (పిచ్చిదానిలా) లేవను. నేను ఇంక లేవలేను. నన్ను రక్షిస్తానని మీరు లేవనిస్తేగాని లేవను. మీ పాదాలముందు తల కొట్టుకుంటాను. ఈసారికి నన్ను క్షమించండి.

ఇన్: వద్దూ, లే లే.. తప్పు నేనూ నీలాంటి మనిషినే - నా కాళ్లెందుకు పట్టుకుంటావ్...లే ..

స్త్రీ: నన్ను ఈసారికి క్షమిస్తాననండి. యీ జన్మకిదే ఆఖరి తప్పు ఇన్స్పెక్టరుగారూ...ఇది నేను ఇష్టముండి చేసింది కాదు...మరింక నేనే తప్పూ చెయ్యలేను లేవనె త్తకండి. ఒద్దు ..క్షమించేనన్న వరకూ ఇలానే ఉంటాను...

ఇన్: లే వరుసా...హూర్స్ ... అదీ, అలా...కళ్లు తుడుచుకో.

స్త్రీ: (వెక్కి-వెక్కి ఏడుస్తూ) నన్ను విడిచిపెట్టండీసారికి...ఇదే ఆఖరుసారి .. నాకు శిక్షననుభవించడానికి అభ్యంతరం లేదు...కాని...

ఇన్: మనస్సు స్థిమితపరుచుకో కొంచెం.

స్త్రీ: నే నెప్పుడు అనుకోలేదు అంతా అలా జరిగింది

ఇన్: తొందరలేదు. మాట్లాడు దుఃఖం గాని...మనస్సు కుదుటపరచుకో. వింతని పిస్తోంది. యీ వేళ్ళకింద నేను నీమీద కేసు పెట్టేను. బెజవాడలో ఉన్నప్పుడు... మళ్లీ ఇవాళ నాకే నువు దొరికేవు

స్త్రీ: ఈ సారికి ... (దుఃఖంతో నోట మాటరాదు)

ఇన్: నిన్ను చూస్తే నాకు జాలి వేస్తుంది ఇలాంటి బ్రతుకు ఏమిటి నీకుంది ఇందులో సుఖం నువ్వు అప్పటితో మారిఉంటావను కున్నాను. కాని, నీలో ఏమార్పూ లేదు. బ్రతుకులో ఇంతకన్న విచారకరమైన స్థితి ఇంకేముంది

స్త్రీ: (తేరుకొని) మీరు నన్ను సరైన త్రోవలో పెట్టాలనుకున్నారు - కాని, శిక్ష వేసి మనుష్యులని మార్చగలరా? కాని, ఇవాళ నాలో...

ఇన్: ఇంక సరిగా ఉంటానంటావ్... ఏం? కాని నాకు నమ్మకం లేదు. ఆనాడూ అలానే అన్నావ్...

స్త్రీ: ఇవాళ నాలో నిజమైన మార్పు జరిగింది. మీకు దొరికిపోవడంవల్ల కాదు మీరు నన్నిప్పుడు పట్టుకున్నారు ... కాని నాలో ఇప్పుడు పాత నరుసు లేదు ... పోయింది ... తప్పులేనిదాన్నే మీరు పట్టుకున్నారు....

ఇన్. అంటే??

స్త్రీ: నాకివాళ ఒక గొప్ప అనుభవం కలిగింది.. మనుష్యుడి మనస్సులోని మంచి నన్ను మార్చేసింది ... నాకీ బతుకుమీద విరక్తి పుడుతోంది రోత పుడుతోంది...

ఇన్: ఇంతపరివర్తన నీలో కలిగినప్పుడు, టిక్కట్టు పోయిందన్నావ్, ఉన్న డబ్బు కట్టలేకపోయేవా? పోనీ మొదటికొస్తే, అసలు మద్రాసు బయల్దేరడంలో నీ ఉద్దేశం నాకు తెల్సు - బెజవాడ పాతబడిపోయింది. పోనీ టిక్కట్టు లేకుండా ఎక్కినదానివి పాపం వాళ్లనెందుకిలా మోసం చెయ్యడం?

స్త్రీ: మీ మనస్సుకి నేనొక యంత్రంలాగ, మరలాగ కనుపిస్తున్నాను ... ఆ విధంగా మీరు నన్ను చూస్తున్నప్పుడు నే నేం చెప్తే మీరు బోధపరుచుకుంటారు?

ఇన్. (చిరునవ్వుతో) నువు చెప్పబోయేదేదీ నాకర్థం కాదంటావ్? నిజమేలే అబద్ధాలు మనం అసలు పట్టించుకోం.

స్త్రీ: నేను చెప్పబోయేది అబద్ధం కాదు .. నాకిప్పుడా అవసరం లేదు. ఈ బ్రతుకులో నా కొక్కటే బంధం ఉండిపోయింది ఆ ఒక్క బంధాన్ని వదిలించుకోనేందుకే ఈ ప్రయాణం.. సింహాద్రి...

ఇన్: సింహాద్రా.. సిం.. హా . ద్రి... ఔనౌను. నీకు ..

స్త్రీ: ఔను. నన్నీ స్థితికి తెచ్చినవాడే...

ఇన్: మీ ఇద్దరికీ పెళ్లయింది కదూ?

స్త్రీ: అయినట్టే. కాని మీ చట్టం ఒప్పుకోదు.

ఇన్: నిన్ను పట్టుకొని .. నీకు శిక్ష వెయ్యడం అయిపోయాక జామీనుంటానని ఒచ్చేడే .. ఉత్త దొంగవెధవ ... వాడిని ఒకటి రెండుసార్లు పట్టుకున్నానుకూడాను.

స్త్రీ: అక్కడికే నేను వెళ్ళడం...

ఇన్. వాడు మద్రాస్‌లో ఉన్నాడా? దొంగవెధవ. వాడీసారి దొరికితే ..

స్త్రీ: మరి మీ రతన్ని పట్టుకోలేరు.

ఇన్: ఏం...? నాకే దొరకడంటావా?

స్త్రీ: మనుష్యుల కెవ్వరికీ దొరకడు.

ఇన్: అంటే?

స్త్రీ: మరి బతకడు నిన్న ఉత్తరం ఒచ్చింది అతని స్నేహితుడెవరో రాసేరు .. వెంటనే రమ్మని.. హాస్పిటల్‌లో ఉన్నాడు.. (ఏడుస్తుంది)

ఇన్: ఏమయింది వాడికి?

స్త్రీ: గుండెజబ్బు ..మరి బతకడుట

ఇన్: గుండెజబ్బా మా జేళ్లకింద దుక్కలా ఉండేవాడే?

స్త్రీ: తాగుడు గుండెకి దెబ్బ తినిపించింది ఇవి ఆఖరిరోజులు . అతన్ని.. ఒక్కసారి చూసి...

ఇన్. వాడిమీదింకా మమకారం నీకు పోలేదంటే నా కాశ్చర్యంగా ఉంది . నిన్ను లేవదీసుకొచ్చి, తిండిలేకుండా చేసి, ఈ స్థితిలోకి దింపేడు వాడిని నువ్వెందుకు చూడాలి?

స్త్రీ: ఇది ఆఖరి చూపు ... మరింక చూడను.. చూడాలన్నా ఉండడు. సింహాద్రి పోతున్నాడు (ఏడుపు)

ఇన్: మీ ఆడవాళ్లు చాలా విచిత్రంగా ప్రవర్తిస్తూ ఉంటారు ఇన్నేళ్లయి చూస్తున్నాను ఏదో అగమ్యగోచరంగా ఉండడమే తప్ప మీ మనస్సు లంతూ పొంతూ తెలీదు

స్త్రీ: నా కెంత అసహ్యం, ద్వేషం అతనిమీదున్నా ఒక్కసారి చూడాలని ఉంది...ఆఖరుసారిగా ఆ కోరిక చంపుకోలేను.. (తేరుకొని) చాలా అప్పులు చేసేడుట వాటిని నిలయిసంతనుట్టుకు తీర్చాలి . దానికి డబ్బు .. ఒకవేళ అనుకున్నంతా అయితే . దానికి డబ్బు ఉండాలి

ఇన్: అయితే డబ్బుకోసం ఆ కథ కల్పించేవా ..

స్త్రీ: కాదు నా నిజమైన స్థితి ఎలా చెప్పుకోడం? నేను ఫలానా అని ఎలా చాటుకోడం. (మౌనం) ఏదో ఇంకోలా చెప్పుకోవాలి నాకు సానుభూతి కావాలనిపించింది ఎన్నో ఏళ్లయింది ఒక్కరూ, ఒక్కనాడూ జాలి, సానుభూతి చూపినవారు లేరు . అంగుకలా చెప్పేను అనుకోకుండా ఆయన డబ్బిచ్చారు అతని దయ నాలో ఎంత మార్పు తెచ్చింది ఆ అబ్బాయి చంటిపిల్లాడిదిలాంటి మనస్సు. పాతబతుకులో మరి అడుగుపెట్టను ప్రాణం పోయినా .

ఇన్. నిశ్చయాన్ని ఆచరణలో పెట్టడం కష్టం

స్త్రీ: నేనొక పని చేదామని మనస్సులో నిశ్చయించుకున్నాక ఎప్పుడూ మానలేదు. ఇప్పటివరకూ

ఇన్: కాని ఇప్పుడో, నువ్వు సింహా

ద్రిని చూద్దాం అనుకుంటున్నావ్...అది ఎలా జరుగుతుంది ..

స్త్రీ: (బెదురుగా) నన్నీసారికి క్షమించరా ఇన్‌స్పెక్టరుగారూ.

ఇన్. నరుమా నీ కష్టాలకి నాకు పూర్తి సానుభూతి ఉంది. నేనూ విచారిస్తున్నాను నీ స్థితిచూసి . కాని నా బాధ్యత నేను నెరవేర్చవల్సుంటుంది నీకు కష్టం కలగొచ్చు ..నువ్వు సింహాద్రిని కలుసుకోలేవేమో.

స్త్రీ: (వెర్రిదాన్లా) కల్సుకోలేనూ .

ఇన జౌను నీమీద చర్య తీసుకోవాల్సుంటుంది నేను అ(రెస్ట్ చే. మళ్ళా కాళ్ళమీద పడబోకు.. ఒద్దు లే...

స్త్రీ) వదల్ను . ఇక్కడే తలకొట్టుకచచ్చిపోతాను సింహాద్రిని కల్సుకోలేకపోతే నే నింక బతకను

ఇన్ లే కూర్చో అలా కిందపడి ఏడుస్తే మాత్రం నేను నిన్ను ఇందులోంచి తప్పించగలనా? లే ఇంకోలా ఏదన్నా సాయం చేస్తాను.

స్త్రీ: ఏం చేస్తారు?

ఇన్. నీ తరఫున వాడి అప్పులు తీర్చించేస్తాను వీలయినంత మటుకు.. ఆ డబ్బు నాకియ్యి అదంతా నేను చూసుకుంటాను... సరా?

స్త్రీ. నేను మాడ్డం .

ఇన్ అదలా జేసుంది (ఆలోచించి) నీ వెవరన్నా జామీనుంటే వళ్ళగలవ్..

స్త్రీ. జామీనా, ఇన్స్పెక్టర్ గారూ, మీ కింకా దయరాలేదూ?

ఇన్ లాభం లేదు నువ్వెంత ప్రాధేయపడ్డా, నాకు జాలికలగడం తప్ప నేను మాత్రం ఏం చెయ్యగలను నా పనిలో మాత్రం నేను పెడదారి పట్టలేను. నీకు తెలిసే నన్నెందు కడుగుతావ్? (మౌనం).

స్త్రీ. మీ మేలు ఎప్పుడూ మరిచిపోలేను మీ రుండరూ. ఆపాటి సాయం.

ఇన్. నేనా అది లాభం లేదు నిన్ను నేను పట్టుకుంటూ, నే నెలా ఉండగలను జామీను పోనీ మీ స్నేహితుణ్ణి ఆ టిక్కట్ కలక్టర్ నే ఉండమను

స్త్రీ: (భయంగా) ఏమయినా కానీండి . కాని అతనికి మాత్రం తెలీనివ్వకండి మూర్ఖారుపేటలో ఆయ నొస్తారు నా స్థితి ఆయనకి తెలీనివ్వకండి.

ఇన్. అదెలా ? ... అతనొక సాక్షికింద ఒస్తారు . నీకథకి ..

స్త్రీ. దిగులుగా ఆయనకి తెలీకుండా ఉంచడానికి వీల్లేదా?

ఇన్ ఎలా వీలు జౌతుంది?

స్త్రీ: నేను మిమ్మల్ని దయచూపెట్టమని ఇంకోసారి బతిమాలుకుంటున్నాను . . వయస్సులో చిన్నవారైనా కష్టాలు మీరూ అనుభవించే ఉంటారు ... ఇలాంటిస్థితిలో పడ్డప్పుడు ఆ మనిషి మనస్సెలా ఉంటుందో ఊహించుకోగలరు ..

ఇన్ అన్నీ నాకు తెల్సు ... కాని నన్నేం చెయ్యమంటావ్?

స్త్రీ) మీకు చెడ్డపేరేమీ రాదు . మీరు నన్ను పట్టుకున్న వ్వైరూ చూడలేదు... మీ మనస్సుకి ఉండొచ్చు తప్పుచేస్తున్నట్టు . కాని ఇది చాలా చిన్నతప్పు దీనివల్ల మీకు పుణ్యమే ఒస్తుంది. నేను మరి ఆ నరకంలోకి తిరిగి వెళ్లను...నా మనసు విరిగిపోయింది.

ఇన్. తప్పు చిన్నదైనా పెద్దదైనా తప్పే .. లాభం లేదు ... చెప్పేనుకదూ ? ఇంకే సాయమన్నా చెయ్యగలనుకాని ఇందులోంచి తప్పించలేను. నేను స్వతంత్రుణ్ణి కాను ప్రభుత్వంతరఫున కర్తవ్యానికి నేను బానిసను. కేవలం మరలాంటివాణ్ణి మరకేం చెప్పినా అది వినగలదా? అదేమాట సూటిగా చెప్తున్నాను . నేను కేవలం అసహాయుణ్ణి.

స్త్రీ) అంతేనా? మరింకో దారిలేదా?

ఇన్: కేసుపోయినా పోవచ్చు కోర్టులో ... ఎవ్వరూ చెప్పలేరు ... అవగుకాని, ఒకవేళ అదే అయితే నీకు మళ్లా స్వేచ్ఛ.

స్త్రీ) ఒకటి రెండురోజుల్లో ఇది అయ్యే పనికాదు ..సింహాద్రి అంతకన్న [illegible]క్కువ బతకడు ఉత్తరంలో అలా ఉంది. పోనీ ఒక్కసారి చూడనీయండి. చూపించి తిరిగి తీసుకపొండి ..

ఇన్. నా మనస్సుకి బాధ కలిగించడం తప్ప మరేమీ లాభం లేదు ..మరింకేదన్నా చెప్పు చేస్తాను ... కాని ఆ విషయంలో నేను మనిషిని కాదనుకో .

స్త్రీ) (నిస్పృహతో) నా రాత (మౌనం)

ఇన్: ఫ్లాస్కులో కాఫీ ఉంది ... కొంచం తాగుతావా?

స్త్రీ) కాఫీ ఆ? మీరిస్తారా

ఇన్: ఏం ? అంతలా విస్తుపోతావ్? నేనూ నీలాటిమనిషినే. నాకూ గుండె ఉంది .. చట్టాల్ని జవదాటడం కర్తవ్యాల్ని మరవడం ఇవే నాకు కలలోనన్నా చేతకాని పనులు..

స్త్రీ: (పకపక నవ్వుతుంది)

ఇన్. ఏం?

స్త్రీ) మీరు చాలా వింతగా ఉన్నారు

ఇన్ ఏం? నన్ను చూస్తే నవ్వొస్తోందా?

స్త్రీ కాదు ఆశ్చర్యం వేస్తోంది.

ఇన్ కాఫీ కావాలా?

స్త్రీ చాలా సంతోషం. వద్దు.

ఇన్. సిగరెట్టో? నీకలవాటుందికదూ? ఆనాడు .. దార్లో ఆపించి మరీ సిగరెట్టు కొనిపించేవ్ . గుర్తుందా?

స్త్రీ: నాకిప్పు డలవాటు లేదు .. నా మనస్సు విరిగిపోయింది...ఆ అబ్బాయి ఎంత గాఢంగా నన్ను ప్రేమించేడు.

ఇన్: ఏదో ఆత్మీయత కనిపించిందన్నాడుకదూ? వెర్రివాడు. (నవ్వుతాడు)

స్త్రీ మీకు ప్రేమ అంటే తెల్సునా?

ఇన బాగా అడిగేవ్. భార్య పోయేక మరి పెళ్ళి చేసుకోలేదు.. ఇంకో ఆడదాన్ని కన్నెత్తి చూడలేదు .

స్త్రీ మీరు నిజంగా మనుష్యులే! ఎలా ఉన్నారిన్నాళ్లూ ఒంటిగా . పోనీ ఎవర్తి నన్నా చేరదియ్యలేకపోయేరూ?


ఇన్ మంచి సలహా ఇచ్చేవ్. ఆ బుద్ధే పుడితే పెళ్లే చేసుకుందును ... నాకు విరక్తిలా పుట్టింది, భార్యపోయేక ... అదికాక నువ్వు చెప్పిందేమిటో తెల్సునా? మా ఉద్యోగ ధర్మానికి వ్యతిరేకం.

స్త్రీ అయితే ధర్మాన్ని నాలుగుపాదాలా నడిపించడానికి పూనుకున్నారన్న మాట


ఇన్. నువ్వు ఏదోలా నన్ను నొప్పించాలని చూస్తున్నావ్. నువ్వెన్నన్నా లెక్కచెయ్యను. నాచర్మం గట్టిపడిపోయింది.

స్త్రీ మీ దృష్టిలో, ఆత్మీయత అంటే


(48 వ పేజీ చూడండి)



గాలివాలు



ఫొటో: ఎమ్. టి. చారి—రాజమండ్రి.



ప్రచ్ఛన్న రచయితలు

పరప్రతిదేవి

"ఆ కథలు నాటకాలు ఆమె వ్రాసిందంటారా? ఆ పద్యాలు చూశారా ఎంత ప్రౌఢంగా ఉన్నాయో! నా అనుమానము ఎవరయినా వ్రాసిఇస్తున్నారేమోనని!" అని ఒకరు అంటే, మరొకరు "అట్లా చెప్పండి! అదా సంగతి! నాకూ అట్లాగే అనిపించింది సుమా!" అంటారు.

కొందరు తమకు కలిగిన సంశయాన్ని మనసులో పెట్టుకొని తమ సన్నిహితులకు మాత్రమే చెప్పితే, మరికొందరు దానిని పదిమందికీ తెలిపి నిజము కనుక్కొనేవరకూ నిద్రపోరు. ఇటువంటి సంశయాలు అనుమానాలు స్త్రీల విషయములో ఎక్కువ ప్రచారమవుతూ ఉంటాయి.

కారణము కనబడకుండా కార్యము మాత్రమే కనబడినప్పుడు 'ఇది దయ్యపు చేష్టకాదు కదా!' అని అనుమానిస్తాము. ఎక్కడినుంచో రాళ్లు వచ్చిపడతాయి-ఎట్లాపడ్డాయో, ఎవరు పడేశారో మనకు తెలియదు. దండెముమీద బట్టలు కాలిపోతూ ఉంటాయి; ఎట్లా అంటుకున్నాయో ఎవరికీ తెలియదు. కాని ఇటువంటివాటి నన్నిటినీ దయ్యపుచేష్ట అంటారు. ఈ దయ్యపుచేష్టలు సాహిత్యలోకములో కూడా ఉన్నాయి.

సాహిత్యములో, రచనలు మాత్రమే పైకి కనబడి వాటి రచయితలు కనబడకుండా ఉండటము జరుగగు - అసలు వ్రాసినవారి పేరు కాకుండా ఇతరుల పేర్లు ప్రకటితమవుతూవుంటాయి. ఇటువంటి రచనలను ఆంగ్లభాషలో ఘోస్టురైటింగ్సు (*Ghost writings*) అనీ, అసలు రచయితలకు ఘోస్టురైటర్సనీ అంటారు. దీనినే తెలుగులో ప్రచ్ఛన్న రచనలనీ, ప్రచ్ఛన్న రచయితలనీ మనము అనుకోవచ్చు.

కొందరు రచయితలు తమకు పేరు ప్రఖ్యాతులు కావలెనని ఆశించరు. ఏవిధముగానైనా తమ ఆశయాలు భావాలు ప్రకటించటమే ముఖ్యమనుకుంటారు. సుప్రసిద్ధులైన ఇతరుల పేరు మీదనో, ప్రఖ్యాతపురుషుల గ్రంథాలలోనో తమ రచనలను చొప్పించి, అవి ప్రచారమవుతుండగా ఆత్మానందము పొందుతారు. ఇటువంటివి ప్రక్షిప్తాలనిపించుకొంటాయి. ఇవి పురాణాలలోను, మత గ్రంథాలలోను ఉన్నాయని నిర్ణయింపబడ్డది. దీనిలో తమ మత విశ్వాసాలకు గౌరవాన్ని ఆపాదించటానికి, అనువైన భావాలను ప్రచారము చేయాలన్న ఉద్దేశ్యము తప్ప, మరొకభావము ఆ రచయితలకు ఉన్నట్లు కనబడదు

ఆంగ్లభాషలో షేక్స్పియరు వ్రాసిన నాటకాలన్నీ బేకను రచించాడని ఒక వాదము చాలాకాలము నడచిందట మన తెలుగుభాషలో భాస్కరరామాయణకర్తృత్వము, ప్రస్తుతము ప్రచారములోఉన్న భాగవత కర్తృత్వములను గురించి చర్చలు ఉండనేఉన్నాయి. ఇలాగే శ్రీ కృష్ణదేవరాయ విరచితమైన ఆముక్తమాల్యదను గురించి పెద్దన్నగారు వ్రాశారేమోనని ఒక శంక ప్రచారములో ఉన్నది అవునన్నవారు కొందరు; కాదన్నవారు కొందరు; కొందరు అవుననటానికీ కాదనటానికీ తగిన సాక్ష్య సంపత్తిలేక, ఆ అనుమానముతోనే బాధపడుతూఉంటారు. కందుకూరి వీరేశలింగము గారు పండి పెద్దికృష్ణస్వామి ప్రణీతముగా ప్రసిద్ధమైన బిల్హణీయానికి కర్తచిత్రకవి సింగరార్యుడని నిర్ణయించారు. గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కము తెలుగుభాషలో వారు రచించినది కాదనీ, ఆంగ్లభాషలో ఆయన వ్రాసినదానికి గోమఠము శ్రీనివాసాచార్యులు గారు చేసిన అనువాదమనీ, ఇటీవల ఆంధ్రపత్రికలో తీవ్రచర్చలు సాగుతూవచ్చాయి. ప్రసిద్ధులందరూ అటుకొందరు ఇటుకొందరు సాక్ష్యాలు ఇస్తున్నారు. కన్యాశుల్కము తెలుగురచన అప్పారావుగారిది కాకపోతే,

వ్యావహారికభాషకు పునాది వేసినవారు వారేనని చెప్పేమాటలకు విలువఉండదు పాపము శమించుగాక!

ఇటువంటి ఉదాహరణలు అనేకముగా చూపెంచవచ్చు వీటిలో కొన్ని నిజము కావచ్చు - కొన్ని అపోహలు కావచ్చు - మరికొన్ని అసత్యాలు కావచ్చు వీటన్నిటి మూలసూత్రము ఒకచే.కృషి ఒకరిది - అనుభవముగాని ప్రఖ్యాతిగాని మరి ఒకరిది

ఈ సూత్రము ఒక సారస్వత రంగములోనేకాదు - మనకు నిత్య జీవితములో అనేక రంగాలలో కనబడుతునే ఉంటుంది

పేరు ప్రఖ్యాతుల విషయము, మహాకావ్యాలమాటను అటుంచి, నిత్యజీవితములో ప్రచ్ఛన్నరచయితల ఉనికి కొన్ని సందర్భాలలో తప్పనిసరి అనిపిస్తుంది గొప్ప రాజకీయవేత్తలు నాయకులు ప్రతిదినము అనేక ఉపన్యాసాలు ప్రసంగాలు చేయవలసి ఉంటుంది; ఎందరికో జాబులు వ్రాయవలసి ఉంటుంది. ఊపిరిసలుపని పనిలో కొట్టుకొనిపోయేవారికి, ఉపన్యాసాలనుగురించీ, ప్రసంగాలను గురించి, తీరికగా ఆలోచించే అవకాశము ఉండదుగదా! ఈ కారణముచేత పాశ్చాత్య దేశాలలోను ఇప్పుడిప్పుడు మన దేశములోను ప్రచ్ఛన్నరచయితలు అధిక సంఖ్యలో బయలుదేరుతున్నారు.

ఇతరులభావాలకు అనుకూలముగా గాని భావముల సారసంగ్రహముగాని రచించి ఇచ్చే ప్రచ్ఛన్న రచయితలు రాజకీయవేత్తలకు, గొప్ప గొప్ప నాయకులకు తోడ్పడుతూ ఉంటారు బహిరంగముగా ఉపన్యాసాలను ఇచ్చేవారు వ్రాయించి తెచ్చుకొన్నవాటి అర్థము గ్రహించలేనివారైతే ఆ సన్నివేశము చాలా విచిత్రముగా ఉంటుంది. రాజకీయాల ముమ్మరము ప్రబలిన మనదేశములో, ప్రతిచిన్న గ్రామములో ఏదో ఒక బహిరంగసభ జరగటము, కొన్ని బ్రహ్మాండమైన ఉపన్యాసాలు సాగిపోవటము, సామాన్యమైపోయింది సాహిత్య సమావేశముగాని, వర్తక సమావేశముగాని, మతసంబంధమైన సమావేశముగాని, సాంకేతిక (Technical) సమస్యలను గురించిగాని, ఆర్థిక విషయములపైగాని, సంగీతసభలు గాని, నిరాఘాటంగా ఉపన్యాసాలు సాగిపోతూ ఉంటాయి వాటిలో ఇదమిత్థమని అభిప్రాయాలను వ్యక్తీకరిస్తూ ఉంటారు వీటిలో ప్రచ్ఛన్న రచయితల ప్రభావమెక్కువగా ఉండటములో ఆశ్చర్యము లేదు

ఇంగ్లండు అమెరికా మొదలైన పాశ్చాత్య దేశాలలో, ముఖ్యముగా రాజకీయవేత్తలు, రాజకీయాందోళనతో నే తృప్తిపడతారు సారస్వత విషయాలలోను, సాంకేతిక సమస్యలలోను ప్రత్యేక కృషిచేసినవారుతప్ప మిగతావారు దిగరు ఆ విషయముగా దిగదలచుకొన్నవారు విషయము బాగా అవగాహనము చేసుకొని, పరిశ్రమించి, తెలియని విషయాలను పండితుల ద్వారా తెలిసికొని, తమ అభిప్రాయాలను వ్యక్తపరుస్తారు. కాని అవకాశము లభించి నచేతడవుగా అన్ని విషయాలపై నిష్పంకోచముగా అభిప్రాయాలను వెలువరించరు

సమర్థులైన రచయితలు కొందరు ప్రచ్ఛన్నరచయితలను ఏర్పరచుకొని కొన్ని గ్రంథాలు వ్రాయించుకొని తమ పేర ప్రకటించుకోవటము కూడా ఉన్నది. అరోగ్యం

★ ప్రచ్ఛన్న రచయితలు ★

డుమా అనే సుప్రసిద్ధ ఫ్రెంచి నవలాకారుడు అనేకమంది ప్రచ్ఛన్న రచయితలను ఏర్పాటుచేసుకొని నవలలను వ్రాయించాడనీ, వాటిని తన పేర ప్రకటించుకొన్నాడనీ ఒక వాదము ఉన్నది (ఇది నేను విన్న సంగతి) కాని ఈ కారణముచేత డూమా ప్రతిభను శంకించటము భావ్యము కాదు. ప్రతిభ లేనివారినిమాత్రము శంకించడానికి అవకాశము ఉన్నది. ఆయా విషయాలలో సామర్థ్యము లేనివారు కవిత్వము వ్రాయించి తన పేరుమీద ప్రకటించుకొన్నా, కవితావిమర్శ చేసినా, శాస్త్రసంబంధమైన సిద్ధాంతాలను చర్చించినా, సంశయముమాట అటుంచి వినటానికి వెగటుగా కూడా ఉంటుంది. ప్రచ్ఛన్న రచయితలను ఎంతవరకూ ఉపయోగించుకోవాలో తెలిసికోనందువల్ల కలిగే అనర్థాలలో గౌరవము పోగొట్టుకోవటము ముఖ్యమైనది.

చలనచిత్రాలలో యిటువంటి ప్రచ్ఛన్నతా ప్రభావము బాగా కనబడుతూ ఉంటుంది. సరిగా చలించకుండా పెదవులు కదుపుతున్నట్లు తెరమీద కనబడుతూ ఉంటారు. కాని సంగీతము మాత్రము లతా మంగేష్కర్‌దీ మహమ్మద్ రఫీదీను. కేవలము పాటలే కాకుండా మాటలలోకూడా ఈ తెరవెనుక భాగవతము పనిచేస్తూ ఉంటుంది. కేవలము హిందుస్థానీ తెలిసిన నటీనటులు తెలుగులో కనబడుతూ ఉంటారు; కాని వారి మాటలు తెలుగుని ఇతరులు చెప్పింపు సంగతి దీనిలో అంతర్నిహిత కారణాలు కొన్ని ఉంటాయి. విషాదకరమైన ఘట్టాలలో ఒక పాత్ర విపరీతముగా దుఃఖిస్తూ తెరమీద కనబడుతుంది. ఆ సమయములో పాడిన పాట మధుర కంఠముతో పాడినట్లుగా ఉండడంగాక సామాన్యమైన పాటగా ఉంటుంది. ఇంతగా ఏడుస్తూ ఉన్న మనిషి మామూలు కంఠముతో పాడటము సహజమా? ఈ సందేహము పరిశీలనాశక్తిగల ప్రేక్షకులకు కలుగుతూనే ఉంటుంది. ఇక్కడ ప్రచ్ఛన్నతాప్రభావము సుంజేతి కంకణముగా ఉంటుంది. అయితే సహజముగా కనబడ్డ సందర్భాలు లేవని కాదు. చలనచిత్రాలలో ఏ వ్యక్తి పాడినది, ఏ వ్యక్తి మాటాడినది పేర్లు చివరలోకూడా ప్రకటిస్తారు. చాటుమాటు లేని రంగమిది.

సాహిత్యములో వ్రాసినవ్యక్తి ప్రచ్ఛన్న రచయిత అయితే (*Glost writer*), వ్రాయించుకొన్నవారు (*Mummy*) ఉత్సవవిగ్రహమువంటివారని అనుకోవచ్చు. ఈ ఇద్దరిలో రచన తత్సంబంధమైన ప్రజ్ఞ రచయిత దగ్గర ఉంటాయి. మరొకరిదగ్గర రచయితగా గౌరవము సంపాదించుకోవాలన్న కాంక్ష, దానికి తగినధనము ఉంటాయి. అవసరము కొద్దీ సరుకు ఇచ్చిపుచ్చుకోవటాలు వ్యాపారరీత్యా జరుగుతాయి. అమెరికాలో పి. హెచ్‌డికి కావలసిన థీసిస్ కూడా అమ్మకానికి పెడుతారు. ప్రచ్ఛన్న రచయితలలో స్వయంప్రచ్ఛన్నులు కొందరు ఉన్నారు.

సర్వరచనలనే సాంకేతిక నామముతో (*Penname*) ప్రకటించుకొంటారు. ఆంగ్ల రచయితలలో ఇటువంటివారు చాలామంది ఉన్నారు. మన కవులలో కాళిదాసు భవభూతి మొదలైన పేర్లు ఈ జాతికి చెందినవే. ఈ కాలములో కూడా 'శ్రీ' లన్న పేర్లతో పత్రికలలో ప్రకటించబడేవన్నీ సాంకేతిక నామాలే.

స్వయంప్రచ్ఛన్నులలో ఆంగ్ల రచయిత్రి జార్జి ఇలియట్ (సైలాస్ మార్నరు గ్రంథకర్త్రి) పురుషనామధారిణి. ఏ దేశమైనా ఏ కాలమయినా - అన్ని విషయాలమీద వ్రాయటానికి సంఘములో స్త్రీలకు కొన్ని అటంకాలు ఇబ్బందులు ఉంటాయి. ఏ రచయిత్రి అయినా కొన్ని విషయాలను చర్చిస్తూ ఏదైనా వ్రాసిందంటే ఆ మరునాటినుంచి బంధుమిత్రుల్లు ఆమెవల్లనే తమకు అప్రతిష్ఠ కలు[illegible]న్నదన్నట్లు మాట్లాడుతారు. సంఘముకూడా ఎప్పటివలె గౌరవముతో చూస్తుందన్న నమ్మకము లేదు. ఇక ధర్మ విషయము వేరే చెప్పనవసరము లేదు. ఒక్కో ప్రళయము తాండవిస్తుంది. సామర్‌సెట్ మామ్ వ్రాసిన 'కర్నల్స్ లేడీ' అనే కథలో కర్నల్ గారి భార్య కవయిత్రి. ఆమె రచనలన్నీ గ్రంథరూపములో ప్రచురింపబడతాయి. తన భార్యకు ప్రతిభ ఉన్నదని ఎన్నడూ గ్రహించని కర్నల్, మిత్రులు చెప్పగా విన్నమీదట, పత్రికలు ప్రశంసించిన సమీక్షలు చదివిన మీదట, ఒక పుస్తకము కొనుక్కొని చదువుతాడు. వివాహిత అయిన ఒక ప్రౌఢ వయస్సులో ఆమెకంటె చిన్నవాడయిన ఒక యువకునికి మధ్య నడచిన ప్రణయోదంతాన్ని గురించి ఉత్తమ పురుషలో రచించిన ఆ కావ్యాన్ని చదివిన తరువాత, కర్నల్‌కు తన భార్య మీద అనుమానము కలుగుతుంది. ఆమెకు విడాకులు ఇవ్వవలెనని ప్రయత్నిస్తాడు (న్యాయసలహాదారుడు చెప్పగా ఆమె సంగీతనాన్ని గ్రహించి తరువాత విడాకుల విషయము విరమించుకొంటాడు) ఈ ప్రళయము స్త్రీకి భావస్వాతంత్ర్యము లేనందువల్ల కలిగినదే. ఈ కారణముచేత కొందరు మారు పేర్లతో తమ రచనలను ప్రకటించుకోవటము జరుగుతున్నది.

ఉద్యోగరీత్యా కొందరికి తమ పేర్లతో రచనలను ప్రకటించుకోవటానికి వీలు ఉండదు. ఎంత ప్రతిభ కలవారూ ఉన్నా కొందరు ప్రభుత్వోద్యోగులు నిషిద్ధ రచయితలు. ఈ కారణముచేత కొందరు మారు పేర్లతో రచనలు సాగిస్తూ ఉంటారు. కొందరు తమ రచనలలో వ్యక్తపరచిన భావాలు తమ వేనని బహిరంగముగా చెప్పలేక, మారుపేరు పెట్టుకొంటారు. కొందరు మారుపేరుతో వ్యవహరిస్తూ అందరినీ యిష్టమువచ్చినట్లుగా విమర్శిస్తూ ఉంటారు; ప్రచ్ఛన్నులై పాఠకులలో ఒకరుగా మెలగి, వర్తమాన సాహిత్య పరిణామాలను గమనిస్తూ ఉంటారు. రగడ ఎందుకని కొందరు మారుపేరుతో రచన సాగిస్తే, మరికొందరు పాఠకులను ఎదుర్కొనే ధైర్యము లేక మరొక పేరు పెట్టుకొంటారు.

తమ రచనలను కొంతమంది రచయితలు అమ్ముకున్నట్లుగానే, కొందరు ఇతరుల రచనలను వాళ్ళకు తెలియకుండానే తమ పేరున ప్రకటించుకొంటారు. స్వయంప్రయాసలకోర్చి ఎంతో పరిశోధనచేసి ఒకరు నిర్ణయించిన చారిత్రికాంశాలను, మరొకరు గ్రహించి, తమ పేర ప్రకటించుకోవటము కూడా అసాధారణము కాదు.

సృజనాత్మక రచనలు చేసేవారిలో కొందరు భావచౌర్యము చేస్తే-కొందరు రచనను రచనగానే చౌర్యము చేస్తున్నారు. ఈ విషయములో అనేక ఉదాహరణలు చూడగానే కనబడేవి - కొంచెం ఆలోచిస్తే గ్రహింపదగ్గవి ఉన్నాయి.

రచయితలలో కొందరు తమ రచనలకు ప్రామాణికతను కల్పించదలచి ఇతరుల పేర్లతో ప్రకటించటము కూడా ఉన్నది. బాలసాహిత్యములో పిల్లల పేరుమీద ప్రకటింపబడే రచనలు ఎంతవరకు పిల్లలవో చెప్పటము కష్టమైనపని. చాలావరకు పెద్దలే రచించినట్లు ఆ వాక్యరచనవల్ల తెలుస్తూ ఉంటుంది. ఈ విధముగానే కొందరు పురుషులు తమ రచనలను స్త్రీల పేరున అచ్చువేయించుతూ ఉంటారు. స్త్రీల పేరతో సులభముగా చలామణి అవుతాయన్న ఉద్దేశ్యముతో కొందరు ప్రచురిస్తే, కొందరు తమ భార్యలకో చెల్లెళ్ళకో రచయిత్రులనే పేరు రావలెనని ఆ విధముగా ప్రచురిస్తూ ఉంటారు. జిహ్వకొక రుచి ఉన్నట్లే పుర్రెకొక బుద్ధి!

ఏదైనా ఒక మంచిరచన ప్రకటింపబడినప్పుడు పాఠకుల దృష్టి వెంటనే రచయిత పైకి పోవటము సహజము. కొంతమంది పాఠకులకు రచయితతో సన్నిహితత్వము లభించటమే అటుగా పడితే, 'ఆ రచయిత నిత్యజీవిత ప్రభావము రచనపై పడ్డదా? పడితే - ఎంతవరకు?' అని తర్కిస్తూ ఉంటారు. అపరిచయులు రచయిత నిత్యజీవితము ఎట్లా ఉంటుందోనని ఊహాగానము

వనితాలోకం:

నెక్లెస్

'ఆరవలగుద్దులకూ ఆవేసరుకూ సాయం మెళ్లో ఓ 'నెక్లెస్' ఉంటే ఎంత బాగుండునూ!' అని మావారు అనుదినమూ కాకపోయినా - అనేకపర్యాయాలు అంటూ బాధ వెలిబుచ్చటం పరిపాటి.

దానికి నేను 'పోనీ లెద్దురూ! అవి లేనివాళ్లెంతమంది లేరూ? 'ఉంటే ఎంత బాగుండునూ!' అనుకోవటానికి అంతేముంది? మనకీ ఆస్తోమతు కలిగినప్పుడు చేయించుకోవచ్చు. చేయించలేకపోతున్నానే అని మీరలా బాధపడకండి!' ఇంచుమించు ఈ ధోరణిలో సమాధానం ఇవ్వటం దానితో ఆ ప్రసంగం మారటం మామూలు.

ఇది సామాన్యంగా జరిగేది - అయినా వారు దాన్ని అంతతో ముగించిపోక, 'నువ్వు నన్ను మభ్యపెట్టాలని అలాగంటున్నావు కాని, నిజానికి ఏ స్త్రీకి ఉండదూ పుస్తెలతాడూ నల్లపూసల గొలుసూ కాక కనీసం ఒక 'నెక్లెస్' అయినా ఉండాలని?' అని వారు పాడిగిస్తే -

'మీరూ మంచి 'సూట్సు' వేసుకుంటే చూసి ఆనందించాలనే ఆశ నాకుమాత్రం ఉండదూ? ఉంటుంది అంతమాత్రంచేత - అందుకని మీరూ - ఇందుకని నేనూ దిగాలుపడి ఈ సంతోషాన్ని పాడుచేసి కోవటం ఏమంత ఉత్తమమైందో చెప్పండి? ఈ ధోరణిలో నా ప్రత్యుత్తరముంటే, వారు పొందే ఆశ్వాసమూ - తృప్తీ - ఎంతటి పరిమాణంలో ఉండేవో నేను గుర్తించటంవల్ల ఒక విధమయిన గర్వముకంటే తృప్తి భావనా భరంతో నాహృదయం స్పందించే సమయాలూ తక్కువగా లేవు ... ఒకసారి జరిగిన సంగతి —

మావారికో స్నేహితుడు - దాసుగారని - ఉన్నారు ఆయన దగ్గిర 'కెమేరా' ఉందట — 'ఫోటోగ్రాఫర్' దగ్గిరకు వెళితే బోలెడు అవుతుంది. కనుక ఇతనిచేత 'ఫోటో' తీయించుకొని దాన్ని 'ఎన్లార్జ్' చేయిస్తే, తేలికలో తెమిలిపోతుంది బాగుంటుంది అనే ఊహతో ఆయన్ని రమ్మన్నారు సరదాగా మావారు —

'ఫోటో' సహజస్థితిని వ్యక్తం చేయాలే గాని దానికోసం తయారయి 'పోజు' పెట్టి కూర్చోవటం అంటే గిట్టదని కోటీలో వారు మావారు. వారితో కలసి 'ఫోటో' తీయించు

"అనంతం"

కొనేప్పటికి నేనూ ఆ పద్ధతికి అంగీకరించవలసి వచ్చింది. గొడ్డింటిని విరబూసిన నందివర్ధనం మొక్కకు కొంచెం అటూ ఇటూగా ఇద్దరం నిల్చొన్నాం సరిగ్గా 'రెడీ' అనబోతున్నారు

ఇంతలో ప్రక్కవాటాలో ఉన్న మామ్మగారు

'మీరు నాకు ముందు చెప్పకపోయినా, నాకూ ముద్దూ ముచ్చటా తెలుసు ఇందమ్మా లక్ష్మీ! ఇది మెళ్ళో వేసుకో!' అంటూ తమ మనుమరాలి క్రొత్త 'నెక్లెస్' తెచ్చి నా మెడలో వేశారు నేను వద్దంటున్నా మానక

ఆయన 'క్లిక్' మనిపించిన తరువాత ఆ 'నెక్లెస్' లేకుండా కూడా ఓ 'స్నాప్' తీయించారు మావారు —

ఇంతవరకూ సజావుగానే జరిగిపోయింది వారిద్దరూ అక్కడుండగానే 'నెక్లెస్' మామ్మగారిచేతికి యిచ్చేస్తూను ఆమె 'ఉంచుకోవమ్మా ఇవ్వాళటికి, అచ్చు లక్ష్మీదేవిలాగ ఉన్నావు అది పెట్టుకుంటే' అని నన్ను బలవంతం చేశారు చివరకు నేను ఇచ్చివేశాను - అంతతో పోనీక మామ్మగారు —

'ఏం బాబూ! ఓ నాలుగు కాసులు పెట్టి ఓటి చేయించలేరూ అమ్మాయికి, ఎంతసేపూ మీ ఖర్చులూ మీరూ ఏమిటో అంతేగాని అందం చందం ఆలోచించకపోతే ఎలాగ చెప్పండి?' అని అనేశారు —

ముగ్గురమూ పకపక నవ్వులు నవ్వేశాము మావారి నవ్వును చూచి ఆందోళన కలిగింది నాకు

ఆరాత్రి వారు 'నెక్లెస్ లేకుండా తీయించుకొని' ఎంతో 'ఇది' అయారు ఆయన్ని సముదాయించుకోవటంలో నాకు మామ్మగారిమీద అంతా ఇంతా కోపంగాదు వచ్చింది;

కాని, మామ్మగారు చేసిన మహాపరాధం మాత్రం ఏముంది? వారికి నాకూ ఉన్న చనువు అలాంటిది వారికీ మాకూ ఉన్న ప్రేమాభిమానాలముందు అలాంటివి గణించరాదు కాబట్టి.

ఆమె ఆ అనటంకూడా నిజానికి మామీద ప్రేమతో ఓ కొరత తనకుండకూడదనే అతిశయంతో మమ్మల్ని కించపరుద్దామని కానే కాదు.

ఇది మావారికీ తెలుసు. అయినా బాధపడతారు. ఏం చేస్తారు పాపం సహించలేని వారా? ఎన్నో విషయాలు అత్యాగ్రహంగా సహిస్తారు కాని, ఈ విషయంలో ఇంత ఇదవుతారు.

ఇలాంటి చిన్న చిన్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి [illegible] వేసంగి సెలవులు వచ్చాయి

చేస్తారు. ఇలా చేసి చేసి, చివరకు — 'ఆయనేం వ్రాయగలడు? ఆమె ఏం వ్రాయగలదు? ఎవరో వ్రాసి ఈ పేరు పెట్టి ఉంటారు' అని తేల్చేస్తారు

రచయితలలో కొందరు పైకి ఏమాత్రము పొంగనివారున్నారు భావయుక్తముగా ప్రసంగము చేయలేనివారు కూడా ఉన్నారు ఆ కారణము చేత వాళ్లు వ్రాయలేరని నిర్ణయించటానికి వీలు లేదు కదా అన్ని విషయాలు కొట్టినపిండివలె మాట్లాడే వారిని చూస్తే ఎంతైనా వ్రాసి ఉంటారని పిస్తుంది కాని వారిలో కొందరు కాగితము మీద కలము పెట్టరు

రచయితలలో రచనలలో గల నిజానిజాలను కనుక్కోవటము తేలికయిన పని కాదు ఈ పరిశోధనలలో స్థూలదృష్టి ఫలించదు సూక్ష్మదృష్టి కూడా ఒక్కొక్క సందర్భములో ఫలించదు నిజానిజాలు పాప పుణ్యాలు పరమాత్మకే వేద్యము. ★

★ నెక్లెస్ ★

మా నాన్నగారిఊరు వెడుతున్నాం - తాడేపల్లిగూడెంలో దిగి మార్టేరు పోయే బస్సు ఎక్కానాము. కొందరు ఆడవాళ్లు అదివరకే కూర్చుని ఉన్న సీటులో గల ఖాళీని నేను ఆక్రమించా. నా ప్రక్కన ఉన్నామెకు ఒక పాతికేళ్లు ఉండవచ్చు. మెడలో సాలీడు నెక్లెస్. చేతిలో రవల వంకీ. జార్జెట్ - కాదుకాని 'ఇమిటేషన్' - సిల్కుచీరా - ఇదీ ఆమె వేషం. ఆమె ప్రక్కన ఉన్నవాళ్లు ఇద్దరూ ముసలమ్మలు - అందుచేత నన్ను బస్సులోకి ఎక్కగానే తన ప్రక్కన కూర్చోమని ఆహ్వానించింది

ఇక్కడ నన్నుగురించి - అంటే నా వేషాన్ని గురించి - కొద్దిగా చెపుతాను - నా నగల విషయం సరేసరి - కలనేత చీర కట్టుకున్నా - దాని రంగు ముదరబోయే లేత మట్టిచిగురు రంగు. ఆ ప్రయాణంలో దాన్నే కట్టుకోవటానికి తగు కారణాలున్నాయి

మొదటిది:- అది మావారు కొన్న మొట్ట మొదటి చీర.

రెండవది:- ఇది వారు కొంటారని నే ననుకోలేదు - వారు కొనేవరకూ వారూ కొంటా మనుకోలేదు - ఎవరికో తోడుగా బట్టల కొట్టులోకి వెళ్ళారుట - ఎవరో ఇలాంటి చీర కొనటం చూశారుట - తమకూ నచ్చిందట-ఇరవైరూపాయల బేడా ఇచ్చి తీసుకు వచ్చారు - ఇలా అనపేక్షితమై అతర్కితమై వచ్చింది -

మూడవది - దానిని నేను కట్టుకొంటే వారికి చాలా సంతోషం.

నాలుగవది.- పుట్టింటికి వెడుతూ ఉండటం—

మెడలో నగలులేని లోటు కనిపించకుండటం కోసం జరిఅంచును మెడకు చుట్టూ నలగకుండా పైట త్రిప్పాను -నా వేషాన్ని నేను ఇలా వర్ణించుకోవటం అంత బాగా లేదు కాని అవసరం

ఆమె పలకరించింది.

'ఏ ఊరునుంచి వస్తున్నారు?'

'ఏలూరునుంచి'

'ఎందాక వెడుతున్నారు?'—

'అత్తిలి'

ఈ రకంగా ప్రారంభమైంది సంభాషణ. అంతమందిలో మాటాడటం చాలా ఎబ్బెట్టుగా ఉంది నాకు. కాని ఆమెతో తప్పలేదు—అక్కడికీ ఎక్కడికక్కడికి త్రుంచివేయటానికి ప్రయత్నిస్తూనే ఉన్నా. సాధ్యమైనంతవరకూ ఇతరులకి వినిపించకుండానే మాటాడుతున్నా — మధ్యలో అంది తకీమని—

'మరి మీ వారు ఉద్యోగం చేస్తున్నారన్నారు, ఓ 'నెక్లెస్సు' న్నా చేయించుకున్నారు కారేం ఇంకా?' అని.

నా గుండె ఆగిపోయినంత పని అయింది మా వారి వైపు చూశాను ఆయన అప్పుడే మరోవైపు చూడటం ఆరంభించారు? తెలిసిపోతోనే ఉంది. వారెటు చూస్తూ ఉన్నా వారికీ మాట వినిపించే ఉంటుంది బహుశః. ఎలాగ ఈయన్ని సముదాయించుకోవటం? ఇలాగ నేనిందేవిటి? కాస్తోకూస్తో చదువుకొన్నది లాగుంది. మరీ పల్లెటూరి మనిషి కాదయ్యె. నాకూ తనకూ ఉన్న పరిచయమెంత? నా నగలగొడవ తన కెందుకు? ఆమె మళ్లీ 'ఏమండీ?' అంది.

నేను ఇంక భరించలేక - అతి నిర్లక్ష్యంగా - ఒక్క చిఱునవ్వు మాత్రం ఒలికించాను గాంభీర్యం అభినయిస్తూ.

దానికి ఆమె మానసపత్రంపై ఏమి వ్యాఖ్యానం వ్రాసుకోబోయిందో కాని, ప్రక్కనున్న ముసలావిడ అందుకొంది.

'అదేమిటమ్మా అలాగంటావు - ఇప్పటివాళ్లు నగలు కూడా పెడుతున్నారా? నువ్వింకా వంకీలూ, - దానిపేరేవిటో - ఆ గొలుసూ తగిలించావు కాని; నీ యీడువాళ్ళకందటికీ నగలు మోటే; మా మనుమరాలుందా! ఎంతసేపూ జడలేమిటో, ముడులేమిటో, పూలేమిటో, అంతే; ఇప్పుడు పూలుకూడా మోటయ్యాయి; ఒక్క నగన్నా పెట్టుకోదుగదా! అంది;

నాకు ఆ ముసలావిడ నన్ను అదోవిధంగా తీసి పారేస్తోందేమో; అని కోపం వచ్చింది; అంతకంటే ఆవిడ - ఇక్కడికే ఈవిడతో గొప్పవాళ్ళ పతిమతిమువ్వతూషంటే ఆమెఅంగుకోవటం ఏమీ నచ్చలేదు - కాని, ఆమె మాటల్లో అంతర్గర్భితమైఉన్న మనమరాలు నగలు పెట్టుకోకపోవటంగురించిన మెచ్చుదలను గమనించటంవల్లా ఆవిడ నాకు సహాయపడినందువల్లా, నాకు సంతోషమే కలిగింది.

అయినా మళ్లీ చిఱునవ్వుకంటే కొంత పైస్థాయి నవ్వుమాత్రమే నవ్వేసి ఊరుకొన్నాను

ఇంతలో అత్తిలి వచ్చేసింది - మేం దిగుతూండగా నా బస్సు స్నేహితురాలి దగ్గరా, ఆ ముసిలావిడ దగ్గరా సెలవు తీసికొన్నాను.

నన్ను ఆహ్వానించేటప్పుడు ఆమె ముఖంలోఉన్న ఉత్సాహం నేను 'ఉంటానండి' అన్నప్పుడు కనుపించలేదు—

దారిలో జట్కాబండిలో కూర్చుని 'ఇలాంటివాళ్లు నాకు తటస్థపడకుండా ఉంటే ఎంత బాగుంటుంది? పోనీ తటస్థపడినా, ఇట్టి ప్రస్తావన తేకుండాఉంటే ఎంత హాయి? పోనీ, తటస్థపడినా, ఇట్టి ప్రస్తావన వచ్చినా, మావారు బాధపడకుండా ఉంటేనో! అసలు బాధేలేదు - ఇవి ఏవి జరిగేవికావు. ఆ భగవంతుడు ఆ 'నెక్లెస్' మావారు చేయించే వీలు కలిగిస్తే పీడ వదలిపోతుంది! అని ఏమేమో అనుకుంటున్నాను - ఇంతలో మావారు 'ఏమిటి! ఆలోచనలో పడ్డావు? ఇల్లొచ్చింది దిగు' అన్నదానికి 'అబ్బే' అని సమాధానం చెపుతూ, ఊహాప్రపంచంలోంచీ బండిలోంచీ దిగాను— ★



కొంటెకిట్టుడి కుంటిజవాబులు

"సోమన్నయ్య"

పంతులయ్య అడిగిన
ప్రశ్నలకు కిట్టాయి
తలతిక్కగా జవా
బులను రాసిచ్చాడు.

ప్ర: ఆవువలనా మనకు
ఉపయోగమేమిటి?
జ: పంచితంబూ, పేడ
బహుజాస్తిగా నిచ్చు.

ప్ర: పాలవలనా మనకు
గలుగు లాభంబేమి?
జ: పాలకోవా మిగుల
పసందుగా చేయొచ్చు

ప్ర: తాటిచెట్టుల వలన
లాభమేమిటి మనకు?
జ: సారాకు బదులుగా
నీరాను తాగొచ్చు.

ప్ర: పాఠాలు ప్రతిరోజు
ఏల చదువగవలయు?
జ: మర్నాడు నా వీపు
వాయకుండుటకొరకు.

ప్ర: ప్రతిరోజు పెందల
కడనె మేల్కొందువా?
జ: తెలవారు ఝామునా
తొమ్మిదిన్నర దాటి.

ప్ర: పంచదారా ఇసుక
విడదీయగలవా?
జ: ఎఱ్ఱచీమల రెంటి
నొదిలి పెట్టిన చాలు.

ప్ర: ప్రతిరోజు దేవుని
ఎటుల ప్రార్థింతువు?
జ: బడి మాన్పు దేవుడా!
బ్రతుకలే కున్నాను.

పంతులయ్యకు కోప
మెత్తుకొచ్చి పేము
బెత్తముతో కిట్టణ్ణి
చితుగా కొట్టాడు.



సింహము - ఎలుగుబంటి

జలజలమని అడవినడుమ పారు
చల్లనిజలములు గల సెలయేరు.

ఎండకాలమందు నొకదినాన
ఎలుగుబంటి యొక్కటి దాహాన

సెలయేటికి నీరు త్రావ నేగ
సింహమొకటి వచ్చె నటకు వేగ.

నిలునిలుమని సింహము గర్జించి
పలికె నెలుగుబంటితో దర్పించి:

"నే నడవికి రాజును గావునను
నేను ముందు నీరు త్రాగవలెను."

ఎలుగుబంటి నిర్భయముగ నవ్వి
పలికె కయ్యమునకు కాలుదువ్వి:

"నేను ముందు వచ్చియుంటచేత
నేనె ముందు—నీవే తరువాత"

మాటమీదమాట పెరిగిపోయె,
ఏటియొడ్డు యుద్ధరంగమాయె.

ఘోరముగా నవిరెండును పోరె,
దారుణముగ రక్తనదులు పారె.

కాయమ్ముల గాయమ్ములు తగిలి,
ఆయాసముతోడ మిగుల పొగిలి,

కలహము నవి నిలిపి కొంతసేపు
కలయజూచె తరుశాఖలవైపు.

రాబందులు, డేగలు, కాకులును,
రకరకముల పులుగుల మూకలును,

వృక్షశాఖలెక్కి కూరుచుండి
వీక్షించుచునుండె మొదటినుండి.

ఖగముల గని చీదరించుకొనుచు
మృగరాజనె నెలుగుబంటి గనుచు:

ఈసప్ కథలు : 3

నండూరి రామమోహనరావు

"చూచితివా ఈ వృషభముల తీరు.
చోద్యముగా చూచును మన పోరు.

మనలోనే యొక్కరు మడిసినను
మనమాంసము వీటినోట పడును.

'వీరెపుడు చత్తురా' యని గాచేలు
ఎదురుచూచుచున్నవీ ఖగాలు.

ఇంత బ్రదుకు బ్రదికి తుదకు మనము
ఇట్లు అంతమగుట ఏమి మనము?


కాలసేవు పోరితి మిక చాలు.
ఆలమింక మానుకొనుట మేలు."

నిజమేనని ఎలుగుబంటి అనెను.
నీరుత్రాగి తనదారిని చనెను.



నీతి

ఇరువురు పోరాడుకొనుట
పరులకెపుడు లాభకరము
కాన విజ్ఞులైనవారు
కలహమునే వర్జింతురు.



జరిగినకథ:

ఫ్రాన్సుదేశంలో విప్లవం ఉధృతంగా ఉన్నరోజులు - చాలామంది ప్రభువంశీకులకు శిరచ్ఛేదం విధించబడింది. ఉన్నట్టుండి ఇలా శిక్షలు విధించబడినవారితోసహా, చాలామంది ప్రభువంశీకులు తప్పించుకు పారిపోవటం మొదలుపెట్టారు. కొంతమంది ఇంగ్లీషువారు సంఘంగా ఏర్పడి వారిని తప్పిస్తున్నారని వదంతులు బయలుదేరినాయి. వారి నాయకుడు ఎవరో ఎవరికి తెలియదు. స్కార్లెట్ పింపర్నల్ అనే మారుపేరులో వ్యవహరిస్తుంటాడు. ఈ స్కార్లెట్ పింపర్నల్ బిబట్ అనే ద్వార రక్షకునికళ్లల్లో దుమ్ముకొట్టి, కౌంటెస్ శిటూర్నెను ఆమె పిల్లలు సుజేన్, వైకౌంటులను తప్పిస్తాడు. వారు ఛానెల్ దాటి ఇంగ్లాండ్ చేరుకుంటారు. మార్గరెట్ అనే ఫ్రెంచియువతి, సర్ పెర్సీ అనే ఇంగ్లీష్‌వానిని పెళ్లిచేసుకొని లండన్ వచ్చేస్తుంది. ఈమెకూడా పెళ్లికాకముందు ఒకసారి ఒక ప్రభువుకు మరణశిక్ష వేయిస్తుంది ఇంగ్లాండులో ఉండగా ఆమెను ఎన్నడూ కలుసుకోవటం తటస్థించరాదని కౌంటెస్ కోరుకుంటుంది. కాని కౌంటెస్ ఇంగ్లాండుచేరిన కొద్దిగంటల్లోనే ఆమెఉన్న హోటలుకే మార్గరెట్ వస్తుంది. ఆమెపై తనకున్న ద్వేషంకొద్దీ కౌంటెస్ మార్గరెట్‌ను నలుగురిలో అవమానపరుస్తుంది తరువాత సర్ పెర్సీకూడా లోపలికివస్తాడు. సర్ పెర్సీ వట్టిమందమతి, బద్ధకస్తుడు. వైకౌంట్ సర్ పెర్సీలో కలహానికి తలపడతాడు. కాని పెర్సీ వేళాకోళంగా మాట్లాడి కలహం తప్పిస్తాడు. మార్గరెట్ ఫ్రాన్సుపోతున్న తన సోదరుడు ఆర్మండ్‌ను సాగనంపటానికి బయలుదేరుతుంది. ఆర్మడ్‌ను సాగనంపి మార్గరెట్ వెనుతిరిగి వస్తూఉండగా, ఆమెకు పారిస్‌లో ఉన్నరోజులలో తెలిసిన షావలిన్ కనిపిస్తాడు. ఫ్రెంచిప్రభుత్వంతరఫున రాయబారిగా వచ్చినట్లు తెలిపి షావలిన్, స్కార్లెట్ పింపర్నల్ ఆచూకి తీయటానికి తోడ్పడమని కోరుతాడు. కాని మార్గరెట్ అంగీకరించదు. ఎందుచేతంటే మార్గరెట్‌కు తనదేశంలో జరుగుతున్న విప్లవం అంటే సానుభూతి పోతుంది. స్కార్లెట్ పింపర్నల్ అంటే ఆమెకు అభిమానం కలుగుతుంది. పెర్సీ దంపతు లిద్దరూ ఆరాత్రే లండన్ వెళ్లిపోతారు. లార్డ్‌టోనీ, ఆండ్రూ స్కార్లెట్ పింపర్నల్ అనుచరులని తెలుసుకున్న షావలిన్ ఆరాత్రే వారిని బంధించి, కొన్ని రహస్యకాగితాలు స్వాధీనం చేసుకుంటాడు. వెంటనే షావలిన్ లండన్ చేరుకొని మార్గరెట్‌ను ఒక నాటకశాలలో కలుసుకుంటాడు. ఆమెసోదరుడు ఆర్మండ్ పెద్దప్రమాదంలో చిక్కుకున్నట్లు తెలుపుతాడు

8

లార్డ్ గ్రెన్విల్ విందుకు వచ్చిన అతిథుల నందరిని పలకరిస్తూ, మార్గరెట్ చలాకీగా కలయతిరిగింది. మార్గరెట్‌ను, మార్గరెట్ ఉడుపులను, ఆభరణాలను అందరూ ప్రశంసించటమే. అదే మరొకనాడయి ఉంటేనా, ఆమె ఆనందానికి అంతే ఉండేదికాదేమొ!

నిమిషం తరువాతనిమిషం గడుస్తున్నకొద్దీ ఆమె మనస్సులోని ఆందోళన అధికంకాసాగింది. ఆర్మండును తలచుకొని తలచుకొని కుమిలిపోయింది.

ఆర్మండు ఎంతపనిచేశాడు. ఇందుకా ఇప్పుడు తానెంత వద్దంటున్నాకూడా వినిపించుకోకుండా పారిస్ వెళ్ళినది? అనవసరంగా పోయి షావలిన్ చేతుల్లో చిక్కుకున్నాడు. ఇప్పుడు అతని చావు బ్రతుకులు షావలిన్ దయాధర్మాలపయిన ఆధారపడిఉన్నాయి. వాడు వట్టి కిరాతకుడు - కఠినాత్ముడు. దయ అనేది వాడికి ఏకోశానా లేదు. ఏదయినా ఒక పరమాద్భుతం జరిగి గారడీలోలాగా ఈ కష్టమంతా విరిసిపోతే, చిక్కులన్నీ సర్దుకుంటే ఎంత బాగుంటుంది?

పారిస్‌లో ఆర్మండ్ ఈపాటికి ఏమి చేస్తుంటాడో? ఎక్కడ ఉంటాడో? ఒక్కగానొక్కడు తనకు తోడబుట్టినవాడు. ఈ జన్మకి అతడొక్కడే తనకు నా అని చెప్పుకోవటానికి ఉన్నవాడు. ఇలా తీవ్రంగా యోచిస్తూ మార్గరెట్ అపరిమితంగా వ్యథపడసాగింది.



గుసగుసలు

ఫొటో: ఆర్. బాపనయ్య—రాజమండ్రి.

ఈమాటే అంటే "పెర్సీలేడూ?" అన్నాడు ఆర్మండ్. పెర్సీ!-ఉండి ఏంచేస్తాడు? తనకు వచ్చిన ఈ విపత్తులో పెర్సీ ఆదుకుంటే బాగుండును అనుకున్నది కాని మార్గరెట్ నోరువిప్పి అతనితో చెప్పకోలేదు. పెర్సీ తనను సరిగా ప్రేమించటం లేదని, ఎందుచేతో తనకు దూరంగా తొలగిపోతున్నాడని మార్గరెట్ అనుకున్నది.

ఆమె ఇలా మథనపడుతుంటే, ఇవతల పెర్సీ కులాసాగా తనవంటివారిని మరొకపదిమందిని పోగుచేసి బాతాఖానీ వేస్తున్నాడు. ఉండుండి వారందరు కలిసి ఒకగేయాన్ని మహా శ్రద్ధగా వల్లించి, హుషారుగా పాడటం మొదలుపెట్టారు. ఆనోటఆనోట పడి ఆగేయం ఈచివరినుండి ఆచివరిదాకా ప్రాకింది.

మార్గరెట్ కాలుగాలిన పిల్లిలాగా అటు, ఇటు తిరుగుతూ ఏప్రక్కకు పోయినా, ఆగేయమే తరుముకు వచ్చి చెవిని పడసాగింది. ఆమె మహాచిరాకు పడిపోయింది.

ఇంతలో వేల్సుయువరాజు ఆమెను పిలిచి, "మీ ఆయన కవిత్వంకూడా అల్లుతున్నాడే! ఎట్లా ఉంది మీ ఆయన వ్రాసిన గేయం?" అని అడిగాడు. మార్గరెట్ ఒక చిన్ననవ్వు నవ్వి తప్పించుకున్నది.

ఇంతమంది పాడుతున్న ఆగేయం, లండన్ మందమతి సృష్టించిన ఆగేయం ఇది:

"ఇక్కడ ఉన్నాడిడుగో! అనుకొని,
అక్కడ ఉంటాడడుగో!" అనుకొని,
ఎక్కడ పడితే అక్కడ వెతికాం— ఎవడా
స్కార్లెట్ పింపర్నల్?"

వారంతా అసలే దీనిని వన్నెలు చిన్నెలుగా పాడుతున్నారు. పావలిన్ ఆప్రక్కగా దగ్గరలో ఉన్నట్లయితే, జోరుమరీ ఎక్కువ అవుతున్నది. ఇది విని పావలిన్ లోలోన ఎంతగా ఉడుక్కుంటున్నాడో కాని, పైకిమాత్రం ఏమీ తొణకటంలేదు. తనను కాదులెమ్మన్నట్లు తిరుగుతున్నాడు.

మార్గరెట్ చివరకు మనసు రాయిచేసుకున్నది. తన చేతిలో ఏముంది. ఏది ఎలా జరగవలసిఉన్నదో అలాగే అవుతుంది అని వేదాంతంలో పడింది.

సర్ ఆండ్రూ, లార్డ్ ఆంటోని అనుకున్నట్లే హడావిడిగా వచ్చారు. ఇద్దరిముఖాలు వాడిపోయి ఉన్నాయి. సర్ ఆండ్రూ రావటంతోనే సుజేన్ కోసం వెతికాడు. సుజేన్ కనిపించగానే ప్రక్క వరండాలోకి దారితీశాడు.

సుజేన్ ఆండ్రూ మాట్లాడుకుంటూ ఉండటం మార్గరెట్ కంటబడింది. వారిద్దరికీ వివాహం జరిగితే ఒకరికొకరు ఈడుజోడు అనుకొని సంతోషించింది.

సుజేన్ ఈమధ్య కొంచెం ఉత్సాహంగా ఉంటున్నది. సుజేన్‌కు, కౌంటెస్‌కు, వైకౌంట్‌కు ఒకటే దిగులు. తాము సుఖంగా బయటపడ్డారు. కౌంట్ కూడా ఇవతలపడితే చాలునని వెయ్యి దేవుళ్ళకు దండాలు పెడుతున్నారు. కౌంట్‌ను కొద్దిరోజులలోనే తప్పకుండా పారిస్‌నుండి తప్పించుకు రాగలమని స్కార్లెట్ పింపర్నల్ సమితివారు అభయమిచ్చారు. వికసించిన ముఖంతో పరుగెత్తుకొనివచ్చి, సుజేన్ ఈవార్త మార్గరెట్‌కు వినిపించింది అంతకుముందే. పాపం! ఇతరులను ప్రమాదంలోనుండి తప్పించవలసిన పింపర్నలే ఇప్పుడు ప్రమాదంలో చిక్కుకోబోతున్నాడన్న సంగతిఆమెకు తెలియదుగదా!

విందుకు ఇంతమంది వచ్చారు. ఇందులో ఎవరో స్కార్లెట్ పింపర్నల్ అయిఉండాలి! ధైర్యసాహసాలతో చాకచక్యంగా ఈ కార్యక్రమమంతా నడిపిస్తూ, అందరి గౌరవాభిమానాలను చూరగొన్న ఆ మహా వ్యక్తి ఎవరో కదా!

మార్గరెట్ కొంతసేపు షావలిన్ మాట మరిచిపోయింది. ఆర్మండ్‌కు వచ్చిన ప్రమాదంమాట మరిచిపోయింది. తన్నుతాను మరిచిపోయింది. ఇన్నాళ్ళూ తాను ఊహించుకుంటున్న ఆ వ్యక్తి ఎలాఉంటాడో చూస్తే స్వర్గంమోక్షం దొరికినంత అనిపించింది.

గుండ్రటి ముఖంవారు, కోలముఖంవారు, సన్నటివారు, లావుపాటివారు, రకరకాలవారు అక్కడ సమావేశమైనారు. వారిందరివంకా కుతూహలంతో చూచింది.

వేల్సుయువరాజే స్కార్లెట్ పింపర్నల్, మరెవ్వరో కాదు అని వారూ వీరు అనుకోవటం ఆమె ఒకటి రెండుసార్లు విన్నది. కాని ఆ పుకారులో ఆమెకు నమ్మకం కుదరలేదు.

"ఒకవేళ ఆండ్రూయేనా ఏమిటి?" అని కూడా అనుకున్నది. కాని సుజేన్‌లాంటి అమాయికపు పిల్ల చూపులలో కరిగిపోయిన ఇటువంటివాడు పింపర్నల్ ఎలా కాగలడని సమాధానపరచుకున్నది.

ఆండ్రూ తలపునకు రాగానే, ఆనాడు అతనిని వెంబడించి, అతడు ఎవరెవరితో మాట్లాడుతాడో చూడవలసి ఉన్నదన్న విషయంకూడా గుర్తువచ్చింది.

సుజేన్‌తో మాట్లాడటం ముగించి, ఆండ్రూ అక్కడినుండి బయలుదేరాడు. హాలుదాటి వరండాలో ఇంకొక ప్రక్కకు పోయి, అక్కడ గోడకు ఆనుకొని నిలబడ్డాడు. మార్గరెట్ అతని ముఖకవళికలు శ్రద్ధగా పరిశీలించింది. అతడు చాలా ఆదుర్దాగా అటూ ఇటూ చూస్తున్నాడు. ఇంతలో లార్డ్ హేస్టింగ్స్ హడావిడిగా వచ్చి ఆండ్రూను రాసుకుంటూ నడిచిపోయినాడు. హేస్టింగ్స్ ఆండ్రూకు చిరకాలమిత్రుడు. అయినప్పటికీ అతనిప్రక్కగా పోతూకూడా ఒక్కమాట మాట్లాడలేదు.

ఇందులో ఏదో కిటుకుఉన్నదని మార్గరెట్ భావించింది. హేస్టింగ్స్ వడివడిగాపోతూ ఏదో ఆండ్రూ చేతికి ఇచ్చిపోయినట్లు ఆమె కనిపెట్టేసింది. అది ఒక కాగితంముక్క. ఆండ్రూ అక్కడికి వచ్చి నిలబడటం హేస్టింగ్స్ కాగితంముక్క ఇచ్చిపోవటం అంతా ఒక్క క్షణంలో జరిగిపోయిన సంఘటన.

ఈ సన్నివేశంతో మార్గరెట్ మనసులో కలవరం కలిగింది. కొన్నాళ్ళుగా అవసరంలేక ఉపయోగించకుండాఉన్న తెలివితేటలు పనిచెయ్యటం మొదలుపెట్టినాయి. తన సోదరుని ప్రాణం కాపాడుకోవటానికి భగవంతుడు ఏదో దారిచూపిస్తున్నాడని, అందుచేతనే ఈ దృశ్యం తనకంట పడిందని ఆమె దృఢంగా తలపోసింది. హేస్టింగ్స్ఇచ్చిపోయిన కాగితంలో ఏమివ్రాసిఉన్నదో గనుక తెలుసుకోగలిగితే చాలుననుకున్నది.

ఆమెకు పదిహేను, ఇరవైఅడుగుల దూరంలో ఆండ్రూ ఉన్నాడు. ఆ ఆండ్రూచేతిలో ఒక చిన్న కాగితంముక్క ఉన్నది. ఆ కాగితంలోనే ఉంటుంది బహుశా తన సోదరుని ప్రాణము! అదృష్టవశాత్తు దొరికిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవటంలోనే ఉన్నది తన తెలివితేటలసార్థకం, అని ఆమె నిశ్చయించుకున్నది.

ఆండ్రూ మెల్లిగా ఆ ప్రక్కనేఉన్న ఒక గదిలోనికి వెళ్లాడు. ఆ గదిలోమధ్యన ఒక టేబిల్ మీద కొవ్వ

దీపాలు వెలుగుతున్నాయి. ఆ దీపపు వెలుగులో అతను ఆ కాగితం చదవటం ఆరంభించాడు.

మార్గరెట్ సద్దుచెయ్యకుండా గదితలుపు దగ్గరకు వెళ్ళింది ఆండ్రూ అటుతిరిగి ఉన్నాడు. ఇంకా దగ్గరకు వెళ్ళింది. కాని ఇంతలోనే ఆండ్రూ వెనుకకు తిరిగి ఆమెను చూశాడు.

ఆండ్రూకు ఏమాత్రం అనుమానం కలిగినా ఆమె చేస్తున్న సర్వ ప్రయత్నమూ నాశనమైపోతుంది. అందుచేత, అతడు తిరిగిచూడగానే ఆమె "అబ్బబ్బబ్బ! నాకేం వికారంగాఉన్నది. కళ్ళు తిరుగుతున్నాయి." అంటూ క్రింద పడిపోయేదానిలాగా తూలింది.

ఆండ్రూ ఒక్క ఉదుటున వచ్చి పడిపోకుండా ఆమెను పట్టుకున్నాడు. మెల్లిగా తీసుకొని వెళ్ళి అక్కడ ఉన్న ఒకకుర్చీలో కూర్చోబెట్టాడు. "ఏమిటి? మీకు ఒంట్లో కులాసాగా లేదా? సర్ జెర్విస్‌కి కబురు చెయ్యనా?" అన్నాడు తత్తరపడుతూ. అతని చేతులో ఉన్న కాగితం గాలికి రెపరెప కొట్టుకుంటున్నది. ఆమెగుండె అంత కంటె ఎక్కువగా కొట్టుకుంటున్నది.

"మరేమీ లేదు సర్ ఆండ్రూ! ఇందాకటినుండి అక్కడ ఉక్కలో కూర్చున్నాను? ఒకటేవికారము తల తిప్పటమూను. ప్రాణం పోతుందేమో అనిపించింది. ఇప్పుడు ఫరవాలేదు. ఇక్కడ కాస్త చల్లగా వంటికి గాలితగులుతున్నది. అబ్బ! పోయినప్రాణం లేచివస్తున్నది." అన్నది కళ్ళుమూసుకుని వెనకకు చేరగిలబడుతూ.

కళ్ళు మూసుకుంటే ఆమెకు ఆర్మండ్ కనిపిస్తున్నాడు. సర్ ఆండ్రూకు ఏమిచెయ్యాలో తోచటం లేదు. ఆమె కళ్ళుమూసుకొనిఉన్నది. కాబట్టి ఇదే సమయం ఆ కాగితంముక్క తగలబెట్టాలి అనుకున్నాడు. చల్లగా కాగితం కొవ్వువత్తిమంటమీద పెట్టాడు. కాగితం ఒకమూల అంటుకున్నది.

ఇలాంటిదేదో జరుగుతుంది అని ముందుగానే తెలిసినట్లు మార్గరేట్ కళ్ళు తెరిచి చూచింది. ప్రమాదం గుర్తించింది. అమాంతం లేచి ఆ కాగితం లాక్కుని మంట ఊదేసింది. అనుకోకుండా జరిగిన ఈ సంఘటనకు ఆండ్రూ నిర్ఘాంతపోయినాడు.

"మార్గరెట్ బ్లాకెనీ! నా కాగితం!" అంటూ ముందుకు వచ్చాడు.

మార్గరెట్ చేతులో ఉన్న కాగితంమంట ఆరిపోయింది. సన్నగా కొంచెం పొగవస్తున్నది. ఆ కాగితం ముక్కుదగ్గర పెట్టుకొని వాసన చూసింది.

"భలే! సమయానికి గుర్తు వచ్చిందే నీకు! ఈ వికారానికి, దీనికి, కాగితం కాల్చినపొగ ఎంతమంచిదను కున్నావు?" అన్నది. ఆర్మండ్‌ను ప్రాణదానం చెయ్యగల ఆ కాగితం చేతులలోనే ఉన్నది. కాని చదవటం ఎలా?

సర్ ఆండ్రూ స్తబ్ధుడై కళ్ళప్పగించి చూస్తూ నిలబడ్డాడు. మార్గరెట్ చేతిలో ఉన్న కాగితం లాక్కోవాలని కూడా అతనికి తోచలేదు. ఆ కాగితంలోని విషయం బయటపడితే, తమ నాయకుని ప్రాణాలకు ముప్పు రావచ్చునన్న సంగతికూడా అతనికి ఆ నిముషాన స్ఫురించలేదు.

మార్గరెట్ పక పక నవ్వటం మొదలుపెట్టింది. "ఏమిటి సర్ ఆండ్రూ! అలా చూస్తున్నావు. ఫరవాలేదు. వికారం గికారం తగ్గిపోయింది. మళ్ళీ మామూలుగా ఉన్నది." అంటూ ఏమిటేమిటో ఇష్టం వచ్చినట్లు చెప్పుకు పోవటం మొదలుపెట్టింది—

సర్ ఆండ్రూకు బుర్ర పనిచెయ్యటం మొదలు పెట్టగానే ఆమె క్రిందపడిన మాట గుర్తువచ్చింది. మార్క్విస్ సెంట్ కర్ కు మరణశిక్ష వేయించిన సంగతి గుర్తువచ్చింది. కంగారుపడిపోయినాడు. ఎలాగా ఆ కాగితం చేజిక్కించుకోవటం అని ఆలోచిస్తూ సతమతమైనాడు.

మార్గరెట్ ఇంకా నవ్వుతూ మాట్లాడుతూనే ఉన్నది

"ఏమిటి అలాగే నిలబడిపోయినావు? నా కేం పోగాలం. నేను గ్రహించలేక పోయినాను. నేను ఇక్కడికి రావటం నీకు ఇష్టంలేదట్లే ఉన్నది. నీ నా కాగితం కాలుస్తుంటే నా వైద్యంకోసమేమో అనుకున్నాను. కాదన్నమాట..... ఓహో! అదా సంగతి? తెలిసింది. తెలిసింది. మీ కాగితం ఆవిడ వ్రాసిన ఉత్తరమా ఏమిటి? ఏం వ్రాసిందేమిటి? భయపడకు. నేను చూడనులే"

ఇక లాభంలేదనుకున్నాడు ఆండ్రూ. "ఏదో ఒకటి లెద్దూ! అది నా స్వంతవిషయానికి సంబంధించిన కాగితం ఇలా ఇచ్చేస్తే సంతోషిస్తాను" అంటూ లాక్కోపటానికి మార్గరెట్ మీదికి పోయినాడు.

అతనికంటె తెలివిగలది మార్గరేట్. కాగితం రెండు చేతులతో వెనక్కెట్టుకొని, వెనుకకు రెండు అడుగులు వేసింది కొవ్వువత్తులు పెట్టిఉన్న చిన్న టేబులును పడదోయాలని త్రోసినట్లు కాక పొరపాటున జరిగి

నట్లుగా పడత్రోసింది. కొవ్వువత్తులు క్రింద పడిపోయి నాయి.

"అయ్యయ్యో! కొవ్వువత్తులు పడిపోయినాయి" అని అరిచింది మార్గరెట్—

పెద్ద ప్రమాదమేమీ జరగలేదు. ఒకటి రెండు మాత్రం ఆరిపోయినాయి. ఇంకొకటి రెండు కరిగి నేల మీద పరిచిఉన్న తివాచీకి అతుక్కున్నాయి. సర్ ఆండ్రూ వంగి గబగబ అవన్నీ తీసి, యథాప్రకారం మళ్ళీ టేబులుమీద పెట్టాడు. ఈ కొద్ది సెకండ్లలోనే మార్గరెట్‌కు ఒకసారి ఆ కాగితంవంక చూసే అవ కాశం దొరికింది.

ఆ కాగితంమీద గజిబిజదస్తూరిలో ఒక డజను మాటలున్నాయి కింద ఒకప్రక్కగా ఎఱ్ఱసిరాలో ఒక నక్షత్రంలాంటి పువ్వు ముద్ర వేసిఉన్నది.

మార్గరెట్ ఏమి చేస్తున్నదో అన్న అనుమానం కొద్దీ ఆండ్రూ ఆమెవంక తిరిగిచూచేసరికి, ఆమె ఆ కాగితం ఇందాకటిలాగానే వెనుకపెట్టుకొని ఎదురు ఎదురుగా చూస్తూ నిలబడిఉన్నది.

మార్గరెట్ మెల్లిగా కాగితం జారవిడిచింది. ఆండ్రూ ఆదుర్దాగా దాన్ని ఏరితీశాడు. గుప్పిట్లో గట్టిగా బిగించిపట్టుకొని నిట్టూర్పు విడిచాడు.

మార్గరెట్ పరదాగా తలవంకిస్తూ అన్నది "సర్ ఆండ్రూ! నీ వ్యవహారం ఏమీ బాగాలేదు. సుజేన్‌ను ఏమీ తెలియని అమాయకమైన దానిని చేసి ఆడిస్తున్నావు. మీ మగవారంతా ఎప్పుడూ ఇంతే. ఎవరయినా ప్రియురాలి ఉత్తరాలు దాచుకుంటారు. నీవు ఏకంగా తగలబెట్టుతున్నావు. అవునులే! నీ స్వంత విషయం. నీయిష్టం తగలబెట్టు."

ఆ కాగితాన్ని సర్ ఆండ్రూ సన్నగా మట్టి మలిచాడు. ఏకదీక్షగా కొవ్వువత్తిదగ్గర నిలబడి ఆ కాగితం తగలబెట్టాడు. ఇవతల మార్గరెట్ ముఖంలో ఏదో ఉత్సాహం, ఆనందం ఉండటం అతడు గమనించ లేదు. ఆమె చూడకుండా తన కాగితం తనకు చేరింది కదా అన్న సంబరంలో మునిగిపోయినాడు. ఆ సమ యంలో అతడే గనుక మార్గరెట్ ముఖం చూచిఉంటే, ఆ సంబరంగింబరం ఎగిరిపోయేది.

కాగితం మొత్తం కాలిపోయింది. కింద బూడిద అయి పడిన కాగితాన్ని మడమతో తొక్కి నేలకు రాచాడు.

"సరే, సర్ ఆండ్రూ, కిందికి అలా వెళ్దాంరండి- సంగీతం చాలా బాగాఉన్నది. వెళ్ళి విందాం." అన్నది మార్గరెట్. సర్ ఆండ్రూ మాట్లాడకుండా ఆమె వెనక పడి నడిచాడు. అమితోత్సాహంతో మార్గరెట్ దారి తీసింది.

(ఇంకా వుంది)

అల్లరి పిల్లలు



6. బండరాముడు

బండరాముడు అంటే వాడి అసలు పేరు కానేకాదు. వాడు బడిలో సంపాదించిన బిరుదు. నాలుగో క్లాసులోకి వాడు వచ్చి మూడేళ్లయింది. మరి ఇంకా ఎన్నేళ్ళు ఉంటాడో ఆ దేవుడికి తెలియాలి.

బండరాముడు తన క్లాసులో అందరికంటే పెద్దవాడు. వాడు ఎవ్వరినీ లక్ష్యపెట్టడు. పంతులు గారికి ఎదురు తిరుగుతాడు. క్లాసులో పిల్లలందరినీ ఏడిపిస్తాడు.

ఒకనాడు వాడు శంకరందగ్గరకు వెళ్ళి, "మంగళగిరికొండ చూపిస్తాను. చూపించనా?" అన్నాడు. శంకరం చిన్నవాడు. వాడికి అదేమిటో తెలియక "ఏదీ,చూపించు." అన్నాడు. అపళాన బండరాముడు వాడి రెండు చెవులూ పట్టుకొని పైకి ఎత్తాడు.

"ఏరా శంకరం! కొండ కనిపించిందా?" అన్నాడు.

శంకరచెవులు ఎఱ్ఱగా కంది పోయినాయి. గిలగిల కొట్టుకున్నాడు. "నన్ను దింపు, దింపు" అని కేకవేస్తూవడ్చాడు కాని రాముడు దింపలేదు. "కనిపించిందా లేదా చెప్పు." అన్నాడు. వాడు నొప్పికి తట్టుకోలేక "కనిపించిందిలే." అని ఒప్పుకున్నాడు. తరువాతగాని వాడు శంకరాన్ని దింపలేదు.

ఇదీ వరస వాడితో. తక్కిన వారందరూ వాడికంటె చిన్నవాళ్ళు కావటంచేత ఏమీ అనలేకపోయినారు. దానితో వాడు మరీ రెచ్చిపోయినాడు.

మాధవుడు వింతసులోచనాలు తీసుకొనిపోయి తాతకి ఇచ్చేసిన తరువాత, రాముడి రోగం కుదిర్చేటందుకు ఏదయినా ఉపాయముండున్నదేమో కనుక్కుందామని అను గుదామనుకున్నాడు. మెల్లిగా తాతదగ్గరకు వెళ్ళి, రాముడి సంగతి చెప్పాడు. "తాతా! రాముడితో మేమంతా పడలేక చచ్చిపోతున్నాం. ఏదన్నా ఒక ఉపాయం చెపుదూ!" అని అడిగాడు.

తాత ఒకనిమిషంసేపు ఆలోచించి "నీ సులోచనాలతో వాడిని చూశావా? ఎలా కనిపించాడు?" అని అడిగాడు.

"లేదు తాతా! ఆనాడు వాడు బడికి రాలేదు. ఎప్పుడూ బడిఎగకొడుతూనే ఉంటాడు. వాడేగనక ఆనాడు వచ్చిఉంటేనా, నా చేతిలోని సులోచనాలు ఎగరేసుకుపోయేవాడు!"

"ఏమీ లేదురా మాధవుడూ! వాడిని ఎవరూ ఏమీ అనలేరని వాడి ధైర్యం. అంతే కాదూ? వాడు తక్కినవాళ్ళని ఎలా ఏడిపిస్తున్నాడో, అలా ఒక్కసారి వాడికి జరిగితే చాలు. సరే. ఒకపని చెయ్యి. రేపు బడికి పోయ్యేముందు నాదగ్గరకు రా. నేనొక బిళ్ళ ఇస్తాను. అది తీసుకుపో. వాడి తిక్క కుదర్చవచ్చు." అన్నాడు తాత.

"ఏం బిళ్ళఅది? అది తీసుకుపోయి ఏమి చెయ్యాలి?" అని అడిగాడు మాధవుడు.

"రేపు రా! చెప్తాను."అన్నాడు తాత.

బడికి పోయేముందు మాధవుడు తాతదగ్గరకు వెళ్లాడు. తాత ఒక పెట్టె తీసి ఒకబిళ్ళ చూపించాడు. "ఇది చాలా రుచిగా ఉంటుంది తింటానికి. తినవచ్చు." అని చెప్పాడు.

"బడికి వెళ్లినతరువాత రాముడిని కనిపెట్టిఉండు. ఒకవేళ ఇవాళ కూడా వాడు ఎవరినయినా ఏడిపించాడనుకో. వెంటనే ఈబిళ్ళ తీసి నోట్లో వేసుకో. తక్కినదంతా నీకే తెలుస్తుంది."

మాధవుడు ఆశ్చర్యపోతూ, ఆబిళ్ళ జేబులో పెట్టుకొని బడికి వెళ్లాడు. ఇంకా గంటకొట్టలేదు. రాముడు



ఆటవిడుపు

ఫోటో : ఎ. వి. ప్రసాద్ — విజయవాడ.

★ అల్లరి పిల్లలు ★

ఆ వాడు పెందలకడనే వచ్చాడు. మాధవుడు తరగతి గదికి చేరుకునేసరికి వాడు ఒకచిన్న పిల్లడిని పట్టుకొని, తొడ మెలిపెడుతున్నాడు. వాడుపాపం గిలగిల కొట్టుకున్నాడు. తక్కిన పిల్లలంతా దిగాలుపడి చూస్తున్నారు ఏమీ చేయలేక.

మాధవుడు చేతులోఉన్న పుస్తకాలనంచి అక్కడ పడేసి,ముందుకు వచ్చాడు."ఏమి రాముడూ! వాడిని విడు" అన్నాడు. రాముడిని అలా వాడు ఎదిరించేసరికి అందరూ ఆశ్చర్యపోయినారు. రాముడు కూడా ఎంతో ఆశ్చర్యపడ్డాడు. తకీమని విడిచిపెట్టాడు. వాడు ఏడుస్తూ పారిపోవటానికి ప్రయత్నంచేశాడు. కాని ఇంతలో రాముడు వాడి కాలు తొక్కిపట్టి, "నేను విడిచిపెట్టను. ఏం చేస్తావేం?" అన్నాడు.

"ఏం చేస్తానా?" అంటూ మాధవుడు చొక్కాచేతులు పైకిమడిచాడు. జేబులోఉన్న బిళ్ళతీసి నోట్లో వేసుకున్నాడు. నిలుచున్నవాడు నిలుచున్నట్లు ఎగిరి, రాముడిమీదికి దూకాడు.

"ఇదేమిటి ఇవ్వాళ మాధవుడు రోజూ ఉండేమాధవుడిలాగా లేడే!" అనుకున్నారు అందరూ. ఆ బిళ్ళ నోట్లో వేసుకోవటంవలన వాడికి అమితమైన బలంవచ్చిందని ఎవ్వరికీ తెలియదు. ఆఖరుకు ఆ సంగతి మాధవుడికే తెలియదు.

అలా ఎగిరిదూకిన మాధవుడు కుడిచేతితో రాముడితొడ పట్టుకున్నాడు. తొడపాయసం పెడుతున్నాడు. రాముడు గిలగిల గింజుకున్నాడు. రెండు చేతులతో మాధవుడిని అవతలికి నెట్టాలని ప్రయత్నం చేశాడు. కాని వాడివల్ల కాలేదు.

"ఏమిరా! చిన్నపిల్లలని చేసి అందరినీ ఏడిపించగలననుకున్నావా? చూడు గిచ్చటమంటే ఏమిటో, నేను చూపిస్తా" అంటూ మాధవుడు హుంకరించాడు. రాముడికి కళ్ళ వెంట నీళ్లువస్తున్నాయి.

"ఒరేయ్! ఒరేయ్! మాధవుడూ నీకు దండం పెడతా! నన్ను విడిచిపెట్టు. నేను ఎప్పుడూ ఎవరిజోలికి పోను. ఒట్టు." అని మొత్తుకున్నాడు రాముడు.

"అయితే సరే. నీవు ఎవరెవరిని ఏడిపించావో వారిని అందరినీ పిలిచి దండాలుపెట్టు" అని ఆజ్ఞాపించాడు మాధవుడు

వాడు చెప్పినట్లే చేశాడు. అప్పుడుమాధవుడు వాడితొడ విడిచిపెట్టాడు. "జాగ్రత్త! తెలిసిందా? నిన్నుగిచ్చితే నీకు ఎంత నొప్పో, తక్కినవాళ్ళకుమాత్రం అంతనొప్పి ఉండదూ? మహా నేనేగదా పెద్దవాడిని. నన్ను ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగకు. అందరితో కలిసి, మెలిసి సఖ్యంగా ఉండు" అని మాధవుడు సలహా చెప్పాడు. "అట్లాగే" అని బుర్రఊపాడు.

కొన్నాళ్ళపాటు రాముడింకా ఎవ్వరినీ ఏడిపించలేదు. ఆ తరువాత

ప్రాణాలొడ్డిన పందెము

మూలం: ఆండ్రూ స్కాట్లండ్ అండ్ మెకంజీవుడ్

అనువాదం: పి. యస్. రామజోగారావు

సమయం సాయంకాలం. స్థలం స్విట్జర్లాండు. శీతలదేశం అవడంచేత పొగమంచు అప్పుడే తెరలు తెరలుగా వ్యాపించింది. అప్పుడు ఆ దేశంనుంచి ఇటలీకి వెళ్లే ఒకరోడ్డు మీదుగా ఒక మోటారుకారు పోతూంది.

మోటారును నడుపుతూన్న అతని పేరు హాన్స్ వాన్ స్టక్. ప్రపంచప్రసిద్ధిచెందిన అనేక మోటరుపందాలలో గెలుపొందినవాడు. మోటారు రేసులందు చాలా వేగంగానడపగల శక్తిఒక్కటేకాక, సాధారణంగా పోటీదారులు ఎదుర్కొనే ప్రమాదాలను తప్పించుకోగల మెలకువగలవాడు. కొండదారులందును, మలుపులందును కారును నడపడంలో అతని కతడే సాటి. ఎంత ఆజానుబాహుడో అంత ఉదారహృదయుడు కూడా.

ఈసారి అతను ఇటలీలోని క్యూరియో అనుచోట జరిగే పందాలలో పాల్గొనేందుకు, ముందుగానే తన రేసుకారు అక్కడికి పంపి, తను, ఒక సహాయకుడితో మరో మామూలు కారులో అక్కడికి బయలుదేరాడు. జర్మనీనుంచి ఇటలీకి స్విట్జర్లాండుమీదుగా పోతూ, సెంట్ మ్యారిస్ అనేపట్టణం చేరేసరికి వారికి కొందరు సైనికులు తారసిల్లారు. ఇటలీకి పోయే రైలు, రోడ్డుమార్గాలు పర్వతాలక్రిందుగా ఒకదానొకటి అంటిపెట్టుకుని పోతూండడం మూలాన, కొండలనుంచి విరిగిపడ్డ మంచు బండలు, రాళ్లు, క్రింద ఉన్న రైలు, రోడ్డుదార్లమీదికి దొర్లి రైళ్లు, కార్లు, వెళ్ళడానికి వీల్లేకుండా చేశాయని వారు చెప్పారు. ఆమాటలు విని హాన్స్, క్యూరియో చేరడానికింకా టైముండటంచేత కొంచెం దూరమైనా మరోదారికి తన కారును మళ్ళించాడు.

కాని అతని కారు కొంతదూరం ప్రయాణించి ఒకగ్రామం చేరుకునేసరికి, అక్కడ కొందరు జనం, వాళ్ళమధ్య ఆందోళన వెల్లడిస్తూన్న ఒకస్త్రీ కనిపించారు. వాన్ స్టక్ ఆమె ఆందోళనకు కారణం అడిగితే తేలిన కథఇది—

ఆమె నివాసస్థలం ఇటలీలోని ట్యూరిన్ నగరం. కూతురుకి చాలా జబ్బుగా ఉండడంచేత, జబ్బును నయంచేసేమందు అక్కడ దొరక్కపోవడంచేత, ఆమె ఆ ఉదయమే మందుకోసం స్విట్జర్లాండు చేరి మందు సంపాదించి తిరా మరలిపోదామనుకునేసరికి ఇటలీకి పోయే దార్లన్నీ బందైనాయని తెలిసింది

"ఈ రాత్రి పన్నెండుగంటల లోగా మందుతో నేనింటికి చేరకపోతే నాకూతురు మరి బతకదు..." అంటూ, మందున్న సంచీని ఎంతో జాగ్రత్తతో పొదివిపట్టుకుని, ఆమె కళ్ళనీరు పెట్టుకుంది.

"రెండు, మూడురోజులవరకు రైళ్ళు నడవవుకాబోలు" ఆ గుంపులోని మనుష్యుడొకడన్నాడు.

"పాపం ఆమె అద్దెకు తీద్దామన్నా ఈ చుట్టుపట్ల విమానంలాంటిదేం దొరకదు" అన్నాడు మరొకడు.

వాన్ స్టక్ ఆలోచిస్తున్నాడు. ఆ వూరినుంచి ట్యూరిన్ చేరడానికి అతి దగ్గరదారే 250 మైళ్ళదూరం ఉంది. అదిగాక అప్పటికే సాయంకాలం ఆరుగంటలయింది.

"రైళ్లే బందైనప్పుడు కార్లు మాత్రం వెళ్లేదేమిటి"

ఒకనాడు మళ్ళీ, ఒకచిన్నపిల్లవాడిని, చెవి మెలివేయటానికి సిద్ధపడ్డాడు కాని ఇంతలో ఏమయిందో తెలుసా? ఆ బిళ్ళ మాహాత్మ్యమేమిటోగాని, వాడి చెవిమెలేయబోయిన రాముడిచెవి ఎవరో మెలివేసినట్లయింది. రాముడు లబో, దిబోమని కొట్టుకుంటూ ఆపేశాడు.

ఆ తరువాత క్రమంగా రాముడు తన అల్లరి మానుకున్నాడు: మీలో ఎవరైనా రాముడిలాంటివారున్నారా ఏమిటి? జాగ్రత్త. మాధవుడు బిళ్ల నోట్లో వేసుకొని మీదగ్గరకు రాకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు అటువంటివాళ్లు తమకంటె పెద్దవాళ్ళ చేతిలో చిక్కకపోరు. ★

—ము వీ....

★ ప్రాణాలొడ్డిన పందెము ★

... అని ఒకడు గుంపులోంచి వాన్‌స్టక్ కారును అదోలా చూస్తూ అనేసరికి, అతనికి ఆమాట ఒకసవాలులా తోచింది. వెంటనే ఆమెతో ఇలా అన్నాడు.

"అభ్యంతరం లేకపోతే మీరు మాతో కారుమీద రాకూడదా అమ్మా? మేంకూడా ట్యూరిన్ వెళ్తున్నాం. అదృష్టంకలిసొస్తే 12 గంటలులోపుగానే చేరగలం."

అన్నాడేకాని అతని గుండె బితుక్కుమంటూంది. ఎంచేతనగా అలా చేరడమంటే, తను, యూరపులోకల్లా అతిపెద్దవైన, నిర్మానుష్యమైన పర్వతాలలో, కరుగుతూన్న మంచుచే కప్పబడి, అప్పుడప్పుడు మంచుబండలు విరిగిపడే రోడ్లమీదుగా, గంటకి సగటున 40మైళ్ళ వేగంతో, అన్నిటికీ మించి చాలవరకు చీకట్లో ప్రయాణం చేయడమన్న మాట.

మరోదారి లేకపోవడంవల్ల ఆమె లోనికి అడుగుపెట్టగానే అతను దృఢమైన తన కారు స్టార్టు చేశాడు.

సంధించివిడిచిన బాణంలా గబయలుదేరి, అంతట్లోకే అతి వేగంతో అదృశ్యమైన ఆకారు, అక్కడ పోగయినవాళ్లందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. కాని కారులోపలివారి దృష్టి వారి వాచీముల్లులమీదే నిలపబడిఉంది. లోయలోని రోడ్లలో అనేక అవరోధాలున్నాయి. కాని వాటన్నింటినీ చాకచక్యంతో తప్పుకుంటూ గాలిలా పరుగెత్తుతూందా కారు. ఎట్టకేలకు రాత్రిసుమారు 9 గంటలు అయేసరికి వారు, ప్రసిద్ధమైన సెంటుబెర్నార్డు కనుమను చేరుకున్నారు.

వాన్‌స్టక్ తన సామర్థ్యాన్ని చూపాల్సిన సమయం వచ్చింది. ఒక పిల్లప్రాణాలు కాపాడ్డంకోసం, ఊహించరాని తికమకలతో కూడిన ఆ మార్గంలో తనకారును నడుపుతున్నాడు.

సముద్రపు మట్టానికి నాలుగువేల అడుగుల ఎత్తున పోతూ, విపరీత వేగంతో ఒకమలుపును తిరగడంలో, కారురోడ్డుమీద గడ్డకట్టిఉన్న పిండి మంచుపై ఒక్కఊపున జారుకుంది.

"ఈలోపలో మనకేదైనా ప్రమాదంవస్తే మరి నాకూతురు బ్రతకడం కల్ల" అని ఆ కుదుపుతో ఆ స్త్రీ ఆత్రంగా అరచింది.

"కాని మనం ఈపాటైనా సాహసించక ఆలస్యంగా చేరుకుంటే మాత్రం బ్రతుకుతుందా." అని జవాబిచ్చి అతడు ఎప్పటికన్న ఎక్కువవేగంతో నడపసాగాడు.

ఇలా కొంతసేపయేసరికి వారు పర్వతశిఖరం సమీపించారు. శిఖరంపై ఒకవిశ్రాంతిగృహంలో ఉండే ఘతగురువులు కొంతమంది, ఆ దార్లంటపోయే ప్రయాణీకులకు అన్నివిధాల సహాయపడుటే పనిగా పెట్టుకున్నవారు, వారిని ఆపి ఇలా చెప్పారు:

"శిఖరానికి కింది రోడ్లపై పేరుకున్న పిండిమంచు ఇంకా తీయబడలేదు కనక క్షేమంఆశించేవారైతే మీరు తక్షణం వెనక్కి తిరిగిపోవడం మంచిది."

"మేం ముందుకి వెళ్ళితీరాల్సిందే" అని వాన్‌స్టక్ ఇంకా అన్నాడో లేదో అతనికారు పర్వతపు దిగుడు రోడ్లపై పరుగెత్తసాగింది.

మనకవెన్నెట్లో రేఖామాత్రంగా కనపడే పర్వతశిఖరాలు, మంచుతో నిండిన కొండచరియలు కనుమూసి తెరిచేటంతలో మాయమవుతున్నాయి వెనక్కి. కాని వాన్‌స్టక్ కళ్ళముందు కనిపించేవి రెండేరెండు! ఒకటి దారి, రెండవది ఎక్కడో దూరాన ఉన్న పట్నంలో చావుబ్రతుకులమధ్య ఊగులాడే ఒక అమాయిక బాలికవదనం. దాని ముందు, దారిలో వున్న ప్రమాదకరమైన మంచుగోతులుగాని, పాముమెలికలుతిరిగే దారిగాని అతడు ఖాతరుచేయలేదు. ఆ పిల్లప్రాణం నిలపాలన్న దృఢనిశ్చయం అతని నైపుణ్యానికి తోడుపడడం మూలాన్నే ఒకవైపు అంతఎత్తైన కొండలు, మరోప్రక్క అంతులేని అగాధాలు మధ్యగావున్న పాపిటలాంటి దారినే అంటిపెట్టుకుపోతూంది అతని కారు.

ఇలా రాత్రి పదకొండుగంటలయేసరికి వారు మైదానమందలి సమమట్టమైన రోడ్డు చేరారు. కాని ట్యూరిన్ ఇంకా 75 మైళ్ళదూరం ఉంది. కారు ఈమాటు సుమారు గంటకి 90 మైళ్ల వేగతో పోతూంది. రోడ్డు బాగుండడం కారణాన కారు 12 గంటలకి ఇంకా 20 నిమిషాలు ముందుగానే ఆస్త్రీ ఇంటి ముందు ఆగింది.

సమయానికి మందు అందడంచేత ఆమె భర్తకు, డాక్టరుకు పెద్ద బరువు దించినట్లయింది. పిల్లప్రాణం రక్షించబడింది.

ఆ పిల్లతండ్రి వాన్‌స్టక్‌కి ఎన్నో

విధాల తనకృతజ్ఞత తెలియజేస్తూ ఇలా అన్నాడు.

"మీ ఋణం నే నేవిధంగా తీర్చు కోనేది? నా భార్య చెప్పినదాన్ని బట్టి చూస్తే మీకు మోటారుకారు నడపడంలో గల ప్రజ్ఞ తిరుగులేనిదని తెలుస్తూంది. నేను ఇక్కడ పెద్ద మోటారుకార్ల షాపుమేనేజరుని అయిఉండడంచేత మీ కేదైనా 'రేసుకారు' కావాలంటే, అడగ డమే తరవాయి..."

కాని వాన్‌స్టక్ తనకప్పటికే ఓ

ప్రాణాలొడ్డిన పందెము

'రేసుకారు' ఉండగా చెప్పడంతో అతను మళ్ళీ ఇలా అన్నాడు.

"అయితే మీరెవరు?"

"హాన్స్ వాన్‌స్టక్" అని జవాబు చెప్పాడు.

"వాన్‌స్టక్!" అతడు ఆశ్చర్యపోయాడు. "ఔను, నే నప్పుడే అనుకున్నాను; ప్రాణానికి ప్రాణం అడ్డువేసి నిర్ణీత సమయంలోగా గమ్యస్థానం చేరుకోడం మరెవ్వరికి సాధ్యమౌతుంది!" ★

కాలవాహిని

(11 వ పేజీ తరువాయి)

తాను ఇంట్లోవున్నా చిన్నకోడలును పిలచి రామయ్య డబ్బు ఇచ్చాడు.

పెహొకరోజున:

పండక్కి బట్టలు ఏమి కొనుక్కురావాలనితే అడిగితే తనకొక చీర, ఆడపిల్లలకు పరికిణీలూ, చొక్కాలూ, మగపిల్లలకు పాంట్లూ, చొక్కాలూ కావాలని తాను చెప్పింది. రామయ్య ఇవన్నీ తోసివేసి చిన్నకోడలుకొక చీర, తనకొక చీర తెచ్చాడు.

సుబ్బమ్మ హృదయం అగ్నిగోళమయింది......

* * *

"వాళ్లు వేరే వుండమంటున్నారు."

"................."

"ఉద్యోగం లేకుండా ఇక్కడ తిండం వాళ్లకు కష్టంగా వున్నది."

"................."

"నా గొడవేగాని పెదవు కదల్చలేం."

"...ఊఁ...కదిల్చాను."

"ఏమి కదిల్చావూ! నా బొంద"

"పెదవు కదల్చమన్నావుగా."

"కదిల్చి ఏమి తేల్చదలుచుకున్నావు."

"నేను తేల్చేదేమున్నది ఇంకా? నువ్వన్నావుగా."

"అంటే...."

"అంటే యేమున్నది. నువ్వే ఏదో ఒకటి తేల్చు. నా సంగతి ఎందుకులే."

"ఏమి టామాటలు?? మీరు కాకపోతే నేనా యేమిటి వేరేకాపరం పెట్టేది?"

"ఇప్పుడు వేరేకాపరం ఎట్లా పెడతామూ?"

"ఎట్లా పెడతామంటే నాకేమి తెలుస్తుంది? ఇక్కడ ఉండటం వాళ్ళకు ఇష్టం లేదు. ఉద్యోగం లేదు. జబ్బు. పైగా ఈ పిల్ల ఒకర్తె. మీకేం? మీరు ఎక్కడెక్కడో తిరుగుతూంటారు. ఇంట్లో నేనేగా వాళ్ళ చేతనన్నీ పడాల్సింది."

"నిన్ను వాళ్లు మాటలంటున్నారా?"

"అంటే.. అన్నీ వాళ్లనీ అనటం లేదు. అన్నీ నేనే కల్పిస్తున్నాను."

"నువ్వంటే అందరికీ యిష్టం. నువ్వు అదృష్టవంతురాలివి. నువ్వు ఇంట్లో కాలు పెట్టగానే లక్ష్మి ప్రసన్నమయింది."

"ఇప్పుడదంతా యెందుకూ? మనం వేరే ఇల్లు చూచుకోవాలి."

"చూచుకుందాం. తొందరపడితేఎట్లా?"

* * *

చిన్నకొడుకు వేరేకాపురం పెట్టాడు. మళ్లీ ఉద్యోగం సంపాదించుకున్నాడు. డాక్టరుదగ్గరికి వెళ్లి మందుపుచ్చుకున్నాడు.

గుమాస్తా రామయ్యగారికి ఇప్పుడు మూడవకోడలు అదృష్టవంతురాలుగా కనిపిస్తున్నది. మూడవకోడలు ఇంట్లోవుండి అందరికీ చాకిరీ చేస్తుంది. డబ్బు ఇబ్బంది వచ్చినప్పుడు మాట్లాడదు. ఉపవాసాలుంటుంది. కట్టుకు నేందుకు చీర కూడా కావాలని అడగదు.

మూడవకోడలు కారణంగా మూడో కొడుకు కూడా అదృష్టవంతుడయినాడు. అదృష్టవంతుడై నెలనెలా వచ్చే మూట యాభై రూపాయల జీతంలో పాతికో ముప్పయ్యో సొంతఖర్చులకు ఉంచుకొని మిగతా జీతమంతా రామయ్యగారికి ఇస్తున్నాడు.

విచిత్రమేమిటంటే ఎంత డబ్బు వస్తున్నా అప్పుమాత్రం అప్పుగానే ఉండిపోయింది. వడ్డీకూడా జమపడలేదు.

అవస్థలు మాత్రం మారుతున్నవి. పెద్దకొడుకు శాస్త్రి ఇల్లు కట్టించాడు. కాస్తోకూస్తో డబ్బుకూడా నిలవ వున్నదని వినికిడి. అదృష్టహీనురాలు, రోగిష్ఠి అయిన పెద్దకోడలు ఇంకా బతికేవున్నది. పెళ్ళిళ్ళకుగాని, శుభకార్యాలకు గాని వాళ్లు యిష్టమైతే వస్తారు లేకపోతే లేదు. వచ్చినా ఇతర చుట్టాలమాదిరిగానే వ్యవహరిస్తారు కాని ఈ యింటితో తమకు సన్నిహిత సంబంధం వున్నట్లు కనిపించరు.

అదృష్టవంతురాలయిన చిన్నకోడలుకు కూడా యీ జాడ్యం పట్టుకున్నది ఇప్పుడు. తాను ఇక ఎంతోకాలం గుమాస్తాగిరిలో వుండను.

రేపో మాపో విరమించుకొని పింఛను రాళ్ళతో కాలక్షేపం చెయ్యాలి. ఎకరం తరువాత ఎకరంచొప్పున ఆరెకరాల మాగాణి అమ్మివేసినప్పటి ఉత్సాహం కాని, కార్యకరామతులుచేసి చిన్నవాళ్లతోపాటు తామూ పొందగలిగిన ఆనందం కాని ఈనాడు గుమాస్తా రామయ్యదంపతులకు కలగడం లేదు.

అదృష్టవంతులెవరో? అదృష్టహీనులెవరో ఆ దంపతులకు అంతు చిక్కడం లేదు. ఆడపిల్లలు అత్తవారిళ్ళకు వెళ్లారన్న మాటే గాని ఆరునెలలకొకరు చొప్పున ఎవరో ఒకరు విడవకుండా ఇంట్లో ఉంటూనే ఉంటారు. వాళ్లకూ, వాళ్ళపిల్లలకూ అనుదినం సహా అవసరాలన్నీ సమకూర్చాలి. మూడవ కొడుకుకూడా సమ్మతిగా వేరే వెళ్లాడు. చివరివాళ్లు ఇద్దరూ ఇంట్లోనే వుంటున్నారు. వాళ్ల ఇద్దరికీకూడా ఆయన ఉద్యోగాలు ఇప్పించాడు పెళ్ళిళ్ళు చేశాడు. ఇన్ని చేసినా, ఇంకా చేయవలసిన దేదో ఒకటి ఎప్పటికీ ఎదురు కనిపిస్తున్నది. వంట్లో శక్తి తగ్గినా తిరిగి చేయవలసినవి అనేకం వుంటున్నవి. విశ్రాంతి అవసరమైన రోజులలో విశ్రాంతి అనేది లేకపోగా శ్రమ యెక్కువయింది. ఆ వేదన పడవలసి వస్తున్నది. పుట్టిన సంతానంలో ఒక్కరూ కూడా ఉపయోగపడటం లేదని కోపపడవలసి వస్తున్నది అయినా బ్రతక్క తప్పదు కనుక బ్రతుకుతున్న తనకు అదృష్టవంతులెవరో, అదృష్టహీను లెవరో నిర్ణయించే యోగ్యత లేదని గుమాస్తా రామయ్యగారు సమాధాన పడ్డారు. ఆయన భార్యకు ఈ విషయం తెలిసిరావడానికి ఇంకా ఎంత కాలం పడుతుందో?— ★

ఆఖరి తప్పు

(27 వ పేజీ తరువాయి)

పెళ్ళి చేసుకోక మరి పెళ్లి చేసుకోకపోవడమే నన్నమాట.

ఇన్: కావడంలేదా?

స్త్రీ: ఆ అబ్బాయి నాకై నామకతుర్ని ప్రేమ చేసుకొంది... నామీద అతనికున్న ప్రేమ పోతుందంటారా?

ఇన్: న్యాయంగా కొంత కాలానికి పోతుంది.

స్త్రీ: ఈ విషయంలో మీకన్న నాకెక్కువ తెలుసు. నేను చాలామంది మనుష్యుల్ని చూసేను. అందరిమీదా నాకు ద్వేషముండేది... కాని, యీ మనిషి నా మనస్సులో హత్తుకుపోయేడు...

ఇన్: నీకు అతడిమీద మోజేమో..."

స్త్రీ. అదికాదు. ఆ ముఖం, అతని మనస్సు... నాలో పరివర్తన తెచ్చేయి. పాతబతుకు తలుచుకుంటే, భయంతో ఒళ్లు వణికిపోతుంది. తిండిలేక ప్రాణం పోయినా సరే ఇంక వెనక్కి వెళ్ళలేను...

ఇన్: ఆ కుర్రాడిమీద నీకు మనసుపోతే, సింహాద్రిమీద నీ కెందుకింకా ఇది.

స్త్రీ: మీర నే మోజూ, మమకారం నాకు సింహాద్రిమీద ఉన్నాయి.. ఈ అబ్బాయిలో నాకేదో పవిత్రమైన వస్తువు దొరికింది... సింహాద్రి నా మనిషి ... నాకెంత

ఇష్టం లేకపోయినా ఆఖరుసారి చూడకుండా ఉండలేను.

ఇన్: నా జీవం అర్థంకావు... కాని ఒకందుకు సంతోషంగా ఉంది... నీలో మార్పు కలిగిందంటున్నావ్... అందుకు... (మౌనం) చూడూ... గౌరవంగా బతుకు గడపడానికెన్నో దారులున్నాయి.. నువ్వు అవలంబించిన విధానం ధర్మవిరుద్ధం... ఒక సంగతి ఆలోచించు... నీవల్ల ఎంతమంది... నీతి నియమాల్ని తప్పి... ఆత్మవిశ్వాసం... మనోబలం పోగొట్టుకొని అట్టడుక్కి పోతున్నారో నీకు నేను చెప్పనక్కర్లేదు.

స్త్రీ: ఇప్పుడు మీ మాటలు నిజమే నేమో అనిపిస్తున్నాయి వింటూ ఉంటే... మూడేళ్ళ క్రింద నా తప్పులకి ఆ శిక్ష చాలదేమో అనిపిస్తోంది...

ఇన్: నిజమైన స్థితి తెల్సుకున్నాక అలానే అనిపిస్తుంది... కాని ఒకటి చేస్తే బావుంటుంది... మిమ్మల్ని శిక్షించేకన్న, మిమ్మల్ని చెరిచిన మనుష్యులని గట్టిగా శిక్షిస్తే అంతా కట్టిపోతుంది...

స్త్రీ: ప్రపంచంలో ఎంత ప్రేమ, దయ ఉన్నాయి... ప్రపంచంలోని మగాళ్ళంతా రాక్షసులనుకొనేదాన్ని... కాని ఇవాళ్ళ... ఆయన, ఆ అబ్బాయి... ఎంత మార్పు తీసుకొచ్చేరు నాలో. నేను బృందావనం పోతాను.

ఇన్: స్వేచ్ఛ దొరికేక...

స్త్రీ: అక్కడే, ఆ కృష్ణభగవానుడి సేవ చేస్తూ మిగిలిన బతుకు గడిపేస్తాను.

ఇన్: నీ మనస్సు మంచిదే ... నాకు తెల్సు... కాని ఆ సింహాద్రిమీద నీ కెందుకంత మమకారం? వాడే దీనికంతా కారణం... నిన్నీ స్థితికి దించేడు.

స్త్రీ: ఎందుకో. ఇందాక అంతగా ఇప్పుడు సింహాద్రిని చూడాలని లేదు...

ఇన్: నిజం తెల్సుకున్నాక మాయ తెరలు విడిపోతాయి...

(కొంతసేపు మౌనం)

స్త్రీ: ఒక ప్రశ్న అడుగుతాను, ఏమీ అనుకోకుండా చెప్తారా?

ఇన్: అడుగు...

స్త్రీ: మూడేళ్ళ క్రింద మీరు నన్ను చూసేరు ... అప్పటికీ ఇప్పటికీ ఏమన్నా మార్పు కనిపిస్తోందా నాలో?

ఇన్: ఇప్పుడు నువ్వు పూర్తిగా మారిపోయేవ్ కదూ?

స్త్రీ: మనస్సు మార్పు కాదు ... ఒంట్లో ఏమన్నా మార్పు కనిపిస్తోందా?

ఇన్: నన్నెందుకడుగుతావ్ - ఆ ప్రశ్న?

స్త్రీ: ఊరికే నే...

ఇన్: నీ ముఖంలో మార్పొచ్చిందేమో అనిపిస్తోంది. అప్పటికన్న లేతగానూ, అందంగానూ ఉంది...

స్త్రీ: (సిగ్గుతో) పొగడకండి...

ఇన్: పొగడాల్సిన అవసరం నాకేమీ లేదు... చెప్పమని అడిగేవ్ కాబట్టి...

స్త్రీ: ఇప్పుడు మనస్సు తేలిగ్గా ఉంది ఎందుకో. హాయిగాకూడా ఉంది. బైట వెన్నెల ... చలి లేకుండా ఉంటే ఎంత బావుణ్ణు. మీకు చలివెయ్యడం లేదూ?

ఇన్: నేనూ మనిషినే కాని మానుని కాదుగా - ఈ స్వెట్టరు, కోటు ఉన్నా చలి ఆగకుండా ఉంది ... ఈ సంవత్సరం చలి విపరీతంగా ఉంది.

స్త్రీ: ఇస్... ఏం గాలి... రివ్వుమని... అబ్బబ్బ...

(పళ్ళు శబ్దం చేస్తుంది చలివల్ల)

ఇన్: కిటికీలు వేసేస్తాను...

స్త్రీ: వేసినా చలిపోదు....

ఇన్: కొంత తగ్గుతుంది కదూ? (ఒక కిటికీ మూస్తాడు.)

స్త్రీ: ఇంక ఈరాత్రి నిద్రపట్టినట్టే...?

ఇన్: కప్పుకోడానికేమీ లేదూ? నీ దగ్గర?

స్త్రీ: లేదు - అయినా అప్పుడే రెండయింది... ఇలా కూర్చుంటే తెల్లారిపోతుంది...

ఇన్: నా రగ్గు తీసుకో... నాకీ కోటు స్వెట్టరు చాలు...

స్త్రీ: మీ రగ్గా... ఒద్దొద్దు.

ఇన్: అంతగా ఆశ్చర్యపడకు...స[illegible] లేదు...చలికి మనుష్యులు బాధపడతారన్న జ్ఞానం నాకు లేదంటావా?

స్త్రీ: మీ నిద్ర పాడుచేసుకోకండి... నే నిలా కూర్చుంటాను...

ఇన్: మొగమాట పడకు...నాకివి చాలు... బొత్తిగా కప్పుకోకుండా ఎలా నిద్రపోతావ్? ఓ గంటన్నా నిద్రలేకపోతే పొద్దున్నకి చాలా నీరసంగా ఉంటుంది...

స్త్రీ: నాకు ఫరవాలేదు ... నిద్రలేకపోవడం నా కలవాటే...ఎటొచ్చీ మీకే.. నిద్రలేకపోతే పొద్దున్న లేస్తే పని మళ్ళా...

ఇన్: ఆ వర్రీపడకు...ఉండు తెచ్చి పడేస్తాను రగ్గు...ఇంద...ఇంక పడుకో... నే నిక్కడ కూర్చుంటాను...

స్త్రీ: మీ రెలా పడుకుంటారు?

ఇన్: నేను నిద్రపోను....

స్త్రీ: ఏం? నేను పారిపోతాననే... కాపలా కాస్తారా?

ఇన్: అబ్బే. కాదు ... సాయంత్రం కొంత నిద్రపోయేను..ఇంకా నిద్రరావటం లేదు...

స్త్రీ: అది చలివల్లనే... నాకేదీ అక్కర్లేదు...రగ్గు మీరు కప్పుకు పడుకోండి...

ఇన్: నన్ననవసరంగా చికాకు పెట్టకు.. నామాట విను...

స్త్రీ: మీ రలా కూర్చుంటే నాకూ నిద్ర రాదు...ఎంత కప్పుకున్నా...

ఇన్: ఎందుకబద్ధమాడాలి...నీకు కాపలాగానే ఉంటున్నాను...నువ్వు ఏ స్టేషన్లోనన్నా దిగిపోతే...?

స్త్రీ: (పకపక నవ్వుతుంది) ఆ వెర్రేమీ ఇంక లేదు...

ఇన్: సరే...ఇక పడుకో...

స్త్రీ: లేదు...ఇలా లాభంలేదు. మీరు కూర్చున్నా చలివెయ్యడం మానదుకదా... ఈ రగ్గు చాలా పొడుగ్గా ఉంది....ఒక కొస నేను లాక్కుని ఆ మూల కూర్చుని నిద్రపోగలను...ఈ కొస మీరు తీసుకొని అక్కడ కూర్చోండి.

ఇన్: నీకేం వర్రీ ... నాకేం బాధలేదంటూంటే నీకెందుకు [illegible] బాధ...

స్త్రీ: అలా అయితే మీరగ్గు మీరు తీసుకోండి ... నేను ఈపూట చలి ఓర్చుకోగలను...నా కలవాటే...

ఇన్: నాకు నిజంగా విసుగుపుడుతోంది.

స్త్రీ: కోపంకూడా రావచ్చు. కాని కోపంవస్తే చలిపోతుందా? నామాట వినండి ...అమూలకలా ఈ కొస లాక్కోండి...

|రైల్వే పోర్టర్ల గోల - ప్రక్కనుంచి ఇంజన్ల ఒగిర్పు - దూరంనుండి వాటి ఈలలు - రైలు ఆగుతుంది|

స్త్రీ: వచ్చేసింది మద్రాసు.

(టి. సి. వస్తాడు)

టి. సి: ఓయ్...కూలీ...

కూలి: బాబూ...

టి. సి: ఓయ్...నువ్వుకూడా ఇలారా... నువ్వీవిడ్ని ఆమీద వెయిటింగ్‌రూంలో కూర్చోపెట్టు... పనొచ్చేదాకా అక్కడ ఉంచండి ఫరవాలేదు...

స్త్రీ: ఏమో...నాకు జంకుగా ఉంది.... మీరూ రండి...

టి. సి: అయ్యో, మీ కేం బాధలేదు. మీ రక్కడ ఉండండి ... ఇన్‌స్పెక్టర్ గారి సామాన్లు పోలీసుల కిచ్చి; నాపని పూర్తి చేసుకుని ఒక్క అరగంటలో వచ్చేస్తాను...

స్త్రీ: ఏమో మరి...వెళ్తాను. కాని మీరు వేగం రావాలి...

టి. సి: హోయ్, ఆ పెట్టె, ఆ హోల్డాలు పట్టుకో...

ఇన్: మీకో బాధ అక్కర్లేదు...నేనే తీసుకుంటాను.

టి. సి: ఓ ... రామారావుగారు! మీ సామాన్లని గుర్తుపట్టలేనండి...మీ ఆఫీసుకి అప్పచెప్తామనే...ఏదో డిటెక్షన్ తగిలినట్టుంది...

ఇన్: రాత్రి నిద్రపట్టలేదు ... ఒక స్టేషన్లో ఊరికనే ప్లాట్‌ఫారంమీద దిగేసరికి నా స్నేహితుడొకాయన రైలెక్కుతూ కనిపించేడు...ఇప్పటివరకూ వాడితో పక్క పెట్టెలో కాలక్షేపం చేసేను...ఉండ హోయ్ చంద్రశేఖర్ వస్తున్నా...(ఓరకంట ఆమెను చూస్తూ వెళ్ళిపోతాడు.)

★



హిందీహాస్యనటి (లారాలప్పా) మీనా షోరీ.



నాట్యతార వైజయంతీమాల: ఈమె హిందీ 'దేవదాసు'లో చంద్రముఖిగా నటిస్తోంది.

* * * *

గ్యాన్ ముఖర్జీచిత్రం "సర్దార్"లో బీనారాయ్. ఈమె జెమినీవారి "ఇన్సానియత్"లో దిలీప్ కుమార్, దేవ్ ఆనంద్ లతో కలిసి నటిస్తోంది.



బొంబాయిసినిమా లేఖ

కిందటి నెల 23 వ తేదీన మహారాష్ట్ర తార ఉషాకిరణ్ వివాహపు మొదటి వార్షికోత్సవం జరిగింది. ఇందులో విశేషం ఏమిటంటే అది ఆమె స్వగృహంలో గాని, ఏహోటల్ లో గాని జరగలేదు. మెహబూబ్ స్టూడియో (బంద్రా)లో జరిగింది. స్టూడియోలోని ఉద్యోగులందరూ ఈ ఉత్సవంలో పాల్గొని జయప్రదంగా నిర్వహించారు. పెద్దవిందు జరిగింది. అతిథులు పలువురు హాజరయ్యారు. ముఖ్యంగా ఉషా కిరణ్ నటించబోయే సినిమాల నిర్మాతలందరూ హాజరయ్యారు.

* * *

ఫిల్మిస్తాన్ వారి ఇంగ్లీషు చిత్రం 'బోంబే ఫయిట్ నం. 417' పేరు శ్రీహుడెడ్ కోబ్రా (మూడు తలల త్రాచు) అని మార్చబడుతుంది. ఈ చిత్రంగూర్చి బొంబాయిలో అందరూ చిత్రవిచిత్రంగా అనుకుంటున్నారు. ఇందులో నటించే జాన్ లోడర్, అలెక్స్ డి అర్సీ, నిర్మాత విక్టర్ కటోనా తాము ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వాములమని చెప్పుకుంటున్నారు. ఆ అధికారంతో వారు నగరంలోని ధనిక యువతుల ననేకులను చిత్రంలోకి బుక్ చేయడానికిగాను ఇంటర్వ్యూ చేస్తున్నారు. నగరంలో ఇంగ్లీషువచ్చిన అభినేత్రులందర్నీ వీరు ఇప్పటికి ఇంటర్వ్యూ చేశారు. ఒక్కర్నీ, ఆఖరికి వినీతాదత్ ను కూడా వారు బుక్ చేయలేదు. ఇంకా అనేకులను ఇంటర్వ్యూ చేయబోతున్నారు. ఇటీవల ఈ చిత్రం యూనిట్ వారు శాంటాక్రజ్ విమానాశ్రయంలో 'లొకేషన్' దృశ్యాలు తీయడానికి వెళ్ళినప్పుడు షూటింగ్ మీదకంటె విలాసాలమీదే వారికెక్కువదృష్టి ఉన్నట్లు అనిపించింది. మొత్తంమీద ఏదెలాఉన్నా సినిమాస్కోప్ లోనూ, రంగులలోనూ తీయబడే ఈ చిత్రం చెప్పుకోదగిన చిత్రం కాగలదు.

* * *


బొంబాయి సినిమారంగంలో ఈద్ పండగ మహోత్సాహంగా జరుపుకున్నారు. నలభైరోజులూ ఉపవాసం చేశామని సురయ్యా, అమితా, షేక్ ముక్తార్ మొదలైన కొందరు చెబుతున్నారు. నిమ్మీ మాత్రం పనిలేనిరోజుల్లో మాత్రమే ఉపవసించానని చెబుతున్నది.

* * *

నిమ్మీ ఇటీవల 'వోర్లీ సీ ఫేస్'లో ఒక పెద్ద ఇంట్లోకి మారింది. అంటే ప్రతి మాదాస్ గుప్త, బీగంపారాల ఇరుగుపొరుగున ఆమె నివసించబోతున్న దన్నమాట. నిమ్మీ నిర్మించిన 'డంకా' చిత్రం ఆర్థికంగా అపజయంపొంది ఆమెకు చాలా ధనం నష్టమైంది. 'కస్తూరి' చిత్రం సెట్సుమీద పని చేస్తుండగా ఆమెకు వీపుమీద గాయంతగిలి అనేకబాధ గాతగూరయింది. ఇన్ కంటాక్స్ అధికారులతో పేచీవచ్చి అనేకబాధ అయింది. వీటన్నిటితో ఆమె ఈమధ్య నిరుత్సాహపడిందిగాని తిరిగి 'ఉరన్ ఖటోలా' విజయం పొందడంతో ఆమె అదృష్టం తిరిగినట్లున్నది.

* * *

ద్వితీయశ్రేణి బొంబాయి తార కృష్ణకుమారి ఒక ప్రకటన చేసింది. "*R*" అనే అక్షరంతో మొదలయ్యే మంచిపేరు (స్క్రీన్ నేమ్)తనకు ఎవరుసూచిస్తే, వారికి 50 రూ॥ల బహుమతి ఇస్తానని ఆమె ప్రక



జి. వి. యస్. ప్రొడక్షన్స్ వారి మొదటిచిత్రంలో అమర్ నాథ్, దైతాగోపాలం, రాజసులోచన.



"సాఖీ లూటేరా" అనే చిత్రంలో శశికళ.

టించింది. ఆమె అసలుపేరు రాజేంద్ర. 'కృష్ణకుమారి' అనే పేరు తనకు అదృష్ట దాయకంగా లేదని ఆమె భావిస్తోంది. ఆమె ఇటీవల నటించిన చిత్రాలు 'చాందినీచౌక్' 'నాగిన్'.

* * *

నర్తకి, ఇదివరకు సినిమాతార అయిన సితారా ఇంగ్లండు, ఇతర యూరపియన్ దేశాలు, అమెరికా వెళ్ళడానికి సన్నాహాలు చేస్తున్నది. కథక్ నృత్యపద్ధతిలో ఆమె అత్యుత్తమనర్తకి అని పేరుఉన్నది. విదేశాలలో ఆమె నృత్యప్రదర్శనాలిచ్చి, టెలివిజన్ తెరమీద కూడా ప్రదర్శనాలిస్తుంది. మొదటిసారిగా ఆమె విదేశాలకు వెడుతున్నందున, ఇటువంటి ప్రదర్శనాలలో అనుభవం ఆమెకు అట్టే లేనందున పొదుపుగా ఖర్చుచేయాలని ఆమెసంకల్పం. అందుకే తనవెంట ఆర్కెస్ట్రాబృందాన్ని తీసుకువెళ్ళకుండా టేప్‌రికార్డులను తీసుకు పోతున్నది.

* * *

సెన్సార్‌షిప్‌ను గూర్చి కాంగ్రెస్ కార్యవర్గం వెల్లడించిన అభిప్రాయాలపై ఇక్కడి సినిమా వర్గాలలో చాలా అలజడి బయలుదేరింది. సినిమా పరిశ్రమ ఏమైపోయినా నష్టపడనివారు ఆ పరిశ్రమను కంట్రోల్ చేయాలని ప్రయత్నిస్తున్నారని దీనివల్ల స్పష్టపడుతున్నట్లు పలువురు భావిస్తున్నారు. కాంగ్రెస్ కార్యవర్గంలోని సభ్యుల్లో బాగా పలుకుబడి ఉన్నవారు తమ పలుకుబడి ఉపయోగించి తమవారికి సినిమాల్లో ఉద్యోగాలిప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని మరికొందరు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ కార్యవర్గపు అభిప్రాయాలను తీవ్రంగా విమర్శించిన వారిలో ఎస్. ఎస్. వాసన్, ఎస్. కె. పాటిల్, వి. శాంతారాం. డిస్ట్రిబ్యూటర్ల సంఘాధ్యక్షుడు బి. కె. బరూచా ముఖ్యులుగా వున్నారు.

* * *

అసభ్యమైన జర్నలిజం మీద మద్రాసు తారలు చేసిన ఫిర్యాదును బొంబాయితారలు కూడా సమర్థిస్తున్నారు. అయితే తారలు బహిరంగంగా, ప్రజలసముఖంలో



విగిల్ ప్రొడక్షన్స్‌వారి "కన్యాదానం"లో ఒక దృశ్యం.

బొంబాయి సినిమాలేఖ

అసభ్యంగా ప్రవర్తిస్తే అది సమాజశ్రేయాని కి భంగకరమైన చర్య అవుతుందనీ, దానిని అందరికీ తెలియజేసి గర్హనీయంగా చిత్రించవలసిన అవసరం ఉందనీ ఇక్కడ పత్రికలవారు పలువురు భావిస్తున్నారు

ఐన్‌స్టీన్ జీవిత చిత్రం

ఈమధ్య కీర్తిశేషుడైన శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జీవిత విశేషాలను చిత్రం తీస్తామని హాలీవుడ్, వార్నర్ బ్రదర్స్ కంపెనీవారు ప్రకటించారు. చాలా భారీ ఎత్తున ఈ చిత్రం తీస్తారట. వార్నర్ బ్రదర్స్‌వారు ఇదివరలో చక్కని జీవిత కథాచిత్రాలు చాలా నిర్మించారు. లూయీ పాశ్చర్, జ్వారెజ్, ఎమిల్ జోలా, మొదలైన చిత్రాలు ఏనాటికీ పాతబడనివి. అదే కంపెనీవారు మహాపురుషుడైన ఐన్‌స్టీన్ జీవిత చిత్రం నిర్మించబోవడం ముదావహం.

*   *   *

హాలీవుడ్‌లో 1954 లో నిర్మించబడిన చిత్రాలు మూటికి 60 వంతులు రంగుల చిత్రాలని లెక్కవేయబడినది 1953 లో తెలుపు, నలుపు చిత్రాలే ఎక్కువ ఉన్నాయి 1954 లో రంగుల చిత్రాలు ఎక్కువ కావడానికి ముఖ్యకారణం సినిమాస్కోప్ పద్ధతి హెచ్చుగా వ్యాప్తిలోకి రావడమే. సినిమాస్కోప్ చిత్రాలన్నీ రంగులలోనే తీయబడుతున్నాయి

*   *   *

ఈ ఏడాది కానిస్ చలనచిత్రోత్సవంలో సోవియెట్ చిత్రాలు తమ పూర్వ ప్రతిష్ఠను నిలబెట్టుకున్నాయి మొత్తం 7 బహుమతులలో మూడు బహుమతులు సోవియెట్ యూనియన్‌కు లభించాయి 'రోమియో ఎండ్ జూలియట్' అనే బాలే చిత్రం ఉత్తమ సంగీత చిత్రం బహుమతిని పొందింది జూలియట్‌గా బాలెరినా గెలీనా ఉలనోవా, రోమియోగా యూరి జడనోవ నటించారు 'ఎ బిగ్ ఫామిలీ' అనే మరొక చిత్రానికి సామూహిక నటనలో బహుమతి వచ్చింది ఇది 1954 లో రష్యాలో తయారైన అత్యుత్తమ చిత్రమట. 'హీరోస్ ఆఫ్



మ నెల్లూ[illegible]ం భువనస్మారక కళా ఉత్సవాల రాష్ట్రీయ నాటకాల పోటీలలో ఉత్తమనటుడుగా బహుమతి పొందిన కె. వెంకటేశ్వరరావు.

"వదినెగారి గాజులు"

ప్రేక్షకుల అభిప్రాయాలు

రజనీకాంత్ గారి దర్శకత్వంతో తయారైన 'వదినగారిగాజులు' చిత్రం చాలా బాగున్నది. అంజలీదేవి ఉన్నతిస్థాయిలో నటించినది. అమరనాథ్ చక్కగా నటించాడు. సంభాషణలు చక్కగా ఉన్నాయి. ఫొటోగ్రఫీ అద్భుతంగా ఉన్నది. ఈ చిత్రానికి ముఖ్యముగా జీవంపోసిన బాలనటునికి నా అభినందనలు.

మేడిశెట్టి సత్యప్రసాద్,
—కాకినాడ.

* * *

గోకుల్ పిక్చర్సువారు తీసిన 'వదినగారి గాజులు' చాలా బాగా రాణించిందనుటకు ఏమీ సందేహము లేదు. అందుకు ఈ చిత్రము చూచినవారు కంట తడిపెట్టడమే నిదర్శనం. కాని 'వదినగారి గాజులు' అని పేరు పెట్టక 'వదిన' అని పెడితే చాలా బాగుండేది. చిన్న వాసుగా బాలనటుడు చాలా బాగా నటించాడు. పెద్ద వాసుగా చలం, వదినని అంతగా పొగడకూడదు. వదినలో మాట్లాడుతున్నప్పుడు ముఖ కవళికలు మార్చలేకపోయాడు. ప్రభగా జమున, అన్నగా అమరనాథ్, శాంతమ్మగా ఛాయాదేవి, వాసు మామగారుగా కుటుంబరావు బాగానే నటించారు. ఈ చిత్రానికి జ్యోతివంటి వదినగా అంజలీదేవి ప్రేక్షకులను కదలించివేసింది. అక్కడక్కడ అనవసరపు ఘట్టాలు వున్నవి. అవి తీసేస్తే బాగుండేది. ఘంటసాల సంగీతము కొంతవరకు బాగానే వున్నది. ముఖ్యముగా రజనీకాంత్ గారి దర్శకత్వము బాగా వున్నది. ఈ చిత్రాన్ని ఆంధ్రప్రజలకు సమర్పించిన గోకుల్ పిక్చర్సువారికి నా ధన్యవాదాలు.

వి. అప్పారావు,—విజయవాడ.

* * *

'వదినగారిగాజులు' చిత్రం బాగుంది. అంజలీదేవి, చలం, అద్భుతంగా నటించి చిత్రానికి జీవం పోశారు. మాటలు, పాటలు బాగున్నాయి. ఘంటసాలవారి సంగీతం వినసొంపుగా వుంది. బాలనటుడు, జమున, అమర్‌నాథ్, కుటుంబరావు, ఛాయాదేవి గారలు చక్కగా నటించేరు. మేకప్ బాగుంది. చక్కని ఆదర్శాలతో నిర్మించి దర్శకత్వంలో రజనీకాంత్ గారు ఒక నూతన పంథా తొక్కారు. ఈ చిత్రం తప్పక ప్రజాదరణ పొందగలదు.

అంట్యాకుల నాగారావు,
—విజయనగరం.

* * *

గోకుల్‌వారి రెండవ చిత్రము విజయవంతముగా నడచుచున్నది. ఘంటసాలవారి సంగీతము బాగున్నది మాటలు, పాటలు వినోదకరముగా సామెతలతో కూడియున్నవి. నటీనటులలో అమర్‌నాథ్, చలం, అంజలి, జమున, ఛాయాదేవి నటనలు ఉత్తమంగా నున్నవి. కుటుంబరావు ఇది

షిప్‌కా' అనే బల్గేరియన్ చిత్రాన్ని డైరక్టు చేసిన సోవియెట్ దర్శకుడు సెర్గీ వాసిల్యెవ్‌కు ఉత్తమదర్శకుడుగా బహుమతి లభించింది.

* * *


పిల్లల చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వంవేసిన పథకాన్ని అనుసరించి బాలచిత్ర సంఘం ఒకటి ఇటీవల ఢిల్లీలో స్థాపింపబడింది. దీనికి అధ్యక్షుడు పండిట్ హృదయనాథ్ కుంజ్రూ. ఉపాధ్యక్షుడు బి. జి. ఖేర్. కార్యవర్గంలో శంకర్స్ వీక్లీ సంపాదకుడు కె. శంకర్ పిళ్లే, శ్రీ ఎన్. సర్కార్, వి. శాంతారాం, శ్రీ సుబ్రహ్మణ్యం మున్నగువారున్నారు.

* * *

సైగల్ జీవిత కథాచిత్రానికి ఇటీవల కలకత్తా, న్యూథియేటర్స్ స్టూడియోలో ప్రారంభోత్సవం జరిగింది. షూటింగ్ ఈ నెలలో ప్రారంభమవుతుంది.

మద్రాసులో హిందీ తారలు

పేరుపొందిన బొంబాయితారల్లో అనేకులు మద్రాసు సినిమారంగంపై దండయాత్ర ప్రారంభించారు. జెమినీ, ఎ వి ఎమ్. సంస్థల హిందీ చిత్రాలలో పనిచేయడం కోసం వరసగా హిందీతారలు మద్రాసు వస్తున్నారు. జెమినీవారు "ఇన్సానియత్", ఎ వి. ఎమ్ వారు "భాయ్ భాయ్" "చోరీ చోరీ" చిత్రాలు తీస్తున్నారు. వీటిల్లో దిలీప్‌కుమార్, దేవ్ ఆనంద్, బీనారాయ్, నైరాజ్, ఆగా, శోభనసమర్థ, విజయలక్ష్మి, రాజ్ కపూర్, నర్గీస్, నిమ్మీ, కిశోర్ కుమార్, భగవాన్, డేవిడ్ మున్నగువారు బుక్ అయ్యారు. ★



సోవియెట్ టర్క్‌మెనిస్థాన్‌కు చెందినన్నృత్యపద్ధతి: ద్రాక్షపండ్ల నృత్యం.



బిమల్ రాయ్ తీస్తున్న హిందీ "దేవదాసు"లో పార్వతిపాత్ర ధరించే, బెంగాలీ తార సుచిత్రా సేన్.

దొంగ ఒక యింటికి కన్నం వేశాడు. కాని డబ్బుతీసే సమయంలో దొరికిపోయినాడు. ఇంటియజమాని బాగా తిట్టి పొమ్మన్నాడు. దొంగ గొణుక్కుంటూ బయలుదేరాడు.

"ఏమిట్రా? గొణుగుతున్నావ్?"

"ఏం లేదు బాబూ! పూట కష్టపడి కన్నం త్రవ్వాను. కూలి డబ్బులుకూడా గిట్టలేదు."

"ఔనోయ్, నిజమే! ఏమేవ్! ఒకరూపాయి తీసుకొచ్చి వీడికియ్యి."

కములా రామమోహనరావు, కాకినాడ.

ప్రేక్షకుల అభిప్రాయాలు

వరకట చిత్రములలోకన్న బాగా సమర్థతతో నటించెను చిన్నప్పటి వాసుగా నటించిన బాలనటుడు ఉత్తమంగా నటించినాడు

తేతలి వెంకట సీతారామయ్య,
— తాడేపల్లిగూడెము.

*   *   *

'వదినగారి గాజులు' చిత్రం అనుకున్నంత గొప్పగా లేదు. పాటలు ఏమీ బాగాలేవు. అంజలీ, అమర్‌నాథ్, జమునల నటన బాగుంది. రజనీకాంత్ యికముందు మంచి చిత్రాలను నిర్మించి మంచి పేరు సంపాదించగలరని నే నాశిస్తున్నాను

కొమ్మూర్మి సోమ శేఖర రావు,
— పేరుకలపూడి,
తెనాలి తా॥

దక్షిణ భారత ఫిలిం వాణిజ్య మండలి

పై మండలివారు 1955-56 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని ఇటీవల ఎన్నుకొన్నారు. ఎస్. ఎస్. వాసన్ గారిని తిరిగి అధ్యక్షులుగా ఎన్నుకున్నారు ఉపా


ధ్యక్షులుగా ఎ. వి. మెయ్యప్ప చెట్టియార్, గౌరవ కార్యదర్శులుగా బి. నాగిరెడ్డి, డి. కెంపరాజ్, కోశాధికారి కె. ఎస్. నారాయణ అయ్యంగార్ ఎన్నుకోబడినారు. ప్రస్తుతం ఈ మండలిలో 10 మంది స్టూడియో యజమానులు, 6 గురు డీలర్లు, 41 మంది నిర్మాతలు, 31 మంది డిస్ట్రిబ్యూటర్లు, 126 గురు ఎగ్జిబిటర్లు, 47 గురు విడి వ్యక్తులు సభ్యులుగా ఉన్నారు. మరి రెండు టెక్నికల్ సర్వీసులకు, 5 అనుబంధ సంఘాలకు కూడా సభ్యత్వం ఉన్నది

పరిణీత, అనార్కలీ నిర్మించిన అంజలీ పిక్చర్సువారు తమ మూడవ నిర్మాణంగా ఒక హాస్య చిత్రం తీస్తామని ప్రకటించారు. దీని కింకా పేరు పెట్టలేదు నాలుగవ చిత్రంగా 'శకుంతల' నిర్మిస్తామనికూడా వీరు ప్రకటన చేశారు. కాళిదాసు నాటకాన్ని అనుసరించి ఈ చిత్రం ఉంటుందని కూడా ప్రకటింపబడింది

*   *   *

ప్రకాశ్ వారి "అంతే కావాలి" చిత్రం త్వరలో విడుదల కాగలదని ప్రకటింపబడింది. ఈ చిత్రంలో జి. వరలక్ష్మి, మాలతి, శ్రీరాం, సి. ఎస్. ఆర్., జగ్గయ్య, జోగారావు, రమణారెడ్డి, డా॥ శివరామకృష్ణయ్య, లక్ష్మీకాంత మున్నగువారు నటించారు. దర్శకుడు ప్రకాశరావు.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, ThambuChetty St Madras



కపోత మిథునము

—ఫొటో: పి. రామారావు, రాజమండ్రి.